చరిత్ర

# భారతీయ విజ్ఞానము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# భారతీయవిజ్ఞానము


ర చ యి త:

ఆ ర్ష వి ద్యా భూ ష ణ

జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ.

సత్యనారాయణపురము

వి జ య వా డ

# విషయసూచిక


౧. భారతీయ విద్యలు (పుటలు 1–20)

ముఖ్యవిద్యలు, కళలు, విశిష్టలక్షణములు

౨. కల్యాణసాహిత్యము (పుటలు 21–51)

వేదవిస్ఫూర్తి: గ్రంథముల శాసకత్వము, పాత్రచిత్రణము, రమ్యత్వధర్మ్యత్వ సమ్మేళనము, ధర్మపారంపర్యము, ఉపసంహారము.

౩. సాహిత్యము—బహుముఖభారతీయ సంస్కృతి (వ్యాఖ్యానావశ్యకత) (పుటలు 52–65)

శ్రుతులు, ధర్మశాస్త్రము, సంగీతము, వైద్యశాస్త్రము, జ్యోతిషాదిశాస్త్రములు.

౪. నేటిసైన్సుకు అందని విజ్ఞానము (పుటలు 65-88)

ఆధునికుల ప్రత్యక్షానుభవము, జ్యోతిష్యము. సాముద్రిక శాస్త్రము, మంత్రవిద్య, యోగశాస్త్రమునకు ఆధునికుల జోహార్లు, ఉపసంహారము.

౫. భౌతికశాస్త్రములు (పుటలు 89 -130)

గణితశాస్త్రము, ఖగోళశాస్త్రము. పదార్థవిజ్ఞానశాస్త్రము, రసాయనాది శాస్త్రములు: ఆయుర్వేదము, వికీర్ణశకలములు, గ్రంథోపసంహారము.

౬. భారతీయసంస్కృతి ప్రభావితులైన పాశ్చాత్యులు

(అనుబంధాధ్యాయము) (పుటలు 130–152)

మాక్సుముల్లర్, డాక్టర్ అనిబిసెంట్, మనుల్యాకమన్, ఎడ్విన్ అర్నాల్డ్. రాల్ఫ్, టి. హెచ్. గ్రిఫిత్, సర్ థామస్ మన్రో, సోదరి నివేదిత, ఆంగ్లసాహిత్యాధినేతలు, టి. ఎస్. ఇలియట్ ప్రశంసావచనములు.

# భారతీయ విజ్ఞానము.

## ౧. భారతీయ విద్యలు.

### -: ముఖ్య విద్యలు. :-

ప్రాచీన భారతీయవిజ్ఞాన సముద్రమెంత విస్తీర్ణమైనదో యంత లోతైనది. సంస్కృతవాఙ్మయములో బహుస్థలములలో విద్యలను గురించిన ప్రస్తావనగలదు. కొన్నిచోట్ల విద్యలు పేర్కొనబడినవి; కొన్నిపట్ల వీని వివరము లీయబడినవి; కొన్ని యెడల నావిద్యలలోని విషయము లుద్ఘాటింపబడినవి. కొన్ని విద్యలకు సంబంధించిన ప్రత్యేకప్రమాణగ్రంథములు నేటికిని నిలచి యున్నవి. అనేకగ్రంథములు లోపించినవి. వాఙ్మయములో ననేక స్థలములలో ప్రసక్తాను ప్రసక్తముగా బహుశాస్త్ర విషయక విజ్ఞానశకలములు వికీర్ణములై యున్నవి. ఇతరవిధములుగాకూడ ప్రాచీనవిజ్ఞాన చిహ్నములనేకములు నేటికిని లభించుచున్నవి. మచ్చునకట్టివానిని కొన్నింటిని మరొకప్రకరణమున చూచెదము. ప్రాచీన వాఙ్మయములో పేర్కొనబడిన కొన్నివిద్య లిచట నిర్దేశింపబడుచున్నవి.

ఛాందోగ్యోపనిషత్తులో కొన్నివిద్యలు పేర్కొనబడినవి. ఆత్మజ్ఞానమును ప్రసాదింపవలయునని నారదుడు సనత్కుమారుని ప్రార్థింపగా, "నీవిదివరకే యేవిద్యలను నేర్చితివి?"

అని సనత్కుమారుడు ప్రశ్నించెను. అంత నారదుడు సనత్కుమారునితో నిట్లనెను.

ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థమితిహాసపురాణం పంచమం వేదానాం వేదం పిత్ర్యం రాశిం దైవం నిధిం వాకోవాక్య మేకాయనం దేవవిద్యాం బ్రహ్మవిద్యాం భూతవిద్యాం క్షత్రవిద్యాంనక్షత్ర విద్యాంసర్ప దేవజన విద్యామేతద్భగవోఽధ్యేమి. (7-1-2)

"ఓ ప్రభూ, ఋగ్వేదమును,యజుర్వేదమును, సామవేదమును, అధర్వవేదమును, ఇతిహాస పురాణములనెడు పంచమ వేదమును, వేదార్థమును తెలియజేయున వగుటచే వేదములకు వేదమనదగిన నిరుక్తవ్యాకరణాదివిద్యను, పిత్ర్యశ్రాద్ధకల్పమును, గణితమును, శకునాది దైవవిద్యను, తర్కమును, నీతి శాస్త్రమును, దేవవిద్యను బ్రహ్మవిద్యను, భూతవిద్యను, క్షత్ర విద్యను, నక్షత్రవిద్యను సర్పదేవజనవిద్యను నే నధ్యయనము చేసినాను''.

ఋగ్యజుస్సామాథర్వ వేదములు నాలుగు, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము- అను వేదాంగములు ఆఱు, పూర్వోత్తర విభాగముగల మీమాంస, న్యాయశాస్త్రము, పురాణము, ధర్మశాస్త్రము- ఈ పదునాల్గును విద్యలని మనువు చెప్పియున్నాడు.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః
పురాణం ధర్మశాస్త్రంచ విద్యాహ్యేతాశ్చతుర్దశ,

వేదము, న్యాయపరిపాలనశాస్త్రము, తర్కము, ఆత్మ విద్య (బ్రహ్మవిద్య) కృషివాణిజ్యవిద్య - అను నయిదు విద్యలను మనువు మరొకస్థలమున పేర్కొనియున్నాడు.

త్రైవిద్యేభ్యస్త్రయీం విద్యాం దండనీతించ శాశ్వతీం
ఆన్వీక్షికీంచాత్మ విద్యాం వార్తారంభాశ్చ లోకతః. (7-43

బుద్ధు డీక్రిందివిద్యలను నేర్చెనని లలితవిస్తరములో కలదు. (లలిత విస్తరము క్రీ. శ. మొదటి శతాబ్దినాటి గ్రంథము) నిఘంటు, ఛందస్సు, యజ్ఞకల్పము, జ్యోతిషము, సాంఖ్యము, యోగము, వైశేషికము, అర్థవిద్య, బార్హస్పత్య విద్య, ఆశ్చర్యవిద్య, అసురవిద్య, మృగపక్షిరుతజ్ఞానము, హేతువిద్య.

క్రీ. శ. ఏడవశతాబ్దిలో బాణునిచే రచింపబడిన కాదంబరినిబట్టి యానాడు రాజకుమారులు సాధారణముగా అభ్యసించుచుండిన విద్యలేవో తెలియుచున్నవి. చంద్రాపీడుడు గురుకులములో నీక్రిందివిద్యల నభ్యసించెనని బాణుడు చెప్పుచున్నాడు.

వ్యాకరణము, మీమాంస, తర్కము, ధర్మశాస్త్రము, రాజనీతి, వ్యాయామవిద్య, ఆయుధవిద్య, రథచర్య, గజవిద్య, తురంగవిద్య, వీణావేణు మృదంగాదివాద్యవిద్య, భరతాది ప్రణీత నృత్తశాస్త్రములు, నారదాదులు రచించిన సంగీత విద్యలు, పక్షిధ్వనిజ్ఞానము, యంత్రప్రయోగము, విషము పోగొట్టుట, సురంగములను త్రవ్వుట, ఈత, దూర

ముగా దూకుట, ఎత్తుగాదూకుట, పర్వతాదుల నారోహిం చుట, సర్వలిపులను వ్రాయుట, చదువుట, సర్వదేశభాషా జ్ఞానము, ఇతర కళావిశేషములు.

"పదే, వాక్యే, ప్రమాణే, ధర్మశాస్త్రే, రాజనీతిషు వ్యాయామవిద్యాసు, సర్వేష్వపి ఆయుధవిశేషేషు, రథ చర్యాసు, గజపృష్ఠేషు, తురంగమేషు, వీణావేణుమురజప్రభృ తిషు వాద్యేషు, భరతాదిప్రణీతేషు నృత్తశాస్త్రేషు, నార దీయ ప్రభృతిషు గాంధర్వవేదవిశేషేషు, శకునిరుతజ్ఞానే. యంత్రప్రయోగే, విషాపహరణే, సురంగోపభేదే, తరణే, లంఘనే, ప్లుతిషు, ఆరోహణే, సర్వలిపిషు, సర్వదేశభాషాను, అన్యేష్వపికళావిశేషేషు పరంకౌశల మవాప."

పురాణములలో ననేక విద్యలు పేర్కొనబడినవి. మోహనవిద్య, వశ్యవిద్య, ఖేచరీవిద్య (ఆకాశగమనము) విష చికిత్స, విశోషిణి (నీటిని ఇంకింపచేయుట) గర్భస్థశిశువును పురుషునిగాచేయువిద్య, పంచేంద్రమంత్రవిద్య (వర్షము కురి పించువిద్య), కాళీకరాళమంత్రము, (విషము, అజీర్తిమున్నగు వానిని పోగొట్టునది), అదృశ్యత్వము గల్గించువిద్య, సార్ప విద్య, సంజీవని, మృత్యుంజయవిద్య మున్నగువిద్యలు స్కాంద పురాణములో పేర్కొనబడినవి.

ధనుర్విద్య, అస్త్రవిద్య, మంత్రాహ్వానవిద్య, మంత్ర విసర్జనవిద్య, శత్రుజయవిద్య, దేవహూతివిద్య, (దేవతల నాహ్వానించువిద్య) చిత్రలేఖనము, గుప్తవిద్య, యక్షమయా

విద్య (స్వర్ణప్రదము) మున్నగు శతసంఖ్యాకవిద్యలు పురాణ ములలో పేర్కొనబడినవి.

అణిమ (రూపమును కుదింపచేసికొనుట), మహిమ (రూపమును పెంచుట), గరిమ (బరువులో పెరుగుట), లఘిమ (బరువులో తగ్గుట), ప్రాప్తి (కోరినదానిని పొందగల్గుట), ప్రాకామ్యము (నిర్విఘ్నసంచారశక్తి), ఈశత్వము (సర్వాతి శాయిత్వము), దూరదర్శన దూరశ్రవణాదులు— యోగముచే సిద్ధింపగలవని చెప్పబడియున్నది.

రత్నశాస్త్రము, అశ్వశాస్త్రము, గజశాస్త్రము, స్థాప త్యము, వాస్తుశాస్త్రము, వృక్షాయుర్వేదము, మున్నగువిద్య లెన్నియో పేర్కొనబడియున్నవి. వానిపై ప్రమాణగ్రంథ ములునేటికిని నిలచియున్నవి. చెట్లను అకాలములో స్వల్పవ్యవ ధిలో పుష్పింపచేయువిద్య, రత్నావళిలో పేర్కొనబడినది. ఆయుర్వేదము, ధనుర్వేదము, అర్థశాస్త్రము, గాంధర్వవిద్య ఉపవేదములుగా చెప్పబడినవి.

మహాద్భుతములను సాధింపగల మంత్రానుష్ఠానము లకు కూడ విద్యాశబ్దము వాడబడియున్నది. విశ్వామిత్రుడు రామునకు బల, అతిబల యను రెండుమంత్రముల నుపదేశిం చెను. ఆరెండువిద్యలను గురించి విశ్వామిత్రుడు రామునితో, నిట్లు చెప్పుచున్నాడు.

గృహాణవత్ససలిలం మాభూత్కాలస్య పర్యయః
మంత్రగ్రామం గృహాణత్వం బలామతిబలాం తథా.

నశ్రీమోనజ్వరో వాతో నరూపస్య విపర్యయః
నచసుప్తం ప్రమత్తంవాధర్షయిష్యన్తినైరృతాః
నబాహ్వోస్సదృశో వీర్యేపృథివ్యామస్తి కశ్చన
త్రిషులోకేషు వైరామ నభవేత్సదృశస్తవ.
న సౌభాగ్యే న దాక్షిణ్యే నజ్ఞానేబుద్ధినిశ్చయే
నోత్తరే ప్రతివక్తవ్యే సమోలోకేతవానఘ॥
ఏతద్విద్యాద్వయేలబ్ధే భవితా నాస్తి తే సమః
బలాత్వతి బలాచైవ సర్వజ్ఞానస్య మాతరా
క్షుత్పిపాసేనతేరామ భవిష్యేతే నరోత్తమ
బలామతి బలాం చైవ పఠతః పథిరాఘవ.........

(శ్రీమద్రామాయణము, బాలకాండము, 22వ సర్గ. 13-18)

"వత్స, రామ, ఉదకము తీసికొనుము; కాలయాపనమువద్దు; మంత్రములను తీసికొనుము; బల, అతిబల యను మంత్రములనుకూడ గ్రహింపుము. వీనివలన నీకు శ్రమ లేకుండపోవును. జ్వరముండదు; వాతబాధయుండదు; రూపములో చెరుపురాదు. నీవు నిద్రించియున్నను, పొరబాటుగానున్ననుకూడ రాక్షసులు నిన్ను అదలింపజాలరు. ఓపరహితుడా, బాహుపరాక్రమములో నీకు సమానులీపృథివిలో నుండరు. ముల్లోకములలోను నీకు సమానులుండరు, సౌభాగ్యములోను, దాక్షిణ్యములోను, జ్ఞానములోను, బుద్ధినిశ్చ

యములోను, సమాధానముచెప్పుటలోను, ప్రతివాదములోను నీకీలోకములో సమానుడుండడు. బల, అతిబల యనువిద్యలు సర్వజ్ఞానమునకు తల్లులు. ఓరామ, నరోత్తమ, మార్గములో బలాతిబలలను పఠించు నీకు క్షుత్పిపాసలుండవు..."

తైత్తరీయబ్రాహ్మణములో కన్య అభీష్టవరుని హృదయము నాకర్షించువిద్య పేర్కొనబడినది. (2-3-10-44)

ఇట్టివిద్య లసంఖ్యాకములు గలవు.

బ్రహ్మజ్ఞానసాధకములైన ఉపాసనలుకూడ విద్యాశబ్దముచే వ్యవహరింపబడుచున్నవి. పంచాగ్నివిద్య, ప్రాణవిద్య, శాండిల్యవిద్య, వైశ్వానరవిద్య, మధువిద్య—మున్నగు విద్యలు ఉపనిషత్తులలో ప్రసిద్ధములై యున్నవి.

మోక్షప్రదమైనవిద్య పరవిద్య (పరావిద్యా)యనియు ఇతరవిద్యలన్నియు అపరవిద్యలనియు చెప్పబడును. ఈయపర విద్యలనుకూడ పారమార్థికప్రయోజనమున కుపయోగించు కొనవలయుననునది భారతీయసంప్రదాయము.

## —: క ళ లు :—

వాచికమైనది విద్యయనియు, మూగవానికి కూడ సాధ్యమైనది కలయనియు ప్రాచీనులు వివక్షచేసిరి.

యద్యత్స్యాద్వాచికం సమ్యక్కర్మవిద్యాభిసంజ్ఞకం
శక్తోమూకోపి యత్కర్తుం కలాసంజ్ఞం తంతత్స్మృతం,

అని శుక్రనీతిసారము నిర్వచించుచున్నది (4-3-25). అభ్యాసముచేత ప్రియోగింపదగినది కళయనికూడ శుక్ర నీతిలో కలదు. దీనికనుగుణముగనే గురుబాలప్రబోధికలో "శిల్ప్యతే అభ్యస్యతే ఇతిశిల్పం. శిల్ప్యతే అభ్యస్యతే, శీలఉప ధారణే, ఉపధారణమభ్యాసః" అని వ్యాఖ్యానింపబడినది.

కళాశిల్పములనడుమ భేదముతీయుటకు కొందరు ప్రయత్నించినను కళాశిల్పశబ్దములు పర్యాయపదములేయని యమరసింహుడు స్పష్టముగా చెప్పియున్నాడు.

"కళాశిల్పే కాలభేదే"

కలాశబ్దనిర్వచనమునుకూడ పరికింపదగును. "కల్యతే ఇతికలా" (కలసంఖ్యానే). విద్యలలోనొకటి గా లెక్కపెట్టదగి నది కలయనబడును. "సుషుమావిద్యయోస్త్రథా" యనికూడ అమరసింహుడు చెప్పుటచే నీతనిమతమున కళలును, శిల్పము లును విద్యలలో భాగములేయనుట స్పష్టము.

విద్యలుకాని కళలుకాని యెన్నియనునది యంతముఖ్య విషయముకాదు. కొందరొకదృష్టితో లెక్కపెట్టగా మరికొంద రింకొకదృష్టితో పరిగణించినారు. అన్నింటిని కలిపి విద్యలనుగా గణింపదగును; అరువదినాలుగు కళలపట్టికలను భిన్నభిన్నము లనుగా పలువురు ప్రాచీనులిచ్చియున్నారు. అందొక పట్టిక యిట్లు కలదు.

ఇతిహాసము, ఆగమము, కావ్యము, అలంకారము, నాటకము, గాయకత్వము, కవిత్వము, కామశాస్త్రము,

దురోదరము, దేశభాషాలిపిజ్ఞానము, లిపికర్మము, వాచకము, అవధానము, స్వరశాస్త్రము, శాకునము, సాముద్రికము, రత్నశాస్త్రము, రథాశ్వగజకౌశలము, మల్లశాస్త్రము, సూదకర్మము, దోహదము, గంధవాదము, ధాతువాదము, ఖనివాదము, రసవాదము, జలవాదము, అగ్నిస్తంభము, ఖడ్గస్తంభము, జలస్తంభము, వాక్స్తంభము, వయస్తంభము, వశ్యము, ఆకర్షణము, మోహనము, విద్వేషణము, ఉచ్చాటనము, మారణము, కాలవంచనము, పరకాయప్రవేశము, పాదుకాసిద్ధి, వాక్సిద్ధి, ఘటికాసిద్ధి, ఐంద్రజాలికము, అంజనము, దృష్టివంచనము, స్వరవంచనము, మణిమంత్రౌషధసిద్ధి, చోరకర్మము, చిత్రక్రియ, లోహక్రియ, అశ్మక్రియ, మృత్క్రియ, దారుక్రియ, వేణుక్రియ, చర్మక్రియ, అంబరక్రియ, అదృశ్యకరణము, దూతీకరణము, మృగయ, వాణిజ్యము, పాశుపాల్యము, కృషి, ఆసవకర్మము, ప్రాణిద్యూతకౌశలము.

ఆయాపట్టికలలోని మరికొన్నికళలిట పేర్కొనబడుచున్నవి: పరిమళతైలాదులనుచేయుట, దంతములకు, వస్త్రములకు ఓష్ఠములకు రంగువేయుట, పునర్యౌవనమును గల్గించుట, కుట్టుపని, వస్త్రములనేత, సమస్యాపూరణము, వడ్రంగము, లోహశాస్త్రము, అష్టావధాన శతావధానములు, రసవిద్య, రాళ్లనుండి లోహములను తీయువిద్య, ఆయాలోహములను (ధాతువులను) కలుపుట, కలిసినలోహములను విడదీయుట. గాజు (కాచ) వస్తువులను నిర్మించుట—ఇట్టి బహుశతకళలు పూర్వమీదేశమున నైపుణ్యముతో నభ్యసింపబడుచుండెను.

పైని పేర్కొనబడిన విద్యలను కళలను నుంచి లోకములో నే విజ్ఞానశాఖయైనను ఉండగలదాయను సందేహము కలుగును.

## విశిష్టలక్షణములు.

ఏదేశపుప్రాచీనవిద్యలలోను కన్పట్టని హేతుబద్ధత, వివేచనము, లోతు, పారమార్థికత భారతీయవిద్యలలో కాంచనగును.

ఏచిన్నవిషయమును తీసికొన్నను నిది స్పష్టమగును. ఉదాహరణమునకు వర్ణమాలను తీసికొందము. యూరపియను భాషలలోని ఎ. బి. సి. డి. మున్నగు వర్ణమాల హేతుబద్ధముకాదు. భారతీయుల వర్ణమాలలో అ ఆ ఇ ఈ మున్నగు అచ్చులుకాని క వర్గము, చ వర్గము మున్నగుహల్లులుకాని యాక్రమములోనేయెందులకుండవలయు ననునది హేతుబద్ధమైనది. అకారమునకు కంఠముత్పత్తి స్థానము; ఇకారమునకు తాలు వుత్పత్తిస్థానము; ఉకారమునకు ఓష్ఠములుత్పత్తిస్థానము. వర్ణములధ్వని పైకివచ్చునపుడు అన్ని స్థానములకంటె ముందు కంఠము దానితర్వాత తాలువు, ఆతర్వాత ఓష్ఠములు ఉండుటచే నీక్రమము ననుసరించి యూ యా యచ్చులక్రమము, హల్లులక్రమము నిర్ణయింపబడినది. మఱియు హల్లులక్రమమునకుకూడ నిట్టి హేతుబద్ధత కలదు. శ్వాసనాదఘోషాల్పప్రాణ మహాప్రాణాదిలక్షణములను బట్టి

కూడ వానిక్రమము నిర్ణయింపబడినది. అంతస్థులు, ఊష్మములు మున్నగునవి వేర్వేరుగా విభజింపబడి వర్ణమాలలో ఉచిత స్థానమునకూర్పబడినవి. ఇట్టియేర్పాటు మరియేభాషలోను లేదు. ఏయక్షర మెక్కడపుట్టునో ప్రాచీనకాలములో భారతీయులుతప్ప మరెవ్వరును చెప్పియుండలేదు. 19వ శతాబ్దిలో బయలుదేరిన ఫైలాలజియను భాషాసాదృశ్యశాస్త్రమును నిర్మించుకొనుటలో పాశ్చాత్యులు భారతీయవైయాకరణుల యిట్టి విమర్శజ్ఞానము నుపయోగించుకొనిరి.

పరిభాషానిర్మాణములోను, లక్షణనిర్వచనములోను, విషయవిభాగములోను భారతీయశాస్త్రప్రణేతల వివేచన శక్తి నిరుపమానము. పంచజ్ఞానేంద్రియములు, పంచకర్మేంద్రియములు, పంచతన్మాత్రలు, షడూర్ములు, అరిషడ్వర్గము, చతుర్విధపురుషార్థములు, గుణత్రయము, షడ్విధలింగములు, అనుబంధచతుష్టయము మున్నగు పరిభాషలు విజ్ఞాన పూరితములై భారతీయుల వేదనశక్తికి (Analytical faculty)కిచీ శాశ్వతచిహ్నములుగా నున్నవి.

ఏశాస్త్రములోనైనను ప్రాచీనకాలములో భారతీయులు వెళ్లినంతలోతు నకు మరియేదేశస్థులును వెళ్లలేదు. ప్రాచీన ఋషులేకాక తరువాతి ఆచార్యపురుషులును, వ్యాఖ్యాతలును కూడ నీవిషయమున అద్భుతగ్రంథములను మనకు ప్రసాదించినారు. పతంజలి మహాభాష్యములోను, ఆచార్యపురుషుల బ్రహ్మసూత్రభాష్యములలోను మానవబుద్ధి పరమావధిగోచ

రించుచున్న దనుటలో నతిశయోక్తిలేదు. అట్లే తర్కశాస్త్రములో మూలగ్రంథములేకాక జగదీశగదాధర సంప్రదాయముల గ్రంథములుకూడ లోకోత్తర ప్రతిభావిలసితములై యున్నవి. భారతీయవిద్యల మహత్త్వము వైదేశికుల నెంతగా నాకర్షించినదో మరొక ప్రకరణమున చూడగలము.

ఇతర దేశస్థులకు బొత్తుగాతట్టని విషయములపైకూడ భారతీయగ్రంథములలో గంభీర విచారణము కలదు.

మనము నోటితో శబ్దముల నుచ్చరించుచున్నాము. వాయురూపముగా శబ్దము వచ్చుచున్నది. ఆశబ్దమెట్లెందులకు వచ్చుచున్నదో విచారించినవారు భారతీయులు మాత్రమే, 'రామ' అనుధ్వని పైకెందులకువచ్చుచున్నది? 'రామ' యనవలయునను సంకల్ప మొకటిలోపల బయలుదేరి గాలిని పైకి నెట్టుచున్నది. అదిసంకల్పముయొక్క బలము. రామయనుధ్వని వెలువడుటకు పూర్వముండిన సంకల్పమే ధ్వనికికారణమైనది ఆసంకల్పమునకుకూడ వెనుక నింకను సూక్ష్మతరములును, బలీయములును అగు ఆత్మస్పందనములు కలవు. చివరిస్థితిలో మాత్రమే మనము వాక్కును వ్యవహరింపగల్గుచున్నాము, జ్ఞానరూపబ్రహ్మమునకును శబ్దరూపబ్రహ్మమునకును గల సంబంధము చతుర్విధ వాగ్రూపముగా వ్యాఖ్యానింపబడినది. "పరా, పశ్యన్తీ, మధ్యమా, వైఖరీ" యను నాలుగువిధములైన వాక్కులలో పూర్వపూర్వము అంతరము, ఉత్తరోత్తరము బాహ్యము. నాల్గవవాక్కును (వైఖరీవాక్కును) మాత్రమే సామాన్య

మానవులు మాట్లాడుచున్నారు. 'వేదములలోకూడ "తురీయం వాచో మనుష్యావదన్తి" అని చెప్పబడినది. "పశ్యన్తీ, మధ్యమా" వాక్కులను తెలిసికొనువిజ్ఞులుకూడకలరు. వారు పక్షులభాష నర్థము చేసికొనగల్గుదురు. జ్ఞానులు మాత్రమే "పరా" వాక్కును గ్రహింపగల్గుదురు.

చత్వారి వాక్పరిమితాని పదాని
తాని విదుర్బ్రాహ్మణాయే మనీషిణః
గుహా త్రీణి నిహితా నేంగయంతి
తురీయంవాచో మనుష్యా వదన్తి.

భావప్రకటనకొఱకు వృక్షములు 'పరా' వాక్కును, పక్షులు 'పశ్యన్తి' వాక్కును, పశువులు 'మధ్యమా' వాక్కును మనుష్యులు 'వైఖరీ' వాక్కును ఉపయోగింతురు.

పరావృక్షేషు యా వాక్సా
పశ్యన్తీ పక్షిషుస్మృతా
మధ్యమాపశు షుప్రోక్తా
మనుష్యేషు చ వైఖరీ.

ఆత్మ పలుకదలచినదై మనస్సును ప్రేరేపించును; మనస్సు దేహములోని యగ్నిని రగుల్కొల్పును; ఆవహ్ని వాయువును ప్రేరేపించును. "ఆత్మా వక్ష్యమాణోఽయం మనః ప్రేరయతే; మనో దేహస్థం వహ్నిమాహన్తి, సప్రేరయతి మారుతం"

పలువిధములుగా మన ప్రాచీను లీనాగరిహస్యమును వ్యాఖ్యానించియున్నారు. కాశీఖండములోని చతుర్విధ వాగ్వివరణమునకు శ్రీనాథుని యనువాదము నిందు పొందుపరచుచున్నాను. (3-49)

"శబ్దబ్రహ్మము కారణబింద్వాత్మకమై బిందునిస్పంద త్వమున పురుషచ్ఛాయాప్రయత్నమున మూలాధారావస్థిత పవనసంధుక్షణమున నభివ్యక్తమై పరావాక్కనంబడును. ఆబ్రహ్మము నాభిపర్యంతము నావాయువుచేత నభివ్యజ్యమానమై విమర్శరూపమైన మనస్సుతోఁగూడి సామాన్యస్పంద ప్రకాశరూపిణియు, కార్యబిందుతత్త్వాత్మికయు, నీశ్వరాధిదేవతయునై పశ్యన్తి వాక్కనబడును. ఆబ్రహ్మవాయువుచేతనే హృదయపర్యంతమభివ్యజ్యమానమై నిశ్చయాత్మకబుద్ధియుక్తమై విశేషస్పందస్వరూపయునాదబిందుమయహిరణ్యగర్భాధి దేవతయునై మధ్యమ వాక్కనబడును. ఆబ్రహ్మమాస్య పర్యంతము నావాయువుచేతనే కంఠాదిస్థానములయందభివ్యజ్యమానమై యకారాది క్షకారాంతవర్ణమాలారూపమై వైఖరీవాక్కనబడును. నీవీచతుర్విధ సూక్ష్మస్థూలమాతృస్వరూపవు. ఇట్టి దేవి, మహాలక్ష్మి, నీకు నమస్కారము."

ఇతరదేశస్థులదృష్టి కెంతమాత్రము అందని రహస్యములపై ప్రాచీనభారతీయు లెంత లోతైన విచారణ గావించినారో తెలుపుట కిట్టి యుదాహరణముల నెన్నింటి

నైనను నీయవచ్చును. చతుర్విధ వాక్కునుగూర్చినచర్చను సమగ్రముగా నిచట నుల్లేఖించుట నాయుద్దేశముకాదు. ఎంతలోతైనవిషయములను మనప్రాచీనులు విచారణచేసినారో సూచించుటయే నాయుద్దేశము. ఇట్లే శబ్దార్థములకు సంబంధించిన స్ఫోటవాదము ప్రాచీనుల విచారగభీరతకు ప్రబలనిదర్శనము. ఇట్టివనేకములు కలవు.

భారతీయవిద్యలనేకములు ప్రయోగము, పరిశీలనము, అనుమానము (Experiments observation and inference.) అనుమార్గమునకాక అతీంద్రియజ్ఞానము వలనను దివ్యదృష్టివలనను తెలిసికొనబడినవి. పంచేంద్రియములవలన మనము తెలిసికొనువిషయములను మరొకమార్గమునకూడ తెలిసికొనవచ్చును. ఈయింద్రియములకు తెలిసికొనుశక్తి యేబుద్ధినుండి వచ్చుచున్నదో యాబుద్ధినే నేఱుగా ప్రయోగించి విషయములను తెలిసికొనవచ్చును. ఇంద్రియములకుగ్రాహ్యములుకానివిషములుకూడ నీవిధముగా గ్రాహ్యములగును. ఈవిధముగా వచ్చినజ్ఞానమును మించినది దివ్యదృష్టి. ఈసాధనములచే కనుగొనబడిన విషయము లింద్రియజన్యజ్ఞానమాత్రవిలసిత గ్రంథములలోని విషయములకంటె విశిష్టములగుటలో వింతలేదు.

ఆర్షగ్రంథములు దోషరహితములు. అతీంద్రియజ్ఞానముగల మహర్షులు వీనిని రచించుటయే యిందులకు కారణము. ఆయుర్వేదములో చరక శుశ్రుత వాగ్భటాది గ్రంథ

ములలోని జ్ఞానమెప్పటికైనను అప్రతిహత్యాఖ్యాతమై విరాజిల్ల గలదు. అధునికవైద్యములోనిసిద్ధాంతములు తఱచుగా మారు చున్నవి. నిన్నటిసిద్ధాంతము నేడు పూర్వపక్షమగుచున్నది. ఆయుర్వేదములోని సిద్ధాంతములు శాశ్వతములు. ఈవస్తు వున కీగుణము కలదని యీగ్రంథములలో చెప్పబడినదానిని కాదనగలశక్తి నేటికినికూడ ఎవరికినిలేదు. నిత్యము పరిశోధ నలవలన ఆధునికవైద్యశాస్త్రము వృద్ధిచెందుచున్నదనియు; ఆయుర్వేదము వృద్ధిచెందుటలేదనియు వగచువారు కలరు. కాని దోషములుగల శాస్త్రమానాటికానాడు దోషములను దిద్దికొని వృద్ధిపొందుటకును, దోషరహితమైన శాస్త్రము మార కుండుటకును గలభేదమును సరిగా నర్థము చేసికొననలసి యున్నది. నేడుపలభ్యమానమగుచున్న యాయుర్వేదములో నన్నివిషయములును లేకపోవచ్చును. ఉన్నంతవరకు విషయ ములబాధితసత్యములను నది గమనింపదగిన విషయము.

ఆధునికములైన సైన్సులకును, భారతీయవిద్యలకును నొకముఖ్యమైన భేదముగలదు. భారతీయవిద్యలన్నియు ధార్మికాధ్యాత్మికవాతావరణముతో నిండియున్నవి. ఉదాహ రణమునకు ఆయుర్వేదమునే తీసికొందము. చరకసుశ్రుతాద్యా యుర్వేదగ్రంథములన్నియు గ్రంథారంభములో పరమాత్మ నుండిమూలప్రకృతి, మహత్తు,అహంకారమమున్న గుణతత్త్వము లెట్లుపుట్టినవో, చైతన్యరూపుడైనజీవునకాయాతత్త్వములతోడి

సంపర్కముంవలన సంసారమెట్లేర్పడుచున్నదో, జన్మకర్మలకు గలసంబంధమెట్టిదో, పుణ్యాపాపములవలన సుఖదుఃఖములెట్లు గల్గునో వర్ణించుచున్నవి. వేదాంతగ్రంథములలోను, ధర్మ గ్రంథములలోను తెలుపబడినవిషయములకును, ఈ యాయు ర్వేదగ్రంథములలోని విషయములకును భేదముకనప్పట్టదు.

రోగములకు కారణములనుచెప్పుటలోకూడ చరకాదులు దృశ్యకారణములతోబాటు అదృశ్యకారణములను కూడ చెప్పియున్నారు. రోగములను దోషజములనియు కర్మజములనియు, కర్మదోషజములనియు మూడువిధములుగా వారు విభజించినారు. కర్మజరోగములనగా జన్మాన్తరీయ పాప కర్మవలన గల్గినవి; దోషజములనగా వాతపిత్తశ్లేష్మాదుల వైషమ్యమువలన గల్గినవి; కర్మదోషజములనగా నీరెండింటి వలనను బయలుదేరినవి. ఏదివ్యదృష్టిచే నీగ్రంథకర్తలు శారీరరహస్యములను గ్రహించిరో యాదివ్యదృష్టితోనే యీధార్మికాధ్యాత్మికానుబంధమునుగూడ గ్రహించిరి. ఆయా మహాపాపములఫలితముగా కుష్ఠాదివ్యాధులు గల్గునని చెప్పునీ గ్రంథములు పురాణాంతర్గతములైన కర్మవిపాకాది గ్రంథము లనుతలపింపచేయును. అంత భౌతికశాస్త్రనిష్ణాతులకింత పార మార్థికరహస్యజ్ఞానముండునాయని యాధునికుల కాశ్చర్యము గల్గును. కొన్నిరోగములకు జపము, బలి, హోమము అనునవి కూడ చికిత్సలేయని ఆయుర్వేద గ్రంథములు చెప్పుచున్నవి. వైదికమతములోభాగములుగానేయీశాస్త్రములుద్భవించినవి.

ఆయావిద్యలప్రవచనపరంపరయుదీనికనుగుణముగానేయున్నది. ఆయాశాస్త్రములను లోకములో వ్యాపింపచేసిన గురుశిష్య పరంపరకూడ నాయాశాస్త్రగ్రంథములలో పేర్కొనబడినది.

పారమార్థికత శాస్త్రములోని విషయములకు సంబంధించినది మాత్రమే కాదు. వైద్యమును స్వార్థము కొఱకుగాని కామముకొఱకుగాని కాక భూతదయయును ధర్మముకొఱకే చేయవలయునని చరకుడాదేశించి యున్నాడు.

నాత్మార్థంనాపి కామార్థమథభూతదయాంప్రతి
వర్తతే యశ్చికిత్సాయాం ససర్వమధివర్తతే"

వైద్యపరముగా చెప్పబడిన యీయంశము లితర శాస్త్రములకుకూడ చెల్లును.

గానకళను తీసికొందము. సంగీతము గొప్పశాస్త్రముగా నీదేశమున విలసిల్లినది. ప్రపంచవిఖ్యాతుడైన యహూదీయను అమెరికన్ సంగీతవిద్వాంసుడు వివిధదేశములలోని గానసంప్రదాయములను పరిశీలించి భారతదేశమునకు వచ్చినాడు. ఇతర దేశములలో సంగీతము హృదయమునుస్పందింపచేయునదిగానే యున్నది కాని బుద్ధికి ఉదాత్తతను చేకూర్చునదిగాలేదనియు, భారతీయసంగీతము అన్నిటికంటె బుద్ధి వైభవోపేతముగా (**Most intellectual**) నున్నదనియు శ్రీయెహూదీ చేసిన ప్రకటన గమనింపదగినది. ఈదేశమున సంగీతకళ భక్తిజ్ఞాన వైరాగ్యాది విషయముల నాలంబనముగాచేసికొని బయలుదేరిన దగుటచే శ్రోతకు గానసుధాస్వాదముతోబాటు భక్తిజ్ఞాన వైరాగ్యాది ప్రబోధముకూడ లభ్యమగుచుండును. ఈదేశమున

సంగీతాచార్యులుగ వెలసిన మహామహులు - త్యాగరాజు, తుకారాం, పురందరదాసు, నారాయణతీర్థులు, జయదేవుడు మున్నగువారెల్లరు-మహాభక్తులు, జ్ఞానులు నగుట ముఖ్యముగా గమనింపదగిన విషయము. భారతీయహృదయము తన విశిష్టతను ప్రతిరంగములోను కన్పరచుకొనుచున్నది.

నృత్యాదికళలలో కూడ భారతీయహృదయము వ్యక్తమగుచున్నది. అనేక దేశములలో నృత్యము క్షుద్రభావప్రకోపనసాధనముగ నుండగా భారతదేశమున నృత్యము పరమేశ్వరతత్త్వనిరూపణమునకు సాధనముగా చేయబడినది. పరమశివుని సంధ్యాప్రళయనృత్యమును, శ్రీకృష్ణుడు రాధతో గోపికలతో నెఱపిన దివ్యప్రణయచర్యలను నృత్యములో ప్రధానముగా ప్రదర్శించుట భారతీయ సంప్రదాయము.

ప్రతికళలోను సౌందర్యపారమ్యమును, పరమేశ్వరతత్త్వమును ఇముడ్చుట భారతీయసంప్రదాయము. తుదకు గణితశాస్త్రములో కూడ నీలక్షణములు ప్రవేశపెట్టబడినవి. ప్రాచీనభారతీయ గణితగ్రంథములలో నీయబడిన లెక్కలు రసభరితముగా నుండుటయేకాక ఉన్నతపారమార్థిక బోధావహములుగనున్నవి.

స్థాపత్యము, వాస్తువుమున్నగు కళలుకూడ పరమేశ్వరకైంకర్యమునకే వినియోగింపబడినవి. దేవతావిగ్రహ నిర్మాణము దేవాలయనిర్మాణములోను ఈకళలు వినియోగింపబడినవి.

శాస్త్రములవిషయమునకూడ నిది వర్తించును. తర్కశాస్త్రము బుద్ధినివికసింపచేసివిచారశక్తినిపెంచును. అట్టివిద్యను సంపాదించినవాడు క్షుద్రవిషయములపై సాటివారితో చర్చ

లనుచేయుచు విజయమును సాధించుటతోనే తృప్తిపడు ప్రమాదమున్నది. అంతగొప్పవిద్య నిట్లు దుర్వినియోగము చేసికొనుట తగదనియు వేదములలో ప్రతిపాదింపబడినబ్రహ్మ తత్త్వమును బుద్ధ్యారూఢము గావించుకొనుటకే ముఖ్యముగా తర్కబలము నుపయోగింపవలయు ననియు మనపూర్వులు నిర్ణయించియున్నారు. తర్కము చదివి వేదాంతము నధ్యయనముచేయని పండితుడు గార్దభజన్మమెత్తుసను నార్యోక్తి యీ దేశమునగలదు. భారతీయవిద్యలపారమార్థికపరియోజనకిది ప్రబలనిదర్శనము.

లోకములో సుఖముల ననుభవించుటయు, బుద్ధివికాసకవిద్యల నభ్యసించుటయుకూడ ధర్మపురుషార్థమునకో మోక్షపురుషార్థమునకో సంబంధించియుండవలయుననియునను మహోత్కృష్టసంప్రదాయము భారతీయులలో ననాదిగా వచ్చుచున్నది. అంతమాత్రమున భారతీయు లిహలోకసుఖమునకు దూరులైనారనుకొనుట పొరపాటు. భగవత్కైంకర్య ప్రధానముగా సర్వకళలును వినియోగింపబడినను ఆకళలమాధుర్యమునకు లోటురాదు. రుచ్యభక్ష్యములు భగవన్నివేదితములై భక్షింపబడుచో రుచిని కోల్పోవునా? అంతియేకాదు. ఆధ్యాత్మిక ప్రవణత్వము కారణముగానే భారతీయులు సర్వకళలను వృద్ధినొందించుకొనిరి. భారతీయుల పారిమార్థికదృష్టి వారి ఆధ్యాత్మికోన్నతికే కాక కళావికాసమునకు కూడతోడ్పడినది.

## ౨. కల్యాణ సాహిత్యము

## వేద విస్ఫూర్తి

అంతఃకరణమును సద్వాసనావాసితము గావించు కొనుట యెల్లసాధనములలో నుత్తమము. ఎల్లప్పుడు మంచినే వినుట, మంచినే చూచుట అంతఃకరణమునకు పవిత్రతను సత్త్వగుణాభివృద్ధిని గల్గించును.

భద్రంకర్ణేభిః శ్రుణుయామ దేవాః
భద్రంపశ్యేమాక్ష భిర్యజత్రాః.

ఇత్యాది శ్రుతులలో నిరంతర మాంగళ్యశ్రవణ దర్శన ములు వాంఛింపబడినవి. మాంగళ్యభూయిష్ఠమైన సంస్కార ముగల మనస్సులో మంగళభావములే యుదయించును. వేద సిద్ధమైన యీసంప్రదాయమునుండియే కావ్యమునకు ఆది మధ్యాంతములయందు మాంగళ్యముండవలయునను నియమ మేర్పడినది.

"మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శా స్త్రాణిప్రథన్తే". గ్రంథము మాంగళ్యప్రధానముగా నుండు వల యునని దీని తాత్పర్యము.

అమంగళమును, అశ్లీలమును కీర్తింపరాదనియు వేద ముపదేశించుచున్నది.

కల్లోలితపరిస్థితులను సృజించి యందులోనే పాఠకుని క్రీడింపచేయుట యితర దేశసాహిత్యములలో పరిపాటి. దీనికిని

భారతీయసాహిత్యసంప్రదాయమునకును మూలమట్టమైన భేదముగలట్టు, వేదములకు మకుటాయమానమైన శాంతిపాఠము భారతీయసాహిత్యమునకు స్ఫూర్తిదాయకము. అడుగడుగునకును "శ్శాంతిశ్శాంతిశ్శాంతిః" అని పఠించువారు భారతీయులు. దీనికనుగుణముగా నీదేశమున ధార్మికతను, శమదమాదులను ప్రేమవాత్సల్యాదులను విశేషముగా ప్రతిబింబించు సౌమ్యసాహిత్యము మిక్కుటముగా బయలుదేరినది. అమాంగళ్యనివారణమునకు (శివేతరక్షతయే) కావ్యము తోడ్పడునని భారతీయాలంకారికలుకూడ వాక్రుచ్చియున్నారు.

వేదధర్మమును కాంతాసమ్మితముగా బోధించుటకు (కాంతాసమ్మితతయోపదేశయుజే) సుకావ్యము సమర్థమనికూడ నాలంకారికాలు తెల్పియున్నారు. ప్రభుసమ్మితముగా "సత్యంవద, ధర్మంచర"యున్నగు నేధర్మములను వేదము శాసించుచున్నదో, పురాణములే ధర్మమును మిత్రసమ్మతముగాబోధించుచున్నవో, కావ్యనాటకాదిసాహిత్యగ్రంథములు వానినే వ్యంగ్యమర్యాదతో రసరీతి వృత్త్యలంకారవిరాజితమైనభాషలో బోధించును.

"యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానాచ్చిరం
యచ్చార్థప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్
కాంతాసమ్మితయాయయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యేకుతుకీ బుధోవిరచితస్తస్మైస్పృహాంకుర్మహే"

## గ్రంథములశాసకత్వము.

ప్రపంచములోని యితరదేశములలో రాజులు, నియంతలు పరిపాలనము చేసినారు కాని గ్రంథములు పరిపాలనము చేయలేదు. భారతదేశముపై నెప్పుడెవరేవిధముగా బాహ్య పరిపాలనముచేసినను, యథార్థముగా భారతీయనరనారీమణుల హృదయములయందు సింహాసనమువేసికొని రాజ్యముచేసిన వారు రామాయణమహాభారతములలోని పుణ్యపురుషులు, సత్యమతల్లులు ననుటలో నతిశయోక్తిలేదు. కవులు గుర్తింపబడని పరిపాలకులని, షెల్లీ చెప్పియున్నాడు (Poets are the unacknowledged legislators of the world). "సుకవితాయద్యస్తి రాజ్యేనకిమ్" అనుటకు దృష్టాంతములు ప్రతిదేశములోను కనపట్టవచ్చును. కవివాక్కు తాత్కాలికముగా సమాజములో కొలదిగనో గొప్పగనో మార్పు తేవచ్చును. గతశతాబ్దిలో బ్రౌనింగ్ సతి కర్మాగారములలో పనిచేయుబాలుర దారుణబాధలను హృదయవిదారకముగా పద్యములో వర్ణించెను. దానిని చదివిన పార్లమెంటుసభ్యులు హృదయముకరిగి యట్టిబాలురస్థితిని బాగుచేయుటకు పార్లమెంటులో నొకశాసనముగావించిరి. కవితకిట్టిప్రభావములెన్నియో యుండవచ్చును.

అంతియేకాక యేకొలదిమంది విద్యాధికులమీదనో తమ పరిమితభావముద్రను శతాబ్దములకొలది నిలువగల్గునట్లు వేయగలకవులుకూడ ప్రపంచములోనున్నారు. కాని బహుసహస్రాబ్దముల్లుగడచినను తేజస్సును కోల్పోని ప్రభావమును ఒకజాతియం

తమీాదను ప్రసరింపజేయుచు ప్రజల నిత్యజీవితములను తీర్చి దిద్దుచున్న మహాకవులు భారతదేశములోనేయున్నారు. భారతదేశములోని వ్యాసవాల్మీకిమహర్షుల ప్రభావము అసదృశము. రామాయణమహాభారతములు భారతదేశముపై ప్రభావమును కనబఱచినట్లు మరియేజాతిమీాదను, ఏగ్రంథము ప్రభావమును చూపలేదని శ్రీ జవహరలాల్ నెహ్రూగారు వాక్రుచ్చినది నిర్వివాదాంశము. మానవజాతిలో అత్యుత్తములైనవితప్ప మఱెవ్వరిట్టిగ్రంథములను రచింపగలరు? (Who but the greatest of men could have written these books) అని యాయన తమకుమార్తెకువ్రాసిన యొకలేఖలో వ్రాసియుండిరి.

సనాతన వైదికధర్మములను మధురాతిమధురముగా కథాసందర్భములలో మానవాళికందించుటలో రామాయణ మహాభారతముల శక్తి లోకోత్తరము. సాహిత్యమునకుండ వలసిన యుత్తమలక్షణములన్నియు పుష్కలముగా నీగ్రంథములకున్నవి. కేవల సాహిత్యనిర్మాతలుకూడ వ్యాసవాల్మీకుల వరవడిననుసరించిరి. అలంకారశాస్త్రరచయిత లీగ్రంథముల నుండి అనేకోదాహరణములను తీసికొన్నారనుటవలననే వీనికి సాహిత్యములో గల స్థానము స్పష్టమగును.

## పాత్ర చిత్రణము.

ప్రాయికముగా మానవజీవితమును ఉన్నదున్నట్లు చిత్రించుటయే కళయని పాశ్చాత్యులు తృప్తిపడుచుండగా

భారతీయులు ధార్మికాధ్యాత్మికోత్తేజనమునకు తోడ్పడురీతి గానే కావ్యములలో జీవితవిమర్శనము సాగవలయునని భావించిరి. పాశ్చాత్యసాహిత్య నిర్మాతలలో మానవజీవిత చిత్రణమునందు అద్వితీయ ఖ్యాతిగన్నవాడు షేక్స్పియరు. ఆతడు తన ముప్పదియారు నాటకములలో మానవహృదయమునకు ఎక్సురే తీసినట్లు వివిధప్రకృతులను మనకు ప్రదర్శించి సహస్రమనస్కుడను (Myriad - minded Shakespeare) ఖ్యాతినిపొందినాడు. బహుముఖపాత్రపోషణములోను వైవిధ్యవిలసితమైన మానవప్రకృతిని చిత్రించుటలోను ప్రపంచసాహిత్యములో మహాభారతమునకుగల స్థానము అద్వితీయము. మహాభారతమునందు అర్జునుడు, భీముడు, యుధిష్ఠిరుడు, కర్ణుడు, విదురుడు మున్నగు పాత్రలలో కావలసినంత వైవిధ్యముండుటయేకాక మానవహృదయ మర్మావిష్కారపద్ధతి సర్వత్ర గోచరించును. యుధిష్ఠిరుడు, భీముడు, కర్ణుడు, భీష్ముడు మున్నగు పాత్రలు నేటికిని సజీవములై మనకన్నులయెదుట నిలచును.

పాశ్చాత్యమహాకవుల పాత్రలకును వ్యాసపాత్రలకును నొకముఖ్యభేదము కన్పట్టును. పాశ్చాత్యకవుల దుష్టపాత్రల దౌష్ట్యము ప్రబలమైనది. అది పాఠకుని లొంగతీయుటకుకూడ తగినంత ప్రబలముగా నుండును. సత్పాత్రలుకూడ కుటిలులకు లోనై నశించుటయు యాదృచ్ఛికసంఘటనలు మానవుల మంచిచెడ్డలతో నిమిత్తములేకుండ వారి జీవితములను మలచుచుండుటయు తఱచుగా కన్పట్టు విషయము. అనేక సందర్భ

ములలో ధర్మాధర్మముల విభాగము కష్టమగునట్లు పాత్రనిర్మాణము జరుగును. "ధర్మమే జయించును; అధర్మమే నశించును" అను చరమసిద్ధాంతమునకుకూడ భంగకరమగురీతిగా పాత్రచిత్రణము గావింపబడును. ధర్మావలంబకులకు సహజముగా నుండదగిన "యతోధర్మ స్తతో జయః" అను విశ్వాసమునకే మూలచ్ఛేదమగురీతిగా పాత్రచిత్రణము గావింపబడినది. అనేకఘట్టములలో పురుషకారముపట్ల నైరాశ్యము గల్గునట్లుగా యాదృచ్ఛికసంఘటనలకు ప్రాబల్యము కన్పట్టును. ఈప్రపంచమంతయు చుక్కానిలేని పడవా యనిపించు పద్ధతిలో సన్నివేశములు కూర్పబడును. మహాభారతములో నీలోపములులేవు. ధర్మమందును పరమేశ్వరుని రాజ్యమందును అచంచలమగు విశ్వాసము కలుగునట్లును, ఆచరించువారిని ధర్మము, ఆశ్రయించువారిని ఈశ్వరుడు రక్షించునను విశ్వాసము సుదృఢమగునట్లును సన్నివేశములు కూర్పబడినవి. అట్లని వాస్తవికతా విదూరముగా వాతావరణము సృష్టింపబడలేదు.

పాత్రిలలో నెచ్చట నేలోపమున్నను దానిచే పాఠకుడాకర్షింపబడకుండునట్లుగా మెలకువతో పాత్రపోషణము గావింపబడినది. ద్రౌపది కయిదుగురు భర్తలున్నను, ద్రౌపదిపట్ల నెల్లరకు పూజ్యభావమేయున్నను, ఇంతకాలముగా మహాభారతము చదువువారిలోను, వినువారిలోను, ఒకర్కరికికూడ "నేడుకూడ బహుభర్తృతలో దోషమేమి?" యను భావము

తట్టలేదు. ఇట్లే యేపాత్రలోనను పాదేయాంశమున్నను అది మనపట్ల నిర్వీర్యమగురీతిగా వ్యాసుడు పాత్రపోషణము, కథాసన్నివేశము గావించినాడు. ఇది వ్యాసుని మైంద్రజాలికశక్తి. ఈవిచారణము మొత్తముమీద ఉన్నతశ్రేణికి చెందిన పాశ్చాత్యభారతీయకవుల నడుమజరిగిన విమర్శగానే భావింపదగును. పాశ్చాత్యసాహిత్యములోకాని భారతీయసాహిత్యములోకాని సామాన్యముగ కపవాదము లుండకపోవు.

భారతీయసాహిత్యములో నెచ్చటనైనను సచ్చరితుల జీవితము విషాదాంతముగా చిత్రింపబడినను అందులకు కారణముగా పూర్వజన్మకృతమగు నొక దోషము వర్ణింపబడియుండును. జన్మపరంపరయందు దృఢవిశ్వాసముగల. భారతీయుల దృష్టిలో కర్మఫలానుభవము ఉపాధిభేద ప్రతిరుద్ధము కాజాలదు. ఏజన్మలోచేసిన పాపపుణ్యములకైనను మరియొక జన్మలో ఫలము రావచ్చును. గావున పూర్వజన్మకృత పాపపుణ్యము లిప్పటిజన్మలోని యనుభవములకు కారణములుగా భారతాదిగ్రంథములలో వర్ణింపబడియున్నందువ భారతీయసాహిత్యములోని యాదృచ్ఛిక సంఘటనలుగాని యకారణములుగా పైకి కన్పట్టు నా యా పాత్రల శుభాశుభానుభవములు కాని పాఠకుని యాశ్వరాస్తిక్యబుద్ధిని, ధర్మవిశ్వాసమును సడలింపజాలవు.

భారతీయసంస్కృతికి రామాయణము, దర్పణము, భరతజాతికి లోకములో విశిష్టతను గూర్చిన సత్యవ్రతము.

పితృభక్తి, భాతృభక్తి, మైత్రిధర్మము పాతివ్రత్యము మున్నగు ధర్మములు రామాయణములో బహురమ్యముగాను, విపులముగాను ఉపదేశింపబడి యున్నందున నీగ్రంధము జాతీయేతిహాసమని చెప్పదగియున్నది. గ్రిఫిత్ అను పాశ్చాత్య విద్వాంసుడు తన రామాయణోపోద్ఘాతములో రామాయణమును హిందువుల జాతీయేతిహాసముగా వర్ణించినాడు. (Ramayana, the great National Epic of the Hindus,—) రామాయణము ప్రత్యేకముగా భారతజాతికి అభిమానాస్పదములైన ధర్మములను బోధించు మహోత్కృష్టగ్రంధముగా పాశ్చాత్యులకు గోచరించినది.

లోకోత్తరములుగా సర్వమానవాదర్శములుగానున్న సీతారామపాత్రలలోనేకాక దశరథుడు, భరతుడు మున్నగు వారిలోకూడ భారతీయ ధార్మికతత్త్వమును వాల్మీకి కన్పఱచి మొత్తముమీదనే తనగ్రంధమును భారతీయ జీవితప్రతిబింబముగా చేసినాడు. సీతారాముల దివ్యతేజస్సునుండు మనలను అంతగా నాకర్షింపజాలని పాత్రిలనుకూడ వాల్మీకి ధార్మిక వాతావరణ నిర్మాణ సాధనములనుగానే యుపయోగించినాడు. "ఆడినమాటను తప్పకుండుటకై కుమారునికూడ విడచిపెట్టుకొన్న సత్యవ్రతుడుగా దశరథుడు అనేక స్థలములలో వాల్మీకిచేత పేర్కొనబడినాడు. ఇది దశరథునిలోని మనము తఱచు విస్మరించు శీలసౌభాగ్యమును జ్ఞప్తికి తెచ్చును. అట్లే ప్రతిపాత్రయు ప్రగాఢధార్మికసుగంధభరితమైనదిగా

చిత్రింపబడినది. అయోధ్యలోనివారేకాక శరభంగుడు, శబరి, జటాయువు మున్నగు పాత్రలన్నియు సుకృతిపుంజము లుగా చిత్రింపబడి యున్నవి.

నిమ్నస్థితిలో నున్నవానిని మానవత్వము లోనికిని మానవత్వములో నున్నవానిని దివ్యత్వములోనికిని ఉద్ధరింప గలశక్తి యిట్టి సాహిత్యమునకే యుండును. రామాయణము ఉన్నతాదర్శములను ప్రదర్శించుచు దివ్యతమగ్రంథమై యల రారుచున్నందున నీగ్రంథము ఆదర్శవిషయములనే చిత్రించి నదికాని ఆచరణోచితాంశములను చిత్రింపలేదని కొందరు భ్రాంతిపడిరి. కాని శ్రీఅరవిందచెప్పినట్లు ఆదర్శజీవితమే రామాయణకాలమున ఆచరణములో సాధింపబడినదని వీరు మరచుచున్నారు.

వివిధమానవప్రకృతిపరిజ్ఞానము, వాస్తవికజగద్వర్ణ నము పరమార్థపరములు కాకపోయినను లోకవ్యవహారజ్ఞానము నుగల్గింపకపోవు. కావున నీవిషయమునుగూడ భారతీయకవులు కేవల ముపేక్షింపలేదు. వ్యవహారజ్ఞానముకొఱకు (వ్యవహార విదే) కూడ కావ్యపఠన ముపకరించునని మన యాలంకారి కులుకూడ చెప్పియున్నారు. కాని మనకవులు, అలంకారికులు పాశ్చాత్యులవలె దీనికి ప్రాముఖ్యమీయలేదు.

## రమ్యత్వ ధర్మ్యత్వ సమ్మేళనము.

కావ్యము రమణీయార్థప్రతిపాదకము: రమణీయమైన యర్థమును ప్రతిపాదించునదేకాక రమణీయముగా విషయ

ప్రతిపాదనము గావించుకొనది. రమణీయవిషయమనగా శుభము హితము, శ్రేయస్కరము, పుణ్యప్రదము అగునది. "య ఇహరమణీయచరణాః" ఇత్యాది ఛాందోగ్యశ్రుతిలోని రమ ణీయ శబ్దమున కిదియే యర్థము. రమణీయముగా ప్రతిపాదిం చుట యనునది ప్రతిపాదనధోరణికి సంబంధించినది. శ్రోతృ హృదయమునకు ఆపాతముగా హాయిని గొల్పుట మొదలు రసపారమ్యమును (బ్రహ్మానందసబ్రహ్మచారియైన రసానంద ములో తన్మయత్వమును) గల్గించువఱకు నీరమణీయధోరణికి వ్యాప్తికలదు. రసస్పర్శయు భావమును పరిణతరసమువలె కేవల తన్మయత్వమును గల్గింపజాలకున్నను హాయిని గల్గిం చును. ఉపదేశప్రయోజనము భవిష్యత్కాలమున గల్గును; ఈరసప్రయోజన మప్పటికప్పుడు కల్గును. వెంటనే పరమా నందమును గల్గించుటకు (సద్యఃపరనిర్వృతయే) కావ్యము సమర్థమని యాలంకారికులు తెలిపియున్నారు.

"కావ్యమునకు బాహ్యరూపము శబ్దార్థములు; వ్యంగ్య వైభవమే జీవితము; ఉపమోత్ప్రేక్షాద్యలంకారములు ఆభర ణములు; శ్లేష, ప్రసాదము, సమత, మాధుర్యము; సుకుమా రత మున్నగునవి శౌర్యాదులవంటి గుణములు; వైదర్భి, గౌడి, పాంచాలి అనురీతులు ఉత్కర్షనుగూర్చు స్వభావములు, కైశికి, ఆరభటి, భారతి, సాత్వతి అనువృత్తులు మనోహరము లైన ప్రవర్తనములవంటివి; పదములకు తగిన విశ్రాంతియే శయ్య; ద్రాక్షాపాక కదళీపాక నారికేళపాకములే రసాస్వాద

భేదములు. ఇది కావ్యసంపదయొక్క సామగ్రి" అని యాలంకారికలు చెప్పియున్నారు.

ఈసామగ్రిచేత సాధింపదగినది కావ్యానందము. పరిపూర్ణ కావ్యానందము రసరూపముగా అనుభూతమగును. విభావానుభావసాత్త్విక వ్యభిచారిభావసామగ్రీసముల్లాసితమైన స్థాయిభావమే రసము.

ధ్వనిభేదములను నిరూపించుటలోను అలంకారముల నూరింటికిని అందలి యవాంతరభేదములకును అతివ్యాప్త్యవ్యాప్తిదోషములు లేకుండునట్లు లక్షణములను చెప్పుటలోను రతి, ఉత్సాహము, శోకము, ఆశ్చర్యము, హాసము, జుగుప్స, భయము. కోపము, శాంతి అనునవి స్థాయిభావములుగాగల శృంగార వీర కరుణాద్భుత హాస్య బీభత్స భయానక క్రోధ శాంతరసములనువ్యాఖ్యానించుటలోనుభారతీయాలంకారికులు కన్పఱచిన యసాధారణమేధ నర్థముచేసికొనుటకు విశేషమైన పాండిత్యప్రతిభలు కావలయును. కళాసౌందర్యమును మన పూర్వులంత యున్నతస్థితికి తెచ్చినారు. దానిని ధర్మముతోను పరమార్థముతోను మేళవింపచేసినారనుసది ముఖ్యము.

పైని తెలిపిన కావ్యలక్షణములలో నొక్కొక్క దాని కొక్కొక్క యాలంకారికుడు ప్రాధాన్యము నొసగెను. కావ్యమునకు ఆత్మధ్వనియని యానందవర్ధనుడును, రీతి యని వామనుడును, అలంకారమని భామహుడును గుణమని దండియు, వక్రోక్తియని కుంతకుడును, అనుమానమని మహిమ

భట్టు, ఔచిత్యమని క్షేమేంద్రుడును రసధ్వనియని జగన్నాథ
పండితరాయలును వక్కాణించియున్నారు. ఆనందవర్ధనా
చార్యుల ధ్వన్యాలోకము, వామనుని కావ్యాలంకారసూత్ర
వృత్తి, భామహుని అలంకార సర్వస్వము, దండికావ్యా
దర్శము, కుంతకుని వక్రోక్తిజీవితము; మహిమభట్టు వ్యక్తి
వివేకము, క్షేమేంద్రుని ఔచిత్యవిచారచర్చ, జగన్నాథపం
డితరాయల రసగంగాధరము భారతీయసాహిత్యమునకేకాక
ప్రపంచసాహిత్యమునకే అలంకారములైన గ్రంథరాజములు.
సాహిత్యస్వరూప స్వభావలక్షణములనుగూర్చి ప్రత్యేకముగా
నొకశాస్త్రమును నిర్మించుకొన్నవారు ప్రపంచములో భార
రయులు తప్ప మరెవ్వరునులేరు. సుమారు పదిసంవత్సరముల
కృషిచేసినవారికేకాని సరిగా బోధపడని యలంకారశాస్త్రము
మరియే దేశమునను బయలుదేరలేదు. ఇందు తర్కశాస్త్రము
నకు తత్త్వశాస్త్రమునకుగూడ ప్రగాఢసంబంధమున్నందున
నిది, మేధావులకు మాత్రమే కొఱుకబడును. ప్రాచీన సాహి
త్యముపట్ల నల్పదృష్టి కలవారీశాస్త్రము నర్థముచేసికొనుట
కొకసారి ప్రయత్నించినచో ప్రాచీన రచయితల మేధముందు
తమ మేధ యెంతయల్పమైనదో గుర్తించి సిగ్గిలుదురనుటలో
సంశయములేదు.

పైని తెలిపిన సాహిత్యసామగ్రి సాహాయ్యములేక
మతమునో చరిత్రనో రాజకీయములనో తెలుపుగ్రంథముల
నీకాలములో మతసాహిత్యము, చారిత్రకసాహిత్యము, రాజ

కీయ సాహిత్యము మున్నగు పేర్లతో వ్యవహరించుచున్నాము. రసరీత్యాదులచే నిర్వహింపబడిన రచన యేవిషయమునకు సంబంధించినదైనను కేవల సాహిత్యపదముచే తెలుపబడును. నిరుపపద్య సాహిత్యమే కేవలసాహిత్యమని చెప్పదగును. వేదధర్మమే యీ కేవలసాహిత్యరూపమును పొందింపబడవలయుననునది భారతీయ సంప్రదాయము. ప్రతిపాదింపబడిన విషయమునుబట్టి కంటె ధోరణినిబట్టి యెక్కుడు రంజింపచేయుట సాహిత్యలక్షణమని జాన్ రస్కిన్ చెప్పిన నిర్వచనము సత్యమునకు దగ్గఱగానే యున్నది. మాత్యూఆర్నాల్డ్ మానవజీవిత విమర్శనమే పాశ్చాత్య సాహిత్య లక్ష్యమని నుడివియున్నాడు.

Literature is the "criticism of life

నాటకము మానవప్రకృతికి అద్దముపట్టునని (Drama holds mirror up to nature) షేక్స్పియరు 'హామ్లెట్'లో నొక పాత్రచే చెప్పించిన నిర్వచనము ఇంచుమించు ఇదే యభిప్రాయమును వెల్లడించుచున్నది. బహుసహస్రముఖమైన మానవప్రకృతిని నేర్పరితనముతో చిత్రించునపుడు మూలవస్తువును సన్నిహితముగా పోలిన చిత్రపటమువలె జగత్తును దగ్గరగా పోలిన కావ్యము కూడ మనోహరముగా నుండకపోదు. కాని యీరమ్యత్వము ధర్మ్యత్వముతో కూడుకొన్నప్పుడే కావ్యము సత్పురుషహృదయరంజకముగా నుండును. జగత్తును ప్రతిబింబించు కావ్యములలో కూడ ధర్మము ఉన్నేయము కావచ్చును. కాని యది త్రగినంత ప్రస్ఫుటముగా నుండదు. ధర్మప్రబోధ

మును, ఆధ్యాత్మికోత్తేజనమును కావ్యమునకు ప్రముఖలక్షణము లుగా నుండవలయునని భారతీయాశయము. కావ్యములో సౌందర్యము, ధర్మము (Beauty and duty) సమ్మేళనము పొందవలయునని శాస్త్రైలు భావించెను. అరిస్టాటల్ మున్నగు ప్రాచీనపాశ్చాత్య విమర్శక బుధేందు్రలకుకూడ నీయభిప్రాయమే యుండెను. పాశ్చాత్యులలో కొలదిమంది విమర్శకులకుండిన యీయాశయము ప్రాచీన భారతీయ మహాకవులకే యున్నందున నట్టి యాదర్శసాహిత్యమిక్కడ పుష్కలముగా బయలు దేరినది.

ఆంగ్లమహాకవులలో మిల్టను మున్నగువారు కొలది మందియే యీయాశయసిద్ధికై ప్రయత్నించిరి. పదునెనిమిదవ శతాబ్దిలోని పోపు మున్నగు వారిరచనలలో సమాజదోషము లనుద్ఘటించు ప్రయత్నమున్నను ఉదాత్తమైన ధర్మబోధలేదు. వారి సమాజవిమర్శనము నిమ్నమార్గముననే నడచినది. వారి రచనలిట్లు ధర్మబోధ ప్రయోజనమును నెఱవేర్చుకొనజాలక పోయినవి; అటు సారస్వత సౌందర్యమునుకూడ పొందజాలక పోయినవి. అనేక కవులలో ధర్మత్వరమ్యత్వ సమ్మేళన ప్రయత్నము వితథమైనందున ధర్మబోధక గ్రంథములు మనోహరముగా నుండవనియు, రమ్యవాఙ్మయము ధర్మబోధగావింపజాలదనియు నొక యభిప్రాయము విమర్శకులలో నేర్పడెను. ఈసమ్మేళనముభారతదేశములో నెరవేరినంతభాగుగా మరియే

దేశములోను నెరవేరలేదని శ్రీ స్వామి వివేకానంద నుడివి యున్నారు.

సాహిత్యములోని యనేక ఘట్టములు గిరినదీసముద్ర సూర్యోదయ సూర్యాస్తమయాది వర్ణనములకు సంబంధించి యుండవచ్చును. వానికికూడ పురుషార్థ సాధనత్వము లేకపో లేదు. సౌందర్యములు ఆయావస్తువులవి కావనియు, సర్వసౌం దర్య నిధానమైన పరమేశ్వరుని సౌందర్యచ్ఛాయలే యనియు సాధకుడు నిరంతరము భావించుచుండవలయును. "యచ్చంద్ర మసి యచ్చాగ్నౌ తత్తేజోవిద్ధి మామకం" అను భగవదుపదేశ మును హృదయములోనిడికొని సర్వసౌందర్యముల నాకళించు కొనవలయును. రమణీయశబ్ద ప్రయోగాదిజన్యమైన కావ్యసు ఖము ఇంద్రియ సుఖములో తలచుగ కన్పట్టు పాపస్పర్శలేనిదై దానికంటె విశిష్టమగుచున్నది.

ప్రశాంత వాతావరణము, శ్రేయస్కరత్వము, సౌంద ర్యము అను వానిని పుష్కలముగాగల్గిన ప్రాచీన భారతీయసా హిత్యము "శాంతం, శివం, సుందరం" అని వర్ణింపబడిన పర మేశ్వర రూపమును స్మరింపచేయుచున్నదనుట యత్యుక్తి కాదు.

ఉత్తమాదర్శమును లోకమునకు గల్గించుటకు భారతీ యమహాకవులెంత మెలకువ చూపినారో ఆశ్చర్యమును కల్గిం చును. తమ కావ్యము చదివి యెవ్వడును చెడిపోకూడదనియు ఉత్తేజమును మాత్రమే పొందవలయుననియు వారు కోరిరి.

అలంకార శాస్త్రములో ధీరోదాత్తుని లక్షణములను చూతుమేని యీసంగతి స్పష్టమగును. కవికుల శేఖరుడైన కాళిదాసు దుష్యంతుని ధీరోదాత్తునిగా చిత్రించుటలో నెంత జాగరూకత కన్పఱచినాడో మచ్చునకు చూతము.

దుష్యంతుడు శకుంతలను వివాహమాడి యాడలేదని చెప్పి యామెను పలువురి సమక్షమున నిరాకరించినాడని మహాభారతములో నున్నది. భారతము సర్వధర్మములకు నెన్నిధానమగుటచే బహుశతస్థలములలో సత్యభాషణసంస్తుతియు, అసత్యవచన గర్హణమును అందుంచుటవలన దుష్యంతు డసత్యమాడినాడనుటవలన వచ్చిన ధర్మహానిలేదు. ఇంతేకాను భారతము ఇతిహాసము; జరిగిన దానిని యథాతథముగ చెప్పును. కాళిదాసు వ్రాయుచున్నది చిన్నగ్రంథము; అందు ప్రధానుడైన నాయకుడు పెద్దవిషయములో అసత్యమాడినా డనుచో నది లోకములో సత్యసంధతకుగల గౌరవమును తగ్గించును. కావున కాళిదాసు తననాటకనాయకుని అసత్యమాడని వానినిగా ప్రదర్శించినాడు. అతని దుష్యంతుడుకూడ శకుంతలను చూచి నిన్ను నేను వివాహమాడలేదని చెప్పినమాట వాస్తవమే. కాని యావిషయమును పూర్తిగా మరచిపోయి యేయట్లనినాడు.

నాయకుడు మందమతియు, తమోగుణ భూయిష్ఠుడు నగుటమాత్రి మాత్షేపణీయము కాదాయను: దుష్యం

తుడు సహజముగా మందమతికాడు; దూర్వాసశాసనమువలస మరపుచెందినాడని కాళిదాసు కాచుకొన్నాడు.

కాని నాయకుడు పెద్దలచే చీవాట్లు, శాపములు తిను వాడగుటమాత్రము సమంజసమాయను: కాళిదాసు అక్కడ కూడ గాడితప్పకుండునట్లు ధర్మమును నడపినాడు. దుష్యంతుడు తన దోషమువలన శాపమును పొందలేదని యాతడు వ్రాసినాడు. శాపమెందులకు వచ్చినదన, శకుంతలతప్పు వలన వచ్చినది. నాయకునిలోనే దోషముండకూడదనుచుండగా నాయకురాలిలో దోషము నెవరు సహింతురు?

ఇక్కడ ధర్మమును కాపాడుటలో కాళిదాసు లోకోత్తరప్రతిభను చూపినాడు. శకుంతల శాపమునకు కారణమైన తప్పు చిత్రమైనది. ఏదితప్పుకానితప్పో దానిని శకుంతల చేసినది. పతిసేవలో నిమగ్నయై యితర ధర్మమును వీడుట యొక్కటే స్త్రీకి తప్పుకానితప్పు. శకుంతల భర్తృధ్యాన నిమగ్నయై భిక్షుకుపచ్చిన దుర్వాసునిపట్ల ఏమరపాటు చూపినది. అట్టిచో మహర్షియైన దుర్వాసుడు శకుంతలచేసిన పనికి కుపితుడై శపించుటయేల?

ఈరీతిగా దుష్యంతుని నుండియు శకుంతల నుండియు తొలగింపబడిన దోషము చివఱకు దుర్వాసుని నెత్తిమీద పడినది. దానినికూడ కాళిదాసు తొలగింపవలెనా? అక్కఱ లేదా? దుర్వాసుని కాపాడవలసిన కర్తవ్యము కాళిదాసునకు లేదు. దుర్వాసునిపై నిదివఱకే పురాణములలో నూరుతొం

దరపాట్లు కలవు. ఇది నూటయొకటవది. వాని నన్నింటిని భరించుట కాతడు సమర్థుడు; కావున కాళిదాసంతతో నాగినాడు. ఇంతమెలకువతో కాళిదాసు తన గ్రంథములను రచించినాడు.

ఒక్క దుష్టపాత్రికూడలేకుండ కాళిదాసు శాకుంతల నాటకమును రచించినాడు. పందొమ్మిది సర్గల రఘువంశములో నొక్క దుష్టపాత్రికూడ లేదు. ఇది యాదృచ్ఛికము కాదు. పాశ్చాత్య సాహిత్యములో విషాదాంత గ్రంథములలోనే కాక సుఖాంత గ్రంథములలోకూడ దుష్టవాతావరణము విశేషము గాకన్పట్టును. భారతీయజీవితము సహజముగా పరమార్థ పరాయణమగుటచే నందు ప్రతిబింబించు సాహిత్యము తదనుగుణముగా నుండుట సహజము. అంతియేకాక భారతీయ కవులు బుద్ధిపూర్వకముగానే లోకకల్యాణ దృష్టితో మాంగళ్య వాతావరణమునకు ప్రాధాన్యమిచ్చిరి.

అంతధార్మిక శ్రద్ధతో రచింపబడిన శాకుంతలము కళా దృష్టితో చూచిన నెంత యున్నతస్థానము నాక్రమించుచున్నదో యనునది యత్యంతము ముఖ్యము. భారతీయులేకాదు, జగత్తులోని యన్ని దేశములవారును శాకుంతల కళాసౌందర్యమునకు ముగ్ధులైరి. గెటీయను జగత్ప్రసిద్ధ జర్మను విద్వాంసుడు శకుంతలను లలితకోమల కుసుమములయొక్కయు, పరిణత ఫలసంపదయొక్కయు సమ్మేళనముగాను వింద్యానరించి తన్మయతనుగూర్చి యాత్మను సమ్మోహితము గావింపగల

సమ_స్తమునకును మూ_ర్తిగాను, స్వర్గమ_ర్త్యలోక సమస్వయ ముగాను వర్ణించియున్నాడు

"Wouldest thou the young years'
Blossoms and the fruits of its decline,
And all by which the soul is
Charmed, enraptured and feasted fed,
Wouldst thou the Earth and
Heaven itself in one sole name combine?
I name the Sakuntala and all at once is said."

## ధ ర్మ పా ర ం ప ర్య ము.

హిందూధర్మ సంస్కృతులు ఇంతకాలము సజీవములై చైతన్యవంతములై యుండుటకు గల ముఖ్యహేతువులలో నీదేశమున కాలకాలమునకువిలసిల్లుచుండిన సాహిత్యమును కూడ పేర్కొనవలసియున్నది. ఏకాలములోనైనను మేధావులెల్లరు సాహిత్యముచే ప్రభావితులు కాకతప్పదు. కావున శ్రుతిస్మృతులను దర్శనములను అధ్యయనము చేయుట కవకాశములేని విద్యార్థికులెల్లరు సాహిత్యపఠనమూలముననే వైదికధర్మ సంస్కృతుల నాకళించుకొనుటయేకాక తద్వాసింతా న్తఃకరణులగుచుండిరి. సంస్కృత సాహిత్యముననేకాక గత శతాబ్దివఱకు ప్రాంతీయ భాషలలో విలసిల్లిన సాహిత్యములకు కూడ నిది వర్తించును. ఆంధ్రసాహిత్యమునకు మకుటాయమానమైన గ్రంథము భారతీయసంస్కృతి సర్వస్వమైన మహాభారతమగుటచే ఆంధ్రసాహిత్యము జీవించియున్నంతకాలము కవిత్రయము

వారి భారతమునకును ఆదరముతప్పదు. దానితోబాటు ప్రజలకు ప్రాచీనభారతీయసంస్కృతితో నవిచ్ఛిన్నసంబంధమును తప్పదు.

వేదధర్మ ప్రచారార్థము కావ్యములను వ్రాయుపద్ధతి సంస్కృతములోనుండి దేశభాషలన్నింటిలోనికిని వచ్చినది. మతాంతర ప్రభావాంతరిత వైభవమయిన ధర్మాశ్రమ ధర్మాత్మక వైదికమతము నుద్ధరించుటకుగాను భారతమును నన్నయ వ్రాయుట చరిత్రలో నంగీకరింపబడిన విషయము. ఉపదేశముతో సౌందర్యమును మేళవింపచేయుట నన్నయ సాధించిన మహాకార్యము.

ఆంధ్రశబ్ద చింతామణిలో లక్షణముగా చెప్పబడినదే ఆంధ్రమహాభారతములో లక్ష్యముగా నిర్వహింపబడినది. కావ్యలక్షణము చింతామణిలో "విశ్వశ్రేయః కావ్యం, తదదోషౌ పరిష్కృతౌ చ వాగర్థౌ" అని నిర్వచింపబడినది.

ఇందు "విశ్వశ్రేయః కావ్యం" అనునది కావ్యము యొక్క ఉపదేశ ప్రయోజనమును ప్రతిపాదించుచున్నది. "తదదోషౌ పరిష్కృతౌచవాగర్థౌ"అనునదిసౌందర్యలక్షణమును విధించుచున్నది. అందునను "అదోషౌ" అనునది దోషాభావమును (Negative Virtue), "పరిష్కృతౌ" (అలంకరింపబడినది) అనునది రమణీయతా లక్షణమును (Positive Virtue) విధించుచున్నవి.

అలంకార శాస్త్రములోని దోషప్రకరణమునకు లక్ష్యముకాక గుణప్రకరణమునకు లక్ష్యముగా నుండవలయునని

చింతామణి చెప్పుచున్నదానికి ఆంధ్రమహాభారతమే లక్ష్యముగానున్నది.

భారతదేశములోని యుత్తర ప్రాంతములలో బయలుదేరిన తులసీదాస రామాయణము, కంబరామాయణము మున్నగు గ్రంథములన్నియు నీరీతిగా ప్రాచీన భారతీయ సాహిత్య లక్షణానుగుణములై కళను ఉపదేశమును సమానమైనపాళ్ళలో కలుపుకొని దేశీయ సంప్రదాయముయొక్క అవిచ్ఛిన్న పారంపర్యమును నిలబెట్టినవి.

భారతీయ కావ్యనాటకాదులలోని యితివృత్తము సాధారణముగా మతగ్రంథములనుండియే గైకొనబడినదగుటచే సాహిత్యముతోబాటు వైదిక పౌరాణికగాథలు ప్రజలలో నిరంతరము ప్రచలితమగుచుండు నవకాశమేర్పడినది. అంతియేకాక ఉపమాద్యలంకారములకు ప్రాణభూతములగు భావములు సాధారణముగా మతవాఙ్మయమునుండి గ్రహింపబడినవి. మఱియు మతగ్రంథములలోకూడ సాహిత్య సౌరభము మిక్కుటముగా నుండుటచే నీదేశమున మతము, సాహిత్యము పడుగు, పేకవలె నొకదానితో నొకటి యల్లుకొనియున్నవి.

మేఘసందేశమువంటి శృంగార గ్రంథములోకూడ నిట్టి వాతావరణము కన్పట్టును. యక్షుడు మేఘునితో "నీవు మహాకాళక్షేత్రమున కేగునప్పటికి సాయంకాలము కాకపోయినను, సాయంకాలము వఱకును నీవచ్చట నుండుము. శివపూజాసమ

యమున నీవురుముదువేని శివుని సేవలో పటహామును మ్రో గించిన పుణ్యము నొందగలవు" అని చెప్పెను. ఏసందర్భము లోనైనను ఆర్ష వాతావరణమును కల్పించు నైపుణ్యము కాళి దాసునకు మిక్కుటముగా కలదు. రఘువంశ రాజుల వర్ణన సం దర్భమున మనుధర్మశాస్త్రానుగుణమైన జీవితము నాతడు వర్ణించును. వీరరసములోను యుద్ధవీరముకంటె దాన వీర దయా వీరధర్మ వీరములపట్ల నాతడు మొగ్గుచూపును. నిశ్శే షవిశ్రాణిత కోశజాతుడైన రఘువుదానమును, ఆమిషపిండము వలె స్వదేహమును సింహమున కర్పించిన దిలీపుని దయాధర్మ శీలమును ఆతడమితోత్సాహముతో వర్ణించును.

భారతీయ సాహిత్యములో నెచ్చటచూచినను నేదో సందర్భముగా పుణ్యతీర్థ వర్ణనములు, యజ్ఞ దాన తపోనుష్ఠాన ప్రసంగములు, ఋష్యాశ్రమ వర్ణనములు, వర్ణాశ్రమ ధర్మప్రవ చనములు, సత్యాహింసాది ధర్మవ్యాఖ్యానములు, పతివ్రతా చరిత్రలు, భక్తిమహిమప్రశంసలు, జ్ఞానవైరాగ్య ప్రబోధ ములు మున్నగునవి కుప్పతిప్పలుగ నుండుటచే నీకలికాలము లోనివారుకూడ సాహిత్యకాలక్షేప సమయమున కృతత్రేతా ద్వాపరయుగ పుణ్యవాతావరణములో విహరించుచుండుట కవకాశమున్నది. ఇట్టి సాహిత్యము నేటికి పుష్కలముగా లభించుచున్న కారణముచేత నెవడును తాను కలికాలములో పుట్టినందులకు నైరాశ్యము చెందనవసరములేదు.

ఈసాహిత్యములో విహరించు సమయములోనైనను కలిదోషవర్జితుడై పూర్వయుగ పుణ్యగంధ వాసితుడగు నవకాశము ప్రతిపాఠకునకును గలదు. హృదయమున కంటుకొను నాసంస్కారము జీవితములోని ప్రతిచర్యలోను ప్రతిబింబించును.

ఇతర దేశములలో మతగ్రంథములకు మాత్రమే మానవుని ధార్మికునిగా చేయుశక్తి యుండగా భారతదేశములో సాహిత్యగ్రంథములకుకూడ నిట్టి శక్తి యీరీతిగా కలుగుచున్నది. మన సాహిత్యగ్రంథములలో మధురాతిమధురమైన శైలిలో గావింపబడిన భగవన్మహిమ ప్రశంసలు, పరమేశ్వరతత్త్వ నిరూపణములు, సాధారణముగా నితర దేశములలోని మతసాహిత్య ప్రమాణమునుకూడ మించియున్నవి. శ్రీ శంకరుల సౌందర్యలహరి, శివానందలహరిమున్నగు గ్రంథములలో భక్తి పరాకాష్ఠ నందుకొనుటయేకాక కవితాకళ పరిణతి నొందినది. ఇట్లు భారతీయ సాహిత్యము కర్మ భక్తి జ్ఞానాత్మకమైన వైదికమతమునుండి వేరుచేయుటకు వీలుకానిరీతిగా పెనవైచుకొని యీమతమునకు ప్రధానప్రచారకస్థానము నాక్రమించుకొన్నది. కవి యేశతాబ్దివాడైనను కావ్యవాతావరణము ప్రాయికముగ నార్షమై యుండుట ప్రముఖలక్షణము.

భారతీయ సాహిత్యము ప్రజలతో నిట్లు సన్నిహిత సంబంధమును గల్గియుండుట కొక ముఖ్యకారణము నిట పేర్కొనవలసియున్నది. ప్రజాహృదయములో సూటిగా ప్రవేశింపగల ప్రసాదగుణమీ దేశపు మహాకవులకుండిన యొకప్రధాన

లక్షణము. చిన్నవయస్సులోనుండి ఒక భాషను నేర్చుకొను టకు ప్రారంభించువారు ఆభాషలోని మహాకవుల గ్రంథము లనే చదువుట కవకాశము గల భాష సంస్కృత మొక్కటియే యని చెప్పవచ్చును. అట్టి ప్రాథమికులు చదువుటకు తగినంత ప్రసాదగుణము వాల్మీకిలోను కాళిదాసాది మహాకవులలోను గన్పట్టుచున్నది. కవులలో రెండవ తరగతివారిచేతనో మూడ వతరగతివారిచేతనో సాధారణమైన వాచక రచయితలచేతనో రచియింపబడిన పుస్తకములను చదివి భాషనునేర్చుకొను దుర వస్థ లేకుండ రామాయణముతోనో రఘువంశముతోనో భాషను నేర్చుకొను మహాభాగ్యముండుటవలననే యీ దేశ ములో సంస్కృతమునేర్చిన ప్రతివానికిని యంతో యింతో భారతీయ సంస్కృతి పరిమళమంటుట తప్పనిసరి యాయెను.

అభారతీయ లక్షణములు గల సాహిత్యము నేడు దేశ ములో వెల్లివిరియుచున్నది. ఎక్కడచూచినను విషాదపరిపూ రిత గాథలు, రక్తపాతము, చౌర్యమాయాది వాతావరణము, అధార్మికానాగరక 'ప్రేమ' గాథలు, అపరాధ పరిశోధనలు మున్నగునవి పత్రికలలోను, చలనచిత్రములలోను, నవలలోను, నాటకములలోను, సహస్రసంఖ్యాకములుగ బయలుదేరి పిల్ల లను, స్త్రీలను, యువకులను, పెద్దలనుకూడ ఆకర్షించి పాఠకు లను తమకు బానిసలనుగా చేసికొని నీతిని గుల్లచేయుటయే కాక సామాన్యశాంతి ప్రధానజీవితముపై ప్రజలకురుచి లేకుండ చేసి దారుణ సంఘటనలకును, రక్తపాతములకును, ఉద్రిక్త

ప్రేమగాథలకును లేహాతహాలాడు తత్త్వమును ప్రజలలో కలిగించుచున్నవై భారతీయతనే లోపింపచేయుచున్నవి. విదేశములనుండి దిగుమతియగుచున్న దారుణ కథాగ్రంథముల (Tales of Horror) వలన భారతీయ హృదయమునకు కలుగు హానిని గుర్తించి భారత ప్రభుత్వము కొలది సంవత్సరముల క్రిందట నట్టిగ్రంథముల దిగుమతిని నిషేధించినది.

గ్రంథవాతావరణము పాఠకహృదయమునందు ప్రతిబింబితమగుచుండును. మంగళమయమైన సాహిత్యమును చదివినపిమ్మట మధురస్మృతులు, మధురస్వప్నములు, మధురాలోచనలు బయలుదేరును. రక్తపాతములతో, దారుణసంఘటనలతో, నేరములతోనిండిన గ్రంథమును చదివినపిమ్మట దారుణ స్మరణలు, రక్తపాత దృశ్యోపేత స్వప్నములు, దారుణణాలోచనలు కలుగును. ఇట్టి సాహిత్యము మానవత్వమునే లోపింపచేయును.

ఏవగించుకొనదగిన దుష్టత్వమును వినోదకరమైన హాస్యధోరణిలో చిత్రించుటయు, అపసిద్ధాంతమును చమత్కారమునకై పరమార్థముగా చిత్రించుటయు అప్పటికప్పుడు పాఠకునకు గిలిగింతలు పెట్టినను క్రమముగా జీవితమును ఉత్కృష్ట లక్ష్యరహితముగాను, అల్పచాపల్యవాత చాలిత తూలముగాను మార్చివేయును. అట్టి సాహిత్యముకూడ నేడు పెరిగిపోవుచున్నది. గ్రంథమంతయు ఉదాత్తధోరణిలోనుండి

యెక్కడనో యొకచోట నిట్టి హాస్యచమత్కారములున్నను వానిని సాంప్రదాయిక విమర్శకులు సహింపలేరు. "ఆకలిగొన్నవారు వ్యాకరణమును భుజింతురా? దప్పికగొన్నవారు కావ్యరసమును త్రాగుదురా? ధనమునే సంపాదింపుము." అనుచోట ప్రమాదకరమైన భావము లేకపోయినను అట్టిఛాయ కన్పట్టినంతమాత్రమున క్షేమేంద్రుడు దానిని నిరసించినాడు.

బుభుక్షితైర్వ్యాకరణం నభుజ్యతే
నపీయతే కావ్యరసః పిపాసితైః

అను చమత్కారములో తత్త్వౌచిత్యము చెడినందున నది గ్రాహ్యముకాదని క్షేమేంద్రుడు చెప్పియున్నాడు. మన పూర్వుల పారమార్థికశ్రద్ధ యిట్టిది.

నిరుపయోగము, అనర్థదాయకము అగు వాఙ్మయముచే ప్రజలు రంజింపబడుటకు తత్కాలమందు ఉదాత్తవాఙ్మయమును రమణీయధోరణిలో రచింపగల కవుల వైరళ్యమే ముఖ్యకారణము. గత శతాబ్దములో ఇంగ్లండులో నిమ్నశ్రేణికిచెందిన నవలలు కుప్పతిప్పలుగా బయలుదేరుటను చూచి మెకాలే యిట్లు ప్రతిజ్ఞచేసెను. "రంజింపచేయుటలో నీ నవలలకు తీసిపోకుండ ప్రజానీకమున కావశ్యకమైన చారిత్రకజ్ఞానమును పుష్కలముగా నీయగల గ్రంథములను నేను రచించి ప్రతివిలాసవతియొక్క బల్లమీాదను ఈచెత్తపుస్తకములకుబదులుగా నాగ్రంథములుంచునట్లు గ్రంథపరంపరను ప్రకటించె

దను." ఈసంకల్పమునకు ఫలితముగా బయలుదేరిన ఆతని హిస్టరీ ఆఫ్ ఇంగ్లండు అను గ్రంథము మధురమైన శైలిలో, సహృదయరంజకముగా రచింపబడి చారిత్రక గ్రంథమయ్యు సాహిత్యగ్రంథములలో స్థానము నాక్రమించినది.

నేడు భారతదేశములో బయలుదేరుచున్న "అనర్థక" సాహిత్యస్థానమున కల్యాణవాఙ్మయము ప్రతిష్ఠింపబడవల యునన్నచో లోకశ్రేయోనిరతులైన రచయితలు సాంప్రదాయికభావములను రసోదంచితముగా కావ్యనాటక కథానికాది రూపమున వెల్లడించుట యొక ముఖ్యమైన మార్గము.

సాహిత్యము అగ్నిహోత్రము వంటిది. దేవతల కాహుతినందించుటకు శిష్టులుపయోగించు అగ్నినే దుష్టులు కొంపలు తగులబెట్టుట కుపయోగింపవచ్చును. కవితా పవిత్రత ను దృష్టిలోనిడికొనియే థామస్ గ్రే కవితను దివ్యాగ్నిగా వర్ణించియున్నాడు. (some celestial fire). మానవుని దివ్యత్వములోనికి గొనిపోదగిన కవితాశక్తి దురుపయోగము చెందుచో సమాజవ్యవస్థను భ్రష్టముచేయుటకును నీతిని గుల్లచేయుటకును సమర్థమగును. అట్టి సాహిత్యముపట్ల జాగరూకతతోనుండవలసిన పరిస్థితి వచ్చియున్నది.

లలితసరళ దేశభాషలలో రచింపబడునో రామాయణ మహాభారత కథలే జనసామాన్యము యొక్క హృదయము నాకర్షింపగలవు. రమ్యసులభభాషలో రచింపబడు దుష్టవిష

యమునకును అట్టిభాషలోనే రచింపబడు ఉదాత్తవిషయమునకును పోటీకల్గుచో ప్రజలు నిస్సందేహముగా నీ రెండవదానినే యాదరింపగలరు. ఈవిషయమై యిటీవల ఇండోనీషియాలో జరిగిన సంఘటనము మనకాశ్చర్యమును గల్గించును. ఆ దేశమున అమెరికన్ కామిక్స్ (నిమ్న శ్రేణికి చెందిన ప్రహసనములు) ప్రజాహృదయములపై నాధిపత్యము నెఱపుచుండినవి. దేశశ్రేయోభిలాషులకిది మిక్కిలి బాధను గల్గించెను. ప్రజాహృదయము నట్టి సాహిత్యమునుండి మరలించి యుదాత్త సాహిత్యముపైకి త్రిప్పవలయునని వారు తలంచిరి. రమ్య సులభభాషలో రామాయణ మహాభారత కథలను రచియింపించి వారు ప్రజలకందించిరి. వెంటనే ప్రజలా ప్రహసన సాహిత్యమునువీడి యీప్రశస్త సాహిత్యమును చేబట్టిరి. రామాయణ మహాభారత కథలముందర నా ప్రహసన గ్రంథముల బండారము బయటపడినది. రామాయణ మహాభారతముల ఆకర్షకశక్తి ముందా ప్రహసనములు నిలువజాలకపోయినవి. మహాభారతము ఇండోనీషియాలో నిటీవల 40 సంపుటములుగా వెలువడినది. రామాయణముకాని మహాభారతముకాని ఇండోనీషియన్ భాషలో అచ్చుకాగానే వెచ్చమయిపోవుచున్నందున నెప్పటికప్పుడు నూతనముగా ముద్రింపవలసి వచ్చుచున్నవి. ఇన్ని వేల సంవత్సరములు గడచినను పాతబడక విదేశస్థులనుగూడ నీరీతిగా నాకర్షింపగలిగిన రామాయణ మహాభారతముల నైసర్గిక పటుత్వమున కెవరుజోహారులర్పింపరు ? ఈ

యార్ష గ్రంథముల భాషాసౌభాగ్యము సంస్కృత భాషాభిజ్ఞులకుమాత్రమే అస్వాద్యమైనను వీని భావసంపదయు, కథా మాధుర్యము నితరులనుగూడ నుద్ధరింపగలవనునది ప్రధానాంశము. నేడు మన దేశములో బయలు దేరుచున్న అభారతీయసాహిత్యము నరికట్టుటకును నిట్టి చికిత్సలు ఫలవంతములుకాగలవు.

## ఉ ప సం హా ర ము.

అమంగళఘట్ట బాహుళ్యమును చిత్రించిన కవిని లోకయాథార్థ్య ప్రదర్శకుడని స్తుతించుట అభారతీయపద్ధతి. కవిలోకములోని యథార్థస్థితిని వర్ణించినను, అది ధర్మమోక్ష పురుషార్థ భంజకముగానున్నచో సాంప్రదాయికులను రంజింపచేయజాలదు. అసంస్కృతహృదయుని ఉత్సాహపఱచునట్టి అధార్మిక శృంగారవర్ణములు, ఘాతుకకృత్య చిత్రణములు భారతీయకవి లక్ష్యములుగా నెప్పుడునులేవు.

మానవహృదయములోని సుకుమార భావములకును, కారుణ్యమునకును, ధార్మికతకును పరమేశ్వరభక్తికిని ఆధ్యాత్మిక వికాసమునకును దోహదమిచ్చుచు, ఉదాత్తమైన ధోరణిలో నడచు సాహిత్యమునే చదువవలయునని భారతీయులసిద్ధాంతము.

"కావ్యాలాపాంశ్చవర్జయేత్" అను కావ్యపఠననిషేధము దుష్టకావ్యపరముగా చెప్పబడినది.

భారతీయ సాహిత్యముయొక్క విశిష్టతనుగురించి శ్రీ అరవింద (Kalidasa P. 35) లిఖించిన వాక్యముల నిట నుల్లేఖింపవలసియున్నది.

"మానవజీవిత ప్రదర్శనమును పాత్రచిత్రణమును కవికి ప్రధానకర్తవ్యములనుగా హిందూఅలంకారకులు నిర్దేశింప లేదు. ఇవి ప్రయోజనాంతరరహితములై స్వతస్సిద్ధముగనే నిర్వ ర్తనీయములని పాశ్చాత్యులు భావించినట్లు భారతీయులు భావింపలేదు. భారతీయాలంకారిక మతములో కవిత్వము ఆనందావహము కోమలమునైన యొక కళ. నాటకము సూక్ష్మములైన మానవహృదయాంతరభావములను చిత్రించు చుసామాజికుని మనస్సును కోమలమైన శాంతిసమన్వితస్థితిలో నికి తీసికొనిపోవుటను ముఖ్యకర్తవ్యముగా గల్గియున్నది. మానవుని జుట్టుపట్టుకొని యీడ్చి తుపానువంటి దారుణకరు ణామయ సంఘటనలలోనికిని భయానక దృశ్యములలోనికిని తీసికొనిపోయి వానిని రక్తములో ముంచి భయోపహితుని గాను కంపితదేహునిగాను చేసివైచుటను తన కర్తవ్యమునుగా భారతీయసాహిత్యము భావింపలేదు. డచెస్ ఆఫ్ మాల్ఫీలో కాని, ఒడిపస్‌లోకాని, మాక్బెత్ ఒథెల్లోలవంటి విషాదాం తనాటకములలోకాని కళాసంబంధమైన ఆనందమును పొందు టను ఆటవికా నాగరక లక్షణముగాను,అమానుష లక్షణము గాను భారతీయులు భావింతురు. దీనికి కారణము హిందూ మనఃప్రవృతిలోని దివ్యమైన యొకవిధమగు కోమలత్వము. హిందువుల మనస్సు స్వతస్సిద్ధముగా నిత్యము ఉదాత్తముగా నుండును; మరియు నది శాంతమైనది, సహనశక్తి కలది. మాధుర్యము, పవిత్రత, మరియు బుద్ధుని యాత్మనుండి పొంగి

వచ్చిన కారుణ్యము హిందువునకు స్వభావసిద్ధమైనవి. కావున కవితా కళ ఆనందపఱచునది మాత్రమేకాక ఉదాత్తతను చేకూర్చునదిగా నుండవలయునని భారతదేశములో భావింపబడెను.''

ఇంగ్లీషున్నగు ఆధునిక యూరపియను సాహిత్యములలోనేకాక గ్రీకు లాటిన్ సాహిత్యములలోకూడ అపారపాండిత్యమును గల్గియుండి ఆధునిక తత్త్వవేత్తలలోను, జగత్ప్రవక్తలలోను ఒకరుగా విఖ్యాతులైన శ్రీఅరవింద ప్రాచీన భారతీయ సాహిత్య ప్రాశస్త్యమును వెల్లడించుచు పల్కిన యీయసందిగ్ధవచనములు విశాల ప్రపంచములో భారతీయ సాహిత్యమునకు గల ఉన్నతస్థానమును నిర్దేశించుచున్నవి. అన్ని దేశములలోను, అన్ని భాషలలోను గొప్ప సాహిత్యమే బయలుదేరినదనియు, నొకటి గొప్పది మరొకటి తక్కువది యనుటకు వీలులేదనియు సామాన్యముగా చెప్పివేయుటకు ఏవిధమైన ప్రతిభయు నక్కఱలేదు. సామాన్యులెల్లరు నట్లు చెప్పువారే. విమర్శించియొక సాహిత్యముయొక్క విశిష్టతను నిరూపించుటకు అసాధారణ మేధ కావలయును. అతిలోక ప్రతిభాఢ్యులైన శ్రీఅరవింద గావించిన యీతీర్పును ప్రత్యాఖ్యానముచేయుట యెవరికిని శక్యముకాదు. భారతీయ జీవితమునకును సాహిత్యమునకును గల ప్రగాఢసంబంధము పరస్పరోత్తేజనహేతువై భారతదేశముయొక్క యాధ్యాత్మిక దృక్పథమును శాంతిప్రియత్వమును జగత్ప్రసిద్ధములను గావించినది.

## 3. సాహిత్యము –

## బహుముఖ భారతీయ సంస్కృతి.

(వ్యాఖ్యానావశ్యకత)

తర్క వ్యాకరణ వేదాన్త ధర్మశాస్త్రాది శాస్త్రగ్రంథములలో నాయాశాస్త్రవిషయములే కన్పట్టును. సాహిత్యములోనన్ననో యన్నిశాస్త్రముల ప్రసక్తియు, లోకవృత్తమునుగూడ గోచరించును. ఈబహువిషయ ప్రసక్తత్వమే సాహిత్యశబ్దముచే తెలుపబడు చున్నది. "సహితానాం భావః సాహిత్యం" (అనేకవిషయముల పరిజ్ఞానమొకచోట కూడియుండుట) అనుసాహిత్య శబ్దనిర్వచనము ప్రాచీనమైనది. ప్రాచీన మహాకవులు తమ వాఙ్మయమును రసవంతముగాను ధర్మబోధకముగాను మాత్రమే కాక బహుముఖ ప్రాచీనసంస్కృతి ప్రదర్శకముగాకూడ రచించిరి. సంస్కృత కావ్యములలో నిబద్ధమైన యీబహుముఖ ప్రాచీన సంస్కృతిని గ్రహించుశక్తి మనకుచాలక స్థూలముగమాత్రమే మనమాగ్రంథములను పఠించుచున్నాము. అదృష్టవశమున మల్లినాథవ్యాఖ్య నేటికి నిలచియున్నందున కావ్యపంచకమును, నైషధమును తద్వ్యాఖ్యతో పఠించువారి లోటును తీర్చుకొనగల్గుచున్నారు. అట్టి వ్యాఖ్యానముల సహాయములేకుండ ప్రాచీన కావ్యములను చదువువారు తమకుతామ న్యాయము చేసికొనుటయేకాక ప్రాచీనకవులకుగూడ నన్యాయము చేయుచున్నారు.

దిఙ్మాత్రముగా నీయంశమును నిరూపించుటకుగాను మల్లినాథవ్యాఖ్యాప్రశంసారూపమైన నాసమీక్ష నిట పొందు పఱచుచున్నాను:

## శ్రుతులు

వేదపరిజ్ఞానమున్ననే కాని యన్వయింపని ఘట్టములు కావ్యములలో నెన్నియో కలవు. అప్పట్ల మల్లినాథుడు వ్యవహరించిన తెఱగును చూతము. యజ్ఞమునకు దక్షిణవలె దిలీపునకు సుదక్షిణ పత్నిగానుండెనని కాళిదాసు చెప్పినాడు. యజ్ఞమునకు దక్షిణ భార్య యనుటకు వేదప్రామాణ్యమును మల్లినాథుడు చూపును. "యజ్ఞోగంధర్వస్తస్య దక్షిణా అప్సరసః" "తేదక్షం తే దక్షిణాం ప్రతిగృహ్య" అను శ్రుతివాక్యముల నెంతయో సందర్భశుద్ధితో నాత డుదాహరించినాడు.

హిమవంతునకు దేవతలతో బాటు యజ్ఞభాగము కల్పింపబడినదని కాళిదాసు కుమారసంభవములో చెప్పినదానికి మల్లినాథుడు శ్రుత్యాధారమును కన్పఱచుచు "సోమస్య రాజ్ఞః కురఙ్గ ఇందోః శృంగీసింధోః శింశుమారో హిమవతో వాస్తి" అను వచనము నుదాహరించినాడు.

ఇంద్రుడు మన్మథుని పిలిపింపగా మన్మథుడు "ఏ యేక పత్నిని నీకు స్వాధీనము చేయుదును ?" అని ప్రశ్నించును. అసందర్భముగ గన్పట్టు నీ ప్రశ్నను సమర్థించుచు మల్లినాథుడు "అహల్యాయై జార" యను శ్రుతివాక్యము నుదాహ

రించినాడు. మల్లినాథుడు వేదమును జిహ్వాగ్రమందు గలవాడనుట స్పష్టము.

"జాయాప్రతిగ్రాహిత గంధమాల్యాం" అనుచోట కవి సుదక్షిణాదేవిపట్ల భార్యాదిశబ్దములను వాడక జాయాశబ్దమును ప్రయోగించినాడు. దీనిసారస్యమును శ్రుత్యాధారముచే మల్లినాథుడు నిరూపించినాడు. త్వరలో సుదక్షిణాదేవి కుమారుని కనుననుభావము జాయాశబ్దమువలన స్ఫురించును. జాయాశబ్దము 'జనీ' ప్రాదుర్భావే యనుధాతువునుండి వచ్చినది. పురుషుడు పుత్రరూపమున తానే భార్యనుండి జనించుచున్నాడు కావున నామె 'జాయ' యనుచున్నది. ఐతరేయ బ్రాహ్మణములోని యీ క్రిందివాక్యమును మల్లినాథుడుదాహరించి సుదక్షిణ జాయకాబోవుచున్నదను ధ్వనిని మనకు చూపినాడు. "పతిర్జాయాం సంప్రవిశతి గర్భోభూత్వేహమాతరం, తస్యాంపునర్నవో భూత్వాదశమేమాసి జాయతే తజ్జాయా జాయాభవతి యదస్యాం జాయతేపునః."

## ధర్మశాస్త్రము

కుమారసంభవములో మైనాకజన్మమును పేర్కొనుటలో కాళిదాసు నుద్దేశము మల్లినాథునిచే నిట్లావిష్కరింపబడినది. పార్వతికి సోదరుడున్నట్లు చెప్పనిచో పెండ్లికుమార్తె కానున్న పార్వతి కది యొక లోపమగును. అభ్రాతృకన్యను వివాహమాడరాదను స్మృతివచన మున్నది.

"యస్యాస్తు న భవేద్భ్రాతా నవిజ్ఞాయేత వాపితా
నోపయచ్ఛేత తాం ప్రాజ్ఞః పుత్రికా ధర్మశంకయా"

అను మను వచనమును మల్లినాథుడుదాహరించి మైనాక ప్రసంగమును సమర్థించినాడు.

"శివునివంటి భర్తయు, అట్టి ప్రేమయు తపస్సువలన లభింపవలయును గాని మరెట్లు లభ్యమగును? అని కాళిదాసు చెప్పగా మల్లినాథుడు అసాధ్యముగా గన్పట్టు దానిని సాధించుటకు తపస్సొక్కటియే సాధనమను మనువచనము నుదాహరించుటచూడ సరిగా నెక్కడ నే ప్రమాణ వచనము నుదాహరింపవలయునో నిర్ణయించుకొనుటలో నాతడు సిద్ధహస్తుడని స్పష్టమగును.

దిలీపమహారాజు సర్వతేజోభిభావిగా నున్నాడని కాళిదాసు వర్ణించినాడు. ఎంతసూటియైన స్మృతివచనము నుదాహరించి మల్లినాథుడు దీనిని వ్యాఖ్యానించినాడో చూడదగును.

"అష్టాభిశ్చ సురేంద్రాణాం మాత్రాభిర్నిర్మితోనృపః
తస్మా దభిభవ త్యేష సర్వభూతాని తేజసా."

వ్యాఖ్యాత లనేకులు ప్రమాణగ్రంథములలోనుండి వచనముల నుల్లేఖించుటకలదు. కాని మల్లినాథు డుదాహరించి నన్ని శాస్త్రములను కాని, అంతసూటిగాకాని యుదాహరించినవారు లేరు.

"జ్ఞానే మౌనం క్షమాశక్తౌ" అను దిలీపవర్ణమును సమర్థించుచు "శక్తానాం భూషణం క్షమా అను చాణక్య

వచనమును, "త్యాగే శ్లాఘావిపర్యయః" అను దానిని సమర్థించుచు "న దత్వాపరికీర్తయేత్" అను మను వచనమును ఆత డుదాహరించినాడు. ఇట్టివి పెక్కులు కలవు.

మరొక అద్భుతసందర్భము పరికింపదగియున్నది. సుదక్షిణాదేవియు దిలీపమహారాజును వసిష్ఠాశ్రమముచేరిరి. అపుడు వసిష్ఠమహాముని అగ్నిహోత్రానుష్ఠానములోనుండెను. అనుష్ఠానము ముగియగానే దిలీపుడు సపత్నీకముగా నమస్కరించెను. ధర్మశాస్త్ర సంస్కారపరిణతుడైన మల్లినాథుడు కవియీరీతిగా చెప్పుటకు గల ధర్మశాస్త్రసంబంధమైన కారణమును చూపుచున్నాడు. జపహోమాద్యనుష్ఠానములోనున్నవానికి నమస్కారము చేయరాదను మనుస్మృతివచనమును మల్లినాథు డుదాహరించినాడు.

"జపంహోమంచ కుర్వాణో నాభివాద్యోద్విజోభవేత్"

"ఇత్యనుష్ఠానమధ్యేఽభివాదనిషేధాత్" అని మల్లినాథుడు వ్రాసియుండనిచో మనము అనుష్ఠానవిఘ్నము కల్గింపనిచ్ఛలేనివాడై దిలీపుడు తాళినాడని భావించి యుండెడివారము. దేవతాసేవలో నున్నవాడు అభివాదమును స్వీకరించుట దేవతాపచారమను మహత్తరభావమును మల్లినాథుడు చూపినాడు.

నడచుచున్న గోవుల పాదములవలన రేగిన పరాగము శరీరమునకు తగులుటచే దిలీపునకు తీర్థాభిషేకశుద్ధి కలిగినదని కాళిదాసు నుడివినాడు. గోరజఃస్నానము వాయవ్యతీర్థాభిషేకమనియు, భస్మలేపనము ఆగ్నేయస్నానమనియు, జలమజ్జనము స్నానమనియు, ఆపోహి ష్ఠేతిమార్జనము బ్రాహ్మస్నానమనియు వారుణ తెలుపుస్మృతివచనమునుమల్లినాథుడుదాహరించినాడు.

"ఆగ్నేయం భస్మనా స్నానమవగాహ్యాతు వారుణం
ఆపోహిష్ఠేతి చ బ్రాహ్మం వాయవ్యం గోరజఃస్మృతం"

కుమారసంభవములో కాళిదాసు మైనాకజననప్రసంగము చేసినాడు. ఇది యెందులకో మల్లినాథుడు ధర్మశాస్త్ర దృష్టితో వివరించినాడు. పార్వతికి సోదరుడున్నాడని చెప్పిననే కాని యామెకుత్తమవధూత్వము సిద్ధింపదు. అభ్రాతృకన్య యుత్తమవధువుకాదు.

యస్యాస్తున భవేద్భ్రాతా నవిజ్ఞాయేతవాపితా ॥
నోపయచ్ఛేతతాం ప్రాజ్ఞః పుత్రికాధర్మశంకయా.

అను మనువచనమును మల్లినాథు డుదాహరించి యుండనిచో మైనాకప్రసంగ మప్రస్తుతప్రసంగమని మనకు తోచియుండును. ఈ రీతిగా మల్లినాథుడు తన శాస్త్రజ్ఞానముచే వ్యాఖ్యానమునకు తేటనిచ్చినాడు.

## సంగీతము

నేడు మల్లినాథవ్యాఖ్యతో కావ్యములను పాఠము చెప్పు విద్వాంసులు సంగీతశాస్త్రమునకు సంబంధించిన యం

శములను అజ్ఞతములనియో అప్రధానములనియో తోసి వేయుచుందురు. మల్లినాథున కజ్ఞాతవిషయమే లేదనిపించును. అప్రధానములుగ గన్పట్టున వెన్నియో వాస్తవముగ నెంత ప్రధానములుగా నుండుట కవకాశ మున్నదో యాతడు మనకు చూపుచుండును.

'ఉద్గాస్య తామిచ్ఛతి కిన్నరాణాం' అనుచోట ఉదుపసర్గప్రయోగమునకు మల్లినాథు డిట్లు సార్థకతను చూపును. గాంధారగ్రామముచేతమాత్రమే దేవతలు గానము చేయుదురనియు షడ్జమధ్యమ గ్రామములను మాత్రమే మానవులు గానము చేయుదురనియు సంగీతశాస్త్రములో నారదోక్తి. ఉద్గాస్యతాం దేవయోనిత్వా దుచ్చైర్గాంధారగ్రామేణగానం కరిష్యతాం—ఉక్తంచ నారదేన—

షడ్జమధ్యమనామానౌ గ్రామౌ గాయన్తి మానవాః
నతు గాంధారనామానం స లభ్యో దేవయోనిభిః''

అట్లే 'షడ్జసంవాదినీః కేకా ద్విధా భిన్నాశ్శిఖండిభిః' అనుచోట కేవల ద్విధాభిన్నత్వమును షడ్జసంవాదినీత్వమును శాస్త్రప్రమాణ వచనములచే నీవ్యాఖ్యాత వివరించినాడు.

## వై ద్య శా స్త్ర ము

బహుశాస్త్ర పరిచయముగలవారికిమాత్రమే గోచరింపగల ధ్వనులు కొన్ని కాళిదాసాది మహాకవులలో గలవు. వానిని పైకి తీయగల ప్రతిభ మల్లినాథున కుండుటయు, అట్టి

సునిశిత బుద్ధినుండియు బహుముఖ పాండిత్యమునుండియు వెలువడిన యాయన వ్యాఖ్యానములు వెనుకటి వ్యాఖ్యానములవలె అంతరించిపోక నేటికిని నిలచి ప్రచారములో నుండుటయు మన మహాభాగ్యము.

గర్భిణియైన సుదక్షిణ కోరినదానినెల్ల రాజు కూర్చెనని కాళిదాసు చెప్పినాడు. హితాహితముల నాలోచింపక యిట్లు భార్యావశుడగుట స్త్రీలౌల్యమను దోషము కాదా యన మల్లినాథుడు కాదని యిట్లు సమర్థించును: గర్భిణీవాంఛను తీర్పనిచో గర్భస్థశిశువునకు హానిగల్గును, కావున గర్భిణీవాంఛాపూరణము న్యాయ్యము. దీని కనుగుణమగు వైద్యశాస్త్రవచనమును మల్లినాథుడు కన్పఱచినాడు.

వైద్యశాస్త్రమునకు సంబంధించిన యీక్రింది ధ్వనిని చూడదగును: మేఘసందేశములో యక్షుడు మేఘునితో నిట్లనును. "నీ వా పర్వతముమీద వర్షించి వనగజమదముచే పరిమళింపచేయబడిన నీటిని త్రాగి తిరిగి బయలు దేరుము. అప్పుడు బరువుగలవాడవైనందున వాయువు నిన్ను కదల్పజాలదు." వాతరోగికి ముందుగా వమనము చేయించుటయు పిమ్మట బాధ కలుగకుండుటకై వానిచే చేదు కషాయమును త్రాగించుటయునను వైద్యప్రక్రియ ఇచ్చట ధ్వనితమని నుడువుచు మల్లినాథుడు దానికి సంబంధించిన వాగ్భటశ్లోకముల నుదాహరించినాడు. తిక్తశబ్దమునకు "పరిమళముగల" అనియు చేదైన అనియు రెండర్థములకు నైఘంటికాధారము కలదు.

ఎక్కడనో వైద్యగ్రంథములలోనున్న శ్లోకములనంతె సందర్భ శుద్ధిగా నుదాహరించి శ్లోకస్వారస్యమును ప్రదర్శింపగల యీ వ్యాఖ్యాత అదివరకుండిన వ్యాఖ్యానముల నాచ్ఛాదించె ననుటలో నాశ్చర్యములేదు.

"పర్వతముమీద ఱాళ్ళపై కొట్టుకొనుచు ప్రవహించు లఘూదకమును సేవించుము" అనుచోట మల్లినాథుడు ఱాళ్ళపైని కొట్టుకొనుచు ప్రవహించు నీరు లఘువుగా నుండుటకు వైద్యశాస్త్రమునుండి ప్రమాణ వచనములను చూపినాడు.

"ఉపలాస్ఫాలనోత్క్షేపవిచ్ఛేదాః ఖేదితోదకాః
హిమవన్మలయోద్భూతాః పథ్యా సద్యోభవన్త్యమూః"

ఈరీతి వ్యాఖ్యానములను మల్లినాథునివంటి సకల శాస్త్ర పండితుడే కాని రచింపజాలడు.

## జ్యోతిషాదిశాస్త్రములు

రఘువు పంచగ్రహము లుచ్చలోనుండగా జన్మించెను. ఇది రఘువునకు దేవతుల్యత్వమును సూచించునని మల్లినాథుడు కృష్ణీయ మను జ్యోతిషగ్రంథమునుండి ప్రమాణమును చూపినాడు.

"అభ్యున్నతాంగుష్ఠనఖప్రభాభిః" ఇత్యాదిశ్లోకములో పార్వతి పాదములు వర్ణింపబడినవి. అట్టి పాదములు గల బాలిక నృపతి సమ్మతురాలగుటకు సాముద్రికశాస్త్ర శ్లోకములను మల్లినాథు డుదాహరించినాడు.

ఇందుమతీ స్వయంవరములో ఒకరాజు చేతితో లీలారవిందమును త్రిప్పెను. ఇందుమతి యతని నెంచుకొనక మరొకరాజు నొద్దకేగెను. ఎందువలననో కాళిదాసు చెప్పలేదు. మల్లినాథుడు శకున సాముద్రికాది శాస్త్రములలో మహావిద్వాంసుడైనందున నిట్టిపట్ల కాళిదాసాభిప్రాయమును వ్యాఖ్యానింపగల్గినాడు. హస్తఘూర్ణకత్వమవలక్షణమని మల్లినాథుడు స్పష్టపఱచినాడు. మరొకరాజు శత్రురాజులను నాశనముచేయుచునని తెలుపుటకు కాలు నేలరాచెను. పాదోల్లేఖనము లక్ష్మీవినాశకమని మల్లినాథుడు వివరించినాడు. మెలకువతో వ్యాఖ్యానించి మల్లినాథుడు మెరుగుపెట్టిన ఘట్టము లసంఖ్యాకములు.

యక్షుడు భార్యకు సందేశమును పంపుటలో "స్వప్నములో కన్పట్టిన నిన్నాలింగనము చేసికొనుటకు నేను బాహువులను సాచగా నన్నుచూచి జాలిపడు దేవతలు కార్చుకన్నీరు చెట్ల చిగుళ్ళపై బడుచున్నది" అని చెప్పెను.

చెట్ల చిగుళ్ళపై కన్నీరు పడుచున్నదని కాళిదాసెందుల చెప్పెనో మల్లినాథుడు వివరించినాడు. దేవతల కన్నీరు నేలపై బడుచో అపశకునమనియు, యక్షుడు శాపాంతము లోగా మరణించునను భయము దానివలన నాతని భార్యకు కల్గుననియు, ఆభయమును వారించుటకై దేవతల కన్నీరు తరుకిసలయములందు పడుచున్నదని చెప్పబడినదనియు మల్లి

నాథుడు వ్యాఖ్యానించుచు నీక్రింది నిమిత్త శాస్త్రశ్లోకము నుదా
హరించినాడు.

మహాత్మ గురు దేవానామ శ్రిపాతః క్షితౌయది
దేశభంగో మహద్దుఃఖం మరణంచ భవేద్ధ్రువం.

మన్మధుడు శివదృష్టిని పురశ్శుక్రి ప్రదేశమునువలె
తప్పించుకొనెనని కాళిదాసు చెప్పినాడు. ఈ యుపమాన
మును వివరించుచు మల్లినాథుడు "ప్రతిశుక్రం ప్రతిబుధం
ప్రత్యంగారక మేవచ । అపి శుక్రసమోరాజా హతసైన్యో నివ
ర్తతే" అను జ్యోతిషశ్లోకము నుదాహరించినాడు.

వ్యాకరణాదిశాస్త్రములలోనే కాక అర్థశాస్త్రాదులలోకూడ
నాతనికున్న నిశితపరిజ్ఞానమునకు మనమక్కజమొందుదుము.
రఘుమహారాజు జైత్రయాత్రకేగఁబోవుచు అశ్వములకు నీరాజ
నముచేయించెను. అప్పుడగ్నిహోత్రుడు ప్రదక్షిణమైనజ్వాల
కలవాడై ఆజ్వాలయనెడుహస్తముచేత రఘువునకుజయమునొ
సగెనని కాళిదాసుచెప్పినాడు. ఆహవయాత్రయను గ్రంథ
ములో అట్టి నీరాజనములో అగ్నిహోత్రుడు ప్రదక్షిణగతు
డైనచో సముద్రరశనమైన భూమిని స్వాధీనము చేయించునని
చెప్పబడియున్నదని మల్లినాధుడు "ఇత్థంప్రదక్షిణగతోహుత
భుజ్నృపస్య ధాత్రీంసముద్రరశనాం వశగాంకరోతి" అను వచ
నమునుదాహరించినాడు. కాళిదాసు ప్రదక్షిణశబ్దము నింత
సందర్భశుద్ధగా వాడినాడని సామాన్యుడు గ్రహింపజాలడు.

కామందకనీతిశాస్త్రము, కౌటిలీయార్థశాస్త్రము మల్లినాథున కుకరతలామలకములు. ఈగ్రంథములనుండి యెన్నియో సందర్భములలో నాతడు వచనముల నుదాహరించుచుండును.

రఘువు బారినుండి తమ్ము రక్షించుకొనుటకు సింహదేశస్థులు వైతసవృత్తి నాశ్రయించిరని కాళిదాసు చెప్పినాడు. కౌటిలీయార్థశాస్త్రములో సరిగా బలవంతునిముందు దుర్బలుడు వైతసవృత్తి నవలంబింపవలయునని చెప్పబడియున్నది. వెల్లువవచ్చినపుడు నీటిప్రబ్బలిచెట్టు వంగినదై తన్ను తాను నిలద్రొక్కుకొని ప్రవాహముతగ్గగానే లేచి నిలబడగల్గుచున్నది. అట్లే బలవంతుడు దండెత్తివచ్చినపుడు దుర్బలుడు వంగి యాత్మరక్షణము కావించుకొనవచ్చును. కాళిదాసు వేతసోపమమానమును సమర్థించుటకు మల్లినాథుడు కౌటిల్యార్థశాస్త్రములోని వైతసశబ్దఘటితమైన యీక్రింది శ్లోకము నుదాహరించుచున్నాడు.

బలీయసాభియుక్తో దుర్బలస్సర్వత్రాను
ప్రణతో వైతసంధర్మ మాతిష్ఠేత్.

రత్నశాస్త్ర జంతుశాస్త్రాదులలో కూడ మల్లినాథుని పాండితి అగాధమైనది. అది యాతని వ్యాఖ్యానమునకు ఎంతయో మెరుగు తెచ్చినది.

గజకుంభస్థలమున ముత్యము లుండుటను వాఖ్యానించుచు నాతడు ముత్యము లుత్పన్నములగు స్థలముల నన్నిటిని పేర్కొన్నాడు. "కరీంద్రజీమూత వరాహశంఖ

మత్స్యాఽహి శుక్త్యుద్భవ వేణుజాని। ముక్తాఫలాని ప్రథితాని లోకే తేషాంతుశుక్త్యుద్భవమేవ భూరి". విదూర పర్వత సమీప ప్రదేశమున రత్నము లుద్భవములగుననుట కాతడు రత్న శాస్త్రమునుండి శ్లోకము నుదాహరించినాడు. ఏవిషయమై వ్యాఖ్యానింపవలసివచ్చినను దానికిసంబంధించిన శాస్త్రములో కూలంకష ప్రజ్ఞను కనపరచిన యీ మహావిద్వాంసుడు ఒక సంచార గ్రంథాలయముగా వర్ణింపదగినవాడు.

వింధ్యపర్వతవర్ణనములో కాళిదాసు గజ ప్రశంసను తేగా మల్లినాధుడు వింధ్యగిరి గజాకరమగుటను గజాయుర్వేద శ్లోకము నుదాహరించి నిరూపించినాడు. అట్లే 'బిలయోనయః' అనుచోట అశ్వముల బిలోత్పత్తిని అశ్వశాస్త్ర శ్లోకోల్లేఖనముచే నిరూపించినాడు. అది యిది యన నేల? ఏ శాస్త్రమునకు సంబంధించిన యంశము వచ్చినను ఆ శాస్త్రప్రమాణ వచనములతో వ్యాఖ్యానించుట మల్లినాధుని యలవాటు.

ఇట్టి వ్యాఖ్యానములతో కావ్యపట్కము చదివినవారికి భాషాజ్ఞానము, అన్వయశక్తి, రసాస్వాదనసామర్థ్యము, విమర్శపాటవము, బహుశాస్త్రమర్యాదాభిజ్ఞత కల్గెడి వనుటలో నాశ్చర్యమేమి? అట్టి కావ్యపఠనపద్ధతి క్షీణించుటవలన సంస్కృత విద్యలకు గల్గు లోటింతింతని వర్ణింప శక్యముకాదు. వ్యాఖ్యానాపేక్ష లేక నేటి ఆధునిక పాఠశాలలలోను, కళాశాలలలోను కావ్యములు బోధింపబడుటయు, పఠింపబడుటయు చూచుచున్నాము. దాని ఫలితము కూడ జూచుచున్నాము. భాషాజ్ఞానముకాని, సాంస్కృతిక సంస్కృతికాని

యట్టివారి కేమియు కల్గుటలేదు. మల్లినాథుని వ్యాఖ్యలతో కావ్యములను పఠించుటవలన ప్రాచ్యులకు గల్గుచుండిన బహు విషయక నిశిత పరిజ్ఞానమును స్మరింతుమేని వారలవరచు కొన్నది 'సాహిత్య' శబ్దముచే నేలవ్యవహరింపబడు చుండెనో తెలియగలదు.

---

# ౮. నేటి సైన్సునకు అందని విజ్ఞానము.

## ఆధునికుల ప్రత్యక్షానుభవము.

వేదము జ్ఞాన విజ్ఞానములకు మూలము; అది యనాది, యపౌరుషేయము.

ఆధునికయుగమున పాశ్చాత్యులు కాని పాశ్చాత్య విజ్ఞానము నార్జించిన విఖ్యాత భారతీయ విమర్శకులు కాని వేదము యొక్క ఘనత నితరవిధములుగా నంగీకరించినను దాని యనాదిత్వమును, అపౌరుషేయత్వమును అంగీకరించుటకు సంకోచించుచుండిరి. ప్రాచీన భారతీయవిజ్ఞానముపట్ల నూతన దృక్పథమును వహించి నవయుగములోని యితర విద్వాంసులందరికంటె విభిన్నమైనపద్ధతిలో వేదమునర్థముచేసి కొన్నవ్యక్తి శ్రీ అరవిందయోగి. పాశ్చాత్యులకు కాని, పాశ్చాత్య విద్యావాసితులైన భారతీయులకుగాని యెవ్వరికిని లేనంత గౌరవ మీయనకు వేదముమీద కలదు. విశేషమే

మన: మిగిలిన భారతీయ పరిశోధకులందరికంటె నీయనయే హెచ్చుగా పాశ్చాత్య విద్యాసంస్కృతులు గల్గినవారు. 22 సంవత్సరముల వయస్సువరకును చాలభాగమీయన ఇంగ్లండు లోనే యుండెను. విద్యయంతయు నచ్చటనేసాగెను. తండ్రి పాశ్చాత్యసంప్రదాయములలో మునిగి తేలినవాడు. అట్టి స్థితిలో శ్రీ అరవిందకు భారతీయ సంస్కృతి యందంత భక్తి గల్గుట యాశ్చర్యము.

వేదమంత్రముల గురించి శ్రీ అరవిందయోగి యిట్లు చెప్పియున్నారు.

"వేదమంత్రములు మానవబుద్ధితో నాలోచించి రచింపబడినవికావు. సత్యము ఋషుల హృదయమునుండి బయల్వెడలినది. అంతర్జ్యోతియే (Intuition) వేదము నావిష్కరించినది; ఆలోచనకాని బుద్ధికాని యగావిష్కరింపలేదు. ఆతరువాతి కాలమువారు బుద్ధితో నాలోచించి గ్రంథములను రచించిరి. కావున వీరి యే గ్రంథమునుకూడ వేదమువలె దోషరహితమును, నిర్మల సత్యబోధకమునుకాదు. వేదసంహితల లోని విషయముకంటె ఉపనిషత్తులలోని విషయములు గభీరతరములని పాశ్చాత్యులు చెప్పినది సరికాదు. మంత్రభాగమునకు తర్వాతనే బ్రాహ్మణోపనిషత్తులకు స్థానమునీయవలయును. ఋషులు వేదరచయితలుకారు; మంత్రద్రష్టలు. వేదమపౌరుషేయము (On the Vedas అను గ్రంథములో 11, 12, 13 పుటలు, మరియు Essays on the Gita, 12 మున్నగు ననేక

స్థలములలోకూడ శ్రీఅరవింద యీభావములను వెల్లడించి యున్నారు.)

ప్రయోగము, పంచేంద్రియ జ్ఞానముతో పరిశీలనము అనుమానము-అనువానివలన బయలుదేరిన సైన్సుకును, అంతర్జ్యోతినుండి యావిష్కారమును పొందిన వేదమునకును గల భేదమును గురించి వేఱుగ చెప్పనక్కఱలేదు.

భారతీయ విజ్ఞానమునకు మూలమైన వేదము అతీంద్రియాపౌరుషేయ జ్ఞానవిజ్ఞానభరితమైనదగుటచే నిటీవలికాలమున బయలుదేరిన విజ్ఞానమంతయువానికి తక్కువదేయనునది ముఖ్యవిషయము. వేదకాలమునాటికి విజ్ఞానము శైశవావస్థలోనుండెననియు, క్రమముగా విజ్ఞానాభివృద్ధి యాయెననియు పాశ్చాత్యులు మనకు బోధించిరి. మనవిద్యాధికులు కూడ ననేకులీబోధల ననుసరించియే గ్రంథములను రచించిరి. విజ్ఞానము యొక్క ప్రారంభావస్థయు, పరమావస్థయుకూడ వేదముల లోనే యున్నదని గ్రహించుట భారతీయపద్ధతి. కడచిన నూరు సంవత్సరములలోను భారతీయనాగరకతను విజ్ఞానమును చరిత్రనుగురించి రచించిన ఆధునిక విజ్ఞానవంతులైన ప్రసిద్ధ రచయితలందరు ఇంచుమించుగ పాశ్చాత్యులు మనకు బోధించిన కాలపరియుక్తమైన క్రమవికాసమునందే విశ్వాసము గల్గి యుండిరి. ఇటీవల కొందరు స్వతంత్రాలోచనశక్తి గల భారతీయరచయితలు పాశ్చాత్యులుచూపిన దారినే నడువక వేదముయొక్క మహాత్మ్యమును గ్రహింపగల్గిరి. అట్టివారిలో

శ్రీ రాధాకుముదముఖర్జీ యొకరు. వీరి యీక్రింది వాక్యములు గమనింపదగినవి. "విజ్ఞానముయొక్క ఆదినేకాక పరమావధిని కూడ ఋగ్వేదము ప్రదర్శించుచున్నది. భారతీయుల విచారణ శక్తియొక్క సర్వోన్నతస్థితి ఋగ్వేదములో కన్పట్టుచున్నది" (Indian P. E. N March 1942)

## జ్యోతిషము.

నేటి సైన్సువలన తెలియని దైవగతులు జ్యోతిషాది శాస్త్రములవలన తెలియుచున్నవి.

భారతీయ జ్యోతిషశాస్త్రము యొక్క మహత్త్వమును ప్రత్యక్షముగా ననుభవించినవారుకూడ జ్యోతిషము నమ్ముట ఆధునికతకు భంగకరమని భావించుట చిత్రము. వ్యక్తుల జీవితములోను, దేశముయొక్క చరిత్రలోను రాగల సంఘటనముల నెన్నిటినో మన జ్యోతిషికులు ముందుగా చెప్పగలుగుచుండుటచే ఆధునిక యుగమున జ్యోతిషమునకు తావులేదనుట అర్థరహితము.

15-1-1934 వ తేదీని భారతదేశమున పలుతావులలో భూకంపము వచ్చెను. అది బీహారు రాష్ట్రములో మరింత విపత్కరముగా సంభవించెను. అంతకుపూర్వమే ప్రచురింపబడిన ఆసంవత్సరపు కాశీహిందూవిశ్వవిద్యాలయ పంచాంగములో ఆనాడు భూకంపము వచ్చునని వ్రాయబడియుండెను. ఇంతకంటె ఆశ్చర్యమేముండును?

బ్రిటిషురాజ్య కాలములో "నందనందన యోర్మధ్యే హూణరాజ్యం వినశ్యతి" అను శ్లోక భాగము పలువురి నోట నుండెను. "ఆనందనందన సంవత్సరముల మధ్యకాలములో భారత దేశములో హూణరాజ్యము నశించు"నని దీనియర్థము. ఇది యెంతవఱకు యథార్థమగునో చూడవలయునని చాల మంది స్వరాజ్యోదయము కొఱకెదురు చూచుచుండిరి. కాని స్వరాజ్యము వచ్చిన తర్వాత నీజ్యోతిషము యొక్క సత్యాసత్యములపై విచారణము తగినంతగా జరిగినట్లు కన్పట్టదు. ఆశ్లోకముయొక్క పూర్తిపాఠమిది:—

త్ర్యశీతి షష్టివర్షాణి కల్యాదిగతవత్సరాః
నందనందన యోర్మధ్యే హూణరాజ్యం వినశ్యతి.

ఇది బహుళవ్యాప్తిలోనుండిన యొక పురాణశ్లోకము. దీనియర్థము "కలియుగారంభమునుండి త్ర్యశీతిషష్టివర్షములు అనగా (83 × 60=) 4980 సంవత్సరములు గడచిన తర్వాత వచ్చు నందనందన సంవత్సరముల మధ్యకాలములో హూణరాజ్యము పోవును." అని.

కలియుగారంభము ప్రమాది సంవత్సరములో జరిగెను. షష్టివర్ష చక్రము 83 పర్యాయములు తిరుగునప్పటికి, అనగా 4980 సంవత్సరములకు, ప్రమాది సంవత్సరము వచ్చినది. అపిమ్మట 35 సంవత్సరములకు ఆనంద సంవత్సరము వచ్చినది, అది కలియుగాదినుండి (4980+34=) 5014 వ సంవత్సరము. ఆనాటినుండి 38 సంవత్సరములకు నందనసంవత్సరము రా

నుండెను. అదిరాకపూర్వమే హూణరాజ్యము పోవునని పైశ్లోకము చెప్పుచున్నది. సరిగా ఆసంవత్సరములననుసరించే హూణరాజ్యము భారతదేశములో నశించినది.

భారతదేశమునకు అధినివేశ ప్రతిపత్తి వచ్చిన 1947 వ సంవత్సరము కలిశకములో 5048 వ సంవత్సరము. బ్రిటిషువారి ఆధిపత్యమును సంపూర్ణముగా తుదముట్టించిన గణతంత్ర (Republic) రాజ్యావతరణము జరిగిన 1950వ సంవత్సరము కలిశకము 5051 వ సంవత్సరము. అది సరిగా నందన సంవత్సరమునకు పూర్వసంవత్సరము. ఈ "జ్యోతిష" మింత యద్భుతముగా ఫలించినది.

పురాణములలో కలియుగమును గురించి. యిట్టిట్లు జరుగునని గావింపబడిన వర్ణనములను చూతిమేని యవి యెంత యద్భుతముగా నేటిపరిస్థితులకు సరిపోవుచున్నవో మనకాశ్చర్యమునైచెను. అట్టివానినేరి ప్రత్యేకముగా నొకగ్రంథమును రచింపవచ్చును.

భారతీయ జ్యోతిషశాస్త్రమును బట్టి మానవజీవిత చరిత్రాంశముల నెంతచక్కగా తెలిసికొనవచ్చునో యనేకులకు స్వీయానుభవమునుబట్టి తెలిసియేయుండును. అయినను తమకు జ్యోతిషములో నమ్మకము లేదనువారెందరో కలరు. వారికి జ్యోతిషమును తప్పుగా చెప్పినవారు లభించియుండవచ్చును.

విశ్వసనీయవచస్కులై యావద్భారత విఖ్యాతిగల ప్రముఖులు శతసంఖ్యాకులు వెల్లడించిన స్వీయానుభవమును బట్టి

శాస్త్రమహిమను తెలిసికొనవచ్చును. అట్టి యిద్దరుప్రసిద్ధ పురుషుల వచనముల నిట నుల్లేఖించుచున్నాను.

"జ్యోతిషికులు నాజీవితములో నెప్పుడేమి జరుగునని చెప్పిరో అవి యన్నియు నట్లేజరిగెను." (పండిత మదనమోహనమాలవీయ, జ్యోతిషమహాసభలో, 1936)

"నేను పుట్టినపుడొక జ్యోతిషికుడు నాతండ్రి ఒకసంవత్సరములో చనిపోవునని చెప్పెను. అట్లేజరిగెను. (ఎం, ఆర్. జయకర్, (The story of my life P. 1)

భూతభవిష్యద్వర్తమానములను తెలుపువిద్యలు మన దేశమున ననేకములు గలవు

స్వీయానుభవము నొకదానిని నేనిట చెప్పవలసియున్నది. ఒక వేసవిలో నేను మాయింటి కీశాన్యభాగమున బావి త్రవ్వించుచు ఆపని పూర్తికాకుండగానే 200 మైళ్ళ దూరమునగల యొకయూరికి వెళ్ళవలసివచ్చెను. ఆయూరిలో నొక గుప్తవిద్యానిపుణుడు నన్ను చూచి "మీరు నుయ్యి త్రవ్వించుచు అది పూర్తికాకుండ నీయూరికి వచ్చినారు" అని చెప్పెను. నేనాశ్చర్యచకితుడనైతిని. ఏశాస్త్రమువలననాయన ఇది చెప్పగల్గెనను అది యాధునికులు నేడు అంగీకరించిన సైన్సుమాత్రముకాదు.

"నాడీజాతకముల మహిమ వర్ణనాతీతము. తలిదండ్రుల పేర్లుకూడ నాడీజాతకముల లో తెలుపబడియుండును.

ఇంకను ఇతరవివరములుకూడ నాశ్చర్యముగా తెలుపబడును. ప్రస్తుతరచయిత తన జాతకవిషయమునను, అయిదారుగురు మిత్రులజాతకవిషయమునను నట్టి యద్భుతములను స్వాయముగా తెలిసికొనెను.

నాడీజాతకములలో భూతము సరిగానే యుండుననియు, భవిష్యత్తుతప్పిపోవుచుండుననియు కొందరాక్షేపించుచుందురు. శాస్త్రమహిమను చాటుటకు భూ త ము సరిగానున్నచో చాలదా? ఆవ్రాసిననాటికి ఈభూతముకూడ భవిష్యత్తేకదా? భవిష్యత్తులోనొకయవధివఱకును సరిగానుండి యాపిమ్మటతప్పుటలో కారణమేమైయుండును? భూ త వి ష య ము చెప్పినపుడే యొకనికివిశ్వాసమేర్పడును గానిభవిష్యద్విషయము చెప్పినప్పుడేర్పడదు. కొన్ని నాడీగ్రంథములలో నీనాస్తికకాలమున ప్రజల కాస్తిక్యము గల్గించుట కీజాతకములు రచింపబడినవని చెప్పబడియున్నది. ఆరచనలవలన మనము పొందగల్గినంత లాభమును పొందవచ్చును. నాడీజాతకములో చెప్పబడినది మొదటినుండి చివఱివఱకు మనవిషయమే యనుకొనుటకు వీలు లేదు. అనేకుల జాతకములు చాలకాలము ఒకేరీతిగానుండి అప్పటినుండి భే ది ం చు ట కు ప్రారంభింపవచ్చును. కావున భూతములో అన్నియు సరిగానేయున్నను భవిష్యత్తులో ఆజాతకము మనకుకాకమఱొకనికన్వయింప వచ్చును.

కొన్ని నాడీజాతకములలో జాతకుడాజాతకమును చూపించుకొను దినముకూడ ముందుగానే వ్రాయబడియుండును. ఇట్టి జ్యోతిష మితరదేశములలో లేదు.

## సాముద్రిక శాస్త్రము

ఇటీవలికాలమున సాముద్రికశాస్త్రములో నింతవాడు లేడని ప్రపంచవిఖ్యాతిగన్నవాడు కీరో (Cheiro ను షీరోగా ఉచ్చరింపరాదనియు క్వీరోగా నుచ్చరింపవలయుననియు నాతని గ్రంథములలోనే సూచన యీయబడియున్నది). ప్రపంచము లోని యన్ని దేశములవారును భారతదేశమునుండియే సాము ద్రికమును నేర్చుకొన్నారని యాతడు వ్రాసియున్నాడు. ఆతడు తెలిపిన యీక్రింది యభిప్రాయములు భారతీయవిజ్ఞాన మును వేనోళ్ళ చాటుచున్నవి.

"సాముద్రికశాస్త్రముయొక్క ఆది మనకు తెలియ వలయునన్నచో ప్రపంచచరిత్ర ప్రారంభములో హిందూ జాతి సంపాదించుకొన్న విజ్ఞానమును తిలకింపవలయును. అది చారిత్రకులకు అందెడికాలముకాదు. అయినను ఆనాటి హిం దువుల విజ్ఞానముతో పోల్చుచో మనము విజ్ఞానవిషయమున మరుగుజ్జులమని చెప్పవలయును. నేను భారతదేశములో తిరి గిన దినములలో అతిప్రాచీనమైన యొక విచిత్రగ్రంథమును చూచితిని. అది హిందువుల ప్రాచీనభాషలో రచింపబడినది. ఆగ్రంథములో కొన్నివందల బొమ్మలుకలవు. శరీరములో నెక్కడ నేగుర్తులున్న నేమి సూచింపబడునో వివరముగా నాగ్రంథములలో నుండెను. గ్రీసు, రోము, ఇశ్రేలు మున్నగుపేర్లు వినబడుటకు పూర్వమే యీశాస్త్రము భారత

దేశములో విలసిల్లెను. గ్రీసుకు భారతదేశమునుండియే యీ విజ్ఞానము వచ్చెనని ప్రాజ్ఞులు చెప్పుచున్నారు. హిందూ విజ్ఞానము యొక్క ప్రాచీనత నెట్లు వర్ణింపగలము?" (Language of the Hand, Revised and Enlarged, 27 th Edition P, P. 20–22)

"అవయవముల స్వరూపమును, రేఖలనుబట్టి జీవితమును తెలిసికొనువిద్యను హిందువులే యందరికంటె ముందు కనుగొనిరి. వారు దానికి సాముద్రికమని పేరుపెట్టిరి. మొత్తము శరీరముమీదనున్న లక్షణములే హస్తములో రేఖారూపమునను, ఇతరవిధములుగాను ఉండును. ఇంతవరకు ప్రపంచములో విలసిల్లిన ఉత్తమోత్తమ విజ్ఞానము హిందువులదే. విజ్ఞానము పూర్వము మహోన్నతస్థితిలో నుండెనని యంగీకరింపనొల్లని వారొకసంగతిని మరచుచున్నారు. భారతదేశము ప్రాచీన కాలములో ప్రకటించిన జీవితరహస్యములను, తత్త్వరహస్యములను ప్రత్యాఖ్యానముచేయుటకు నేటివారికి శక్తి లేకున్నది: తప్పనిసరిగా ఆవిజ్ఞానమును నేటి వారంగీకరింపవలసి వచ్చుచున్నది. దాని ఘనత యట్టిది. మంగోలియనులు భారతదేశముపై దండయాత్ర చేసినపుడు వారు గుప్తవిద్యలకు సంబంధించిన గ్రంథముల నెన్నింటినో నాశనముచేసిరి. జితులైన భారతీయులు జేతలైన తమకంటె గొప్పవారుగనుండ రాదను భావముతో వారిట్లుచేసిరి" (You and your Palm PP, 14, 15, 16)

"గ్రిహములకు మనుష్యజీవితముపై నెట్టి ప్రభావ మున్నదో హిందువులే కనిపెట్టిరి. ఆవిషయములు నేటికిని సత్యములుగానేయున్నవి. సాముద్రిక శాస్త్రమును హిందువుల నుండి క్రిమముగా చైనావారు, టిబెటనులు, పారశీకులు, ఈజిప్టువాసులు, గ్రీకులు నేర్చుకొనిరి. గొప్ప గొప్ప వేదాంతులుకూడ నీశాస్త్రమును గౌరవించి యధ్యయనము చేసిరి. ఎనెగ్జో గోరస్ దీనిని క్రీ॥పూ॥ 440 సం. ప్రాంతములో తనశిష్యులకు బోధించెను. హిస్పానస్ అను గ్రీకువిద్వాంసుడు ఈశాస్త్రగ్రింథముయొక్క ప్రతి నొకదానిని సువర్ణాక్షరము లతో వ్రాయించి "ఇది యున్నతమనస్కులును, జిజ్ఞాసువు లును ఆదరింపదగిన శాస్త్రము" అను సందేశముతో అలె గ్జాండరు చక్రవర్తికి పంపెను";

("Cheiro's Foreword, P.P, 19, 20, 21.)

సంఖ్యాశాస్త్రవిషయములో కూడ గురుపీఠము భారత దేశముదేయని కీరో వ్రాసియున్నాడు.

"నేను ప్రాగ్దేశసంచారము చేసినపుడు ఒకానొక శాఖకు చెందిన బ్రాహ్మణులవద్ద గుప్తవిద్యాగ్రంథములను చూచితిని. నేను వారివలన అనేకవిషయములను నేర్చుకొంటిని. సంఖ్యా శాస్త్రమునకు సంబంధించిన యంశములనుకూడ నేర్చుకొంటిని. సంఖ్యలయొక్క ప్రాముఖ్యమును, అంతరార్థమును వానికి మానవజీవితముపై గల ప్రిభావమును, సంబంధమును నేను వారివలన గ్రహించితిని. తరువాత ఈసిద్ధాంతములను నేను

ఉపయోగించితిని. అవి యన్నియు సరియైనవే యని నాయను భవమువలన తెలిసికొంటిని. ప్రాచీనహిందువులు అట్టి విద్య లలో నిష్ణాతులుగా నుండిరి.

(Book of Numbers. P. P. 10, 11)

కీరో గొప్పతనమును గుర్తించినవారుకూడ ఆతడు గురుపదములో నుంచుకొని గౌరవించిన భారతీయశాస్త్ర కారులనేల గుర్తింపకున్నారో తెలియకున్నది.

మన శకునశాస్త్రముగురించిన యాధునికానుభవమును కూడ నొకదాని నుదాహరింపవలసియున్నది. ఒకరిద్దరి యను భవముకంటె వేలకొలదిమంది యనుభవము నుదాహరించుట మేలు. నిమిత్తశాస్త్రములో ధూమకేతువు మహావిపత్తును సూచించునని యున్నది. శ్రీ రమణమహర్షి 14–4–1950 వ తేదీరాత్రి 8–47 గంటలకు తిరువణ్ణామలై ఆశ్రమములో విదేహముక్తినిపొందిరి. అది యాధ్యాత్మికసాధకులకువిపత్తుఅనుట నిస్సందేహము. సరిగా అదేసమయమున తిరువణ్ణామలైలో తోకచుక్క కన్పట్టెను. (The Hindu dated 14–4–1950) "మద్రాసు నగరమునకూడ నాసమయమున తోకచుక్క కన్పట్టె" నని హిందూసంపాదకులు ప్రత్యేకముగా నావార్త క్రింద వ్రాసిరి. ఇట్టి ఘనసాక్ష్యములు శకునశాస్త్రసత్యత్వము అనుభవగోచరమని తెలుపుచుండగా నీశాస్త్రములు మూఢ విశ్వాసముల సంపుటమని వర్ణించుట యెంత పొరపాటో వేరుగ చెప్పనక్కరలేదు.

## మంత్ర విద్య

ఇష్టసాధకమైన మంత్రానుష్ఠానపద్ధతి యీ దేశమున పారంపర్యముగా వచ్చుచున్నది. మంత్రముల మహిమ నంగీకరించుట యాధునికతకు లోపమనుకొనువారు కొందరున్నారు. కాని వీరికీ యాధునికత నొసగిన పాశ్చాత్యులే మంత్రి మహిమ నంగీకరింపవలసి వచ్చినది.

పాముల నరసయ్యగారను మాంత్రికుడు రైల్వేఉద్యోగిగా నుండెను. పాముకాటువలన చావనున్నవానికి ఆయన మంత్రము వేయుటయు వాడు బ్రతుకుటయు కొన్నివందలసందర్భములలో జరిగెను. దూరముగా నున్నవారు టెలిఫోనులో పాముకాటు విషయమును నరసయ్యగారికి చెప్పుటయు, ఆయన దూరమునుండియే మంత్రము వేయుటయు పాము కఱచిన వాడు బ్రతుకుటయు జరుగుచుండెను. ఆయన మంత్రమువలన లోకమున కింత మహోపకారము జరుగుటను గుర్తించి రైల్వేవారు సర్పదంశనవార్తను తెలుపుటకును తిరిగి నరసయ్యగారు సర్పదష్టుని బంధువులకు తన సందేశము పంపుటకును రైల్వే టెలిఫోనును ఉపయోగించుకొను అవకాశమును కల్గించుచుండిరి. ఆదినములలో రైల్వేకంపెనీ యూరపియనుల చేతిలోనుండెను. ఈ సందర్భమున ఆయూరపియనులుకూడ మంత్రమహిమను అంగీకరించుటకు కావలసిన ప్రస్ఫుట సాక్ష్యము పుష్కలముగా నుండెను. మన యాధునికు లేపాశ్చాత్యులనుండి

యీయాధునిక నాగరకతను నేర్చుకొనిరో యీపాశ్చాత్యులకే మంత్రమహిమ విషయమున సందేహము పోవుటయు వీరికింకను నిలచియుండుటయు ఆశ్చర్యము!

భారత రాజధానియైన ఢిల్లీలో నిటీవల పలువురకు ప్రత్యక్షానుభవము లోనికి వచ్చిన యొక మంత్రమహిమ వృత్తాంతమును 17–1–56 నాటి హిందూపత్రికనుండి యిచట నుల్లేఖించుచున్నాను: "కామెర్లకు (జాన్‌డిస్) చికిత్సయే లేదని యొకమూల డాక్టర్లు చెప్పుచుండగా 62 సంవత్సరముల వయస్సుగల యొక దాక్షిణాత్యస్త్రీ, అనంతలక్ష్మి యను నామె మంత్రమువలన ఢిల్లీలోని కరల్‌బాగ్‌లో కామెర్లవ్యాధిని కుదుర్చుచున్నది. ఆమె వితంతువు. విఘ్నేశ్వరుని పూజించుచు మంత్రమును పఠించును. ఒక కొబ్బరికాయ, రెండుసూదులు, రెండుపాత్రలు మాత్రమే యీమెకు పూజలో కావలసి వచ్చును. ఆమె చికిత్సవలన రోగము పోగొట్టుకొన్న వారిలో ఉన్నత ప్రభుత్వోద్యోగులుకూడ కొందరు కలరు."

ఇట్టి మంత్రవిద్య భారత దేశముయొక్క పెన్నిధానము లలో నొకటి.

12–7–1959 తేదీని శ్రీరంగములోని రంగనాథ స్వామికి మహాసంప్రోక్షణము జరిగెను. ఈసందర్భమున 13–7–1959 నాటి హిందూపత్రిక తనకు శ్రీరంగమునుండి 12–7–1959 తేదీని స్వకీయ విలేఖకుని నుండివచ్చిన వార్తను విపులముగ ప్రచురించినది. అందలి ముఖ్యవాక్యము నిట

నుల్లేఖింపవలసియున్నది. "పాంచరాత్రాగమములో విద్వాంసులైన ప్రధానాచార్యులు శ్రీరాఘవభట్టు స్వర్ణవిమానము మీద ఉదయము 8-30 గంటలకు మహా సంప్రోక్షణము చేయుచుండగా రెండు గరుడపక్షులు విమానమునకు తిన్నగా నెత్తిమీద గిరున తిరుగుచు ఎగిరినవి." విష్ణ్వాలయసంబంధమైన సంప్రోక్షణము జరుగుచుండగా నటకు గరుడపక్షు లాకర్షింపబడుటలోని రహస్యము మానవబుద్ధికి అందునదికాదు. మంత్రతంత్రముల ప్రభావము సామాన్యబుద్ధి కతీతమైనది విష్ణుసంబంధమైన కొన్నిమంత్రముల యనుష్ఠానముయొక్క సౌష్ఠవము గరుడపక్షి యచట కాకర్షింపబడుటవలన నిరూపితమగునని మంత్రశాస్త్రగ్రంథములలో చెప్పబడియున్నది.

సభక్తిపఠనమువల్ల ఫలము నొసగగల శక్తి రామాయణాది పవిత్రగ్రంథములకు కలదు. రోగనివారణము, ధనప్రాప్తి మున్నగు ఇష్టార్థసిద్ధి పవిత్రగ్రంథపారాయణమువలన గల్గును. మహాత్మాగాంధి తాను స్వయముగా నెఱిగిన యొక విషయము నిట్లు వెల్లడించియున్నారు. "మాగృహములో లోధామహారాజ్ అను బ్రాహ్మణుడు రామాయణము పఠించుచుండెను. ఆయనకుకుష్ఠవ్యాధి వచ్చెను. నియతముగా రామాయణము పారాయణముచేయుచో ఆవ్యాధి కుదురునని యాయన నమ్ముచుండెను, తుదకట్లే యావ్యాధి కుదిరెను."

(Mahatma: Vol. II P. 48)

1958వ సంవత్సరములో వర్షములేనందున నేపాల్ ప్రభుత్వము వరుణజపము చేయించెను. జపము ముగిసిన మరు నాడే దండిగా వర్షము కురిసెను. దినపత్రికలన్నింటిలోను ఈ వార్త ప్రచురింపబడెను. (1–6–1958 నాటి కల్పవల్లిలో మరి కొన్ని విశేషములుకూడ ప్రకటింపబడినవి.)

మంత్రముల యుచ్చారణమునకును భౌతికసంఘటన ములకును ఎట్లు సంబంధముండునో మనకు తెలియకపో వచ్చును; కాని సంబంధమున్నదని స్పష్టముగా నిరూపితమగు చున్నది. పత్రికలద్వారా యిట్టిసంఘటన వార్తలు ప్రపంచ మున వ్యాపించుచున్నవి; అంతియేకాకస్వయముగా నాసంఘ టనస్థలములకేగి యథార్థ్యమును తెలిసికొను అవకాశముకూడ నున్న యీకాలములో మంత్రములశక్తిని తెలిసికొను ప్రయ త్నముచేయక మంత్రములను నమ్మమనిచెప్పి వైచుట విజ్ఞాన నిరతుల లక్షణముకాదు.

## యోగశాస్త్రమునకు ఆధునికులజోహార్లు

మిగిలిన విషయములలో భారతీయవిజ్ఞానమహిమను గ్రహింపజాలని పాశ్చాత్యులుకూడ యోగశాస్త్రము భార తీయుల మహోన్నతనాగరికతావిజ్ఞానములకు నిదర్శకమని భావించియున్నారు.

సంస్కృతసాహిత్యమును మథించి బహువిధముల భారతీయవిజ్ఞానమును మెచ్చుకొన్న హెచ్. హెచ్. విల్సన్

19వ శతాబ్ది మధ్యభాగములో భారతదేశమునకు వచ్చినాడు. ఒక యోగి గాలిలో వంటుకొని యుండుట నాతను స్వయముగా గాంచి "హిందుస్థాను మోసములు" అను గ్రంథములో తన యాశ్చర్యమును వెల్లడించియున్నాడు.

ఈ కాలములో నాడీహృదయ స్పందనముల నాపు చేయువారు, భూమిలో ననేకదినములుండి క్షేమముగా బయటకు వచ్చువారు ఎందరో భారతదేశములో నున్నారు. దేశీయ ప్రాదేశిక ప్రభుత్వాధినేతలు కూడ నట్టి ప్రదర్శనములనుచూచి యచ్చెరువొందుచున్నవారిలో కలరు. ప్రస్తుత రచయితయు నట్టిప్రదర్శనము నొకదానిని చూచెను. సైన్సు ననుసరించి యసంభవములైన యీపనులను యోగశాస్త్రము చేయింపగల్గుచున్నది.

ప్యారిస్ నగరమునకు చెందిన డాక్టర్ తెరెసేబ్రాసీ యను మహిళామణి, మరికొందరితో కలసి 1936వ సంవత్సరములో భారతదేశమునకువచ్చి మైసూరు పట్టణమున కేగి యట జగన్మోహన భవనములోని యోగశాలలో శ్రీ. టి. కృష్ణమాచార్యయను యోగీంద్రుని యోగప్రదర్శనములను చూచెను. విద్యుద్యంత్రముల సహాయముతో నామె యా ప్రదర్శన సమయములలో యోగీంద్రుని బహువిధముల పరీక్షించెను. యోగశాలాదర్శక గ్రంథములో ఆ పాశ్చాత్య వనిత యిట్లు వ్రాసెను. "సంకల్పశక్తి శ్వాసకోశముమీదను, రక్త ప్రసారముమీదను ఎట్టి ప్రభావమును గల్గియున్నదో

సున్నితములైన పనిముట్లతో కనుగొనుటకు మేము ఇక్కడకు వచ్చితిమి. శ్రీ కృష్ణమాచార్య మా పరిశోధనలకు లోనగుటయే కాక మమ్ములను సంపూర్ణముగా తృప్తిపరచినారు. హృదయములోని స్థూల సూక్ష్మసంచలనములను ఇచ్ఛానుసారము ఆపివేయవచ్చుననియు మార్చవచ్చుననియు అసందిగ్ధముగా ఆయన నిరూపించినారు. యోగ పరిస్థితిని గురించి మేమనుకొన్నదానికంటె లోతైన విమర్శకు పునాదులనుగూడ వేసికొనగల్గితిమి. పాశ్చాత్యులు దేని నసంభవమని తలచుచుండిరో దాని నీయోగి చేయగల్గెను."

యోగవిద్యారహస్యముల నన్వేషించుటకుగాను అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయములో మానసిక శాస్త్రాచార్యుడైన డాక్టర్ ఎం. ఏ. వెన్‌జర్, మరియు మిచిగడ్ విశ్వవిద్యాలయములో ఆచార్యుడైన డాక్టర్ బసు కేబగ్బీ అను సైన్‌టిస్టులిద్దరు 1957వ సంవత్సరములో భారతదేశమునకు వచ్చిరి. వీరు 6 మాసములు సెలవుతీసికొని ప్రత్యేకముగా ఇందుకొఱకు భారతదేశమునకు వచ్చిరి. వీరి యోగవిద్యా పరిశోధనోద్యమమునకు ఇణ్డియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చివారు, రాక్ఫెల్లర్ సంస్థ, రాక్‌హాంసంస్థ మరియు వాషింగ్‌టణ్ యూనివర్సిటీ— అను ఉన్నతసంస్థలు ఆమోద సహకారముల నొసగినవి. వీరు బొంబాయి, కాన్పూరు మున్నగు స్థలములలో యోగులను కొందరిని దర్శించి తమ పరిశోధనలకు లోబడవలసినదని కోరగా

నాయోగులు నిరాకరించిరి. అదివఱకు మైసూరులోనుండి యిపుడు మదాసు వివేకానంద కాలేజిలో యోగవిద్యా చార్యుడుగా నున్న శ్రీ టి. కృష్ణమాచార్యులు గారు సంతోషముతో నంగీకరించినందున వీరు ఆయనమీద అన్వేషణ ప్రయోగములను కావించిరి.

వివేకానంద కాలేజి సైన్సులేబరేటరీలో నాల్గుదినము లీప్రయోగము సాగెను. 1957 ఏప్రిల్ నెల పూర్వార్ధములో నీప్రయోగములు సాగినవి. అవి నగరమునందంతటను సంచలనమును గల్గించినవి. సూక్ష్మాతి సూక్ష్మములైన వైద్యుత భావ గ్రాహక యంత్రపరికరములను వారు తీసికొనివచ్చిరి. (Electronic apparatus of high sensibility) ఆంతరము లైన ఉచ్ఛ్వాసనిశ్వాసాది సంచలనములను ఆయంత్రములు కనిపెట్టగలవు. ఆసనములు, ప్రాణాయామము మాత్రమే కాక గుండెను ఆపుచేయుట, ప్రాణప్రసారమును నిలుపుట, ధ్యానము, సమాధి—మున్నగు అసాధారణ యోగపరిస్థితు లను కూడ వారు పరిశీలించిరి.

శ్రీకృష్ణమాచార్యమీద గావింపబడిన ప్రయోగ ములు తమకు సంపూర్ణముగా తృప్తిని గల్గించినవని యా సైంటిస్టులు ప్రకటించిరి. యోగవిద్యారహస్యముల నింకను కనిపెట్టుటకు తాము పరిశోధనలను సాగించుచునే యుండెద మని వారుచెప్పిరి. కొన్ని కేంద్రములలో నిట్టి పరిశోధనలను

సాగించుచుండుటకు భారతదేశములోని తమసహచరులనుకోరి వారు స్వదేశమునకు వెడలుచు తాము తిరిగివచ్చెదమని చెప్పిరి.

ఇట్లు ఆధునిక సైంటిస్టులకుకూడ తెలియని రహస్యములను వెల్లడించుచు వారి జోహారులందుకొన్న విద్యలు భారత దేశములోనే కలవు.

పశ్చిమజర్మనీలోని హాంబర్గ్‌నుండి వచ్చిన ముగ్గురు శ్రీరామానందయోగిని తాడేపల్లిగూడెము దగ్గరనున్న అలంపురము అను పల్లెటూరులో కలిసికొని ఆయన యోగవిద్యాకౌశలప్రదర్శనములను ఫిలిం తీసినారు. ఆఫిలిము టెలివిజన్‌లో జర్మనీలో ప్రదర్శింపబడును. ఆసనములు, ప్రాణాయామము, భూగర్భనివాసము మున్నగునవి యిందలి యంశములు. (ఆంధ్రపత్రిక 29-6-59. 4వ పుట) ప్రపంచములో మరి యేజాతికిని లేక కేవలము భారతీయులకు మాత్రమే యున్న యీవిద్యకు పాశ్చాత్యులెంతగా ముగ్ధులైనారో యనుట కిది నిదర్శనము.

దూరదర్శనము, దూరశ్రవణము, మున్నగు అద్భుతములను యోగాభ్యాసమువలన సాధింపవచ్చునని మనగ్రంథములలో చెప్పబడినది. వీనిని ప్రత్యక్షముగా నిరూపించువారు నేడున్నారు.

సంపూర్ణ వికాసము చెందిన మానసికశక్తిని పరతత్త్వముమీదకు ప్రసరింపచేయుచు, ప్రపంచవిముఖులై

పరమాత్మానందము ననుభవించు మహాయోగులు కొందఱు నేటికిని భారత దేశములో నున్నారు.

ఆధ్యాత్మికముగాను, మానసికముగాను మాత్రమే కాక శారీరకముగాకూడ మానవునకు పరమమిత్రమైనది యోగము. తాను ఆరోగ్యముతోను, దార్ఢ్యముతోను ఉండుటకు కారణము చిరకాలమునుండి చేయుచున్న యోగాభ్యాస సాధనములేయని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పియున్నారు.

శ్రీస్వామి వివేకానంద తమ యోగశాస్త్ర వివరణములో యోగముయొక్క సర్వతోముఖ మహిమను వివరించి యున్నారు.

సాధారణముగా ప్రపంచములో పూర్వపువిద్యలు అనాగరకములు, బూటకములు అను నభిప్రాయము సైన్‌టిస్టులకు గలదు. భారత దేశపు పూర్వవిద్యలుకూడ నట్టివేయను నభిప్రాయము కొంతకాలము వారికుండెను. కాని వారు క్రమక్రమముగా తమయభిప్రాయము తప్పని తెలిసికొనిరి. సైన్సు కందని యంశములెన్నియో యోగశాస్త్రమునం దుండుటను వారు ప్రత్యక్షముగ చూచుటచే యోగవిద్యకు జోహారు చేయవలసి వచ్చెను. ఇటీవల బహుదేశములు యోగవిద్యను భారత దేశమునుండి నేర్చుకొన గోరుచున్నవి. సోవియట్ దేశములలోకూడ నట్టి యుత్సాహము కలదు. ఉజ్బెక్ రాజ్యములో నట్టి పరియత్నము జరుగుచున్నదని యా దేశపు సం

సంస్కృతిక శాఖామంత్రి 1954లో నీ దేశమునకు వచ్చినప్పుడు చెప్పియుండెను.

స్కాండినేవియాలో యోగశాస్త్రముపట్ల శ్రద్ధాసక్తులు పెరుగుచున్నవి. ఇటీవల యోగగ్రంథములు అచటి మిక్కుటముగా అమ్ముడగుచున్నవి.

శరీరమునకును, మనస్సునకును, ఆత్మకును అపారశక్తుల నొసగగల యోగము బహువిద్యా పరిజ్ఞానమునకు సాధనమగుటచే నది కేవల మొక విద్యగామాత్రమే పరిగణింపదగినది కాదు. అనేకవిద్యలు యోగదృష్టిచే కనుగొనబడినవి: కర్మకును, ఉపాసనమునకును, జ్ఞానమునకు గూడ యోగము సహాయముగా చెప్పబడినది. యోగప్రాప్యమైన ఆత్మానుసంధానము అనిర్వచనీయానంద ప్రాపకముగా నంగీకరింపబడియున్నది. భారతీయ విద్యల కన్నింటికివలెనే యోగవిద్యకును పరమేశ్వరప్రాప్తియే పరమలక్ష్యము.

## ఉపసంహారము.

ఒక విజ్ఞానాంశమును కనిపెట్టినవానికిని, ఆవిజ్ఞానాంశము నుపయోగించుకొని లాభము పొందువారికిని వైజ్ఞానిక సంపదలో హస్తిమశకాంతరము వ్యత్యాసముండవచ్చును. ఉపయోగించుకొనువాడది కనిపెట్టబడిన పద్ధతి నెఱుగక పోవచ్చును. మఱియు నాయంశమువలన లాభమెట్లు కల్గుచున్నదో యెఱుగకపోవచ్చును. కాని యాలాభమును పొందవచ్చును. స్విచ్ వేసికొని విద్యుద్దీపము వెలుగులో తన కార్య

ములను నిర్వర్తించుకొను సామాన్యుని "ఈవిద్యుచ్ఛక్తి ఎట్లు పుట్టినది? దీనివలన దీపమెట్లు వెల్గినది?" యని ప్రశ్నింతుమేని వాడేమియు చెప్పజాలడు. అట్లే మంత్రశాస్త్రము, జ్యోతిషశాస్త్రము మున్నగు గుప్తవిద్యలవలన లాభమును పొందువారెల్లరు మంత్రోచ్చారణము వలన ఫలితమెట్లు కల్గుచున్నదో, గ్రహముల స్థితికిని మనుష్యుల జీవితమునకును ఎట్లు సంబంధమేర్పడుచున్నదో మున్నగు నంశములను చెప్పజాలరు. సైన్సు తెలియకపోయినను దీపమువాడుకొనువాని పద్ధతిలోనే వీరును ఉన్నారు. కావున గుడ్డిగా ఉపయోగముపొందుట యనునది సైన్సులకును గుప్తవిద్యలకును సమానముగానే వర్తించును. ఎలెక్ట్రిసిటీకి సంబంధించిన సైన్సు నెఱుగనివారెవ్వరును విద్యుద్దీపమును వాడుకొనరాదనుటయెట్టిదో గుప్తవిద్యల రహస్యము నెఱుగనివారెవ్వరును అంధవిశ్వాసముగా వానిననుసరించి లాభము పొందరాదనుట యట్టిదే యగును. కాని విద్యుద్దీపము వాడుకొనుటలో రాగల ప్రమాదములకు లోనుగాకుండునంత పరిజ్ఞానమును దాని నుపయోగించు వానికుండవలయును. అట్లే మంత్రాది విద్యలలోని ప్రమాదముల పట్ల జాగరూకతతో నుండుటకు కావలసిన విజ్ఞానము వానినుపయోగించుకొనువారికిని ఉండవలయును.

నేటిసైన్సుకు సాధ్యముకాని కార్యములను కొన్నింటిని ప్రాచీన భారతీయ విద్యలు సాధించుచున్నవనునది స్పష్టసత్యము. అయినను కొందరు ప్రాచీనవిజ్ఞానము నేటి సైన్సుకు

సమ్మతమగుచో నంగీకరించెదమని చెప్పుట వింతగా నున్నది. సైన్సుకు తెలియని విషయములను తెలుపువిద్యల యథార్థతను సైన్సు ప్రమాణమునుబట్టి నిర్ణయింపబూనుట యర్థరహితము. సైన్సుకు తెలియని విషయములను తెలుపు భారతీయవిద్యలను కేవలము సైన్సు పదములచే వ్యవహరించుటయు తగదు. అట్లని యీవిద్యలు అన్‌సైన్‌టిఫిక్ అనుటకును వీలులేదు. ఏలన, అన్‌సైంటిఫిక్ అను పదము సైన్సుకంటె తక్కువదైన వానిపట్ల సూచకమైయున్నది. కావున ఈభారతీయ విజ్ఞానము సూపర్ సైంటిఫిక్ (సైన్సుకు అతీతమైనది)గా వర్ణింపదగియున్నది.

ఈ విజ్ఞానముయొక్క మహాత్త్వము కొందరుతలచునట్లు ప్రజల మూఢవిశ్వాసముమీద నాధారపడిలేదు. అపూపమహాత్త్వము ఆస్వాదైకవేద్యమునునట్లు ఈవిద్యల మహాత్త్వము ప్రత్యక్షానుభవగోచరము. అనుభవ గోచరమగు మహిమ సైన్సులకే కాక భారతీయవిద్యలకుకూడ కలదనియు, కొన్ని భారతీయవిద్యలలో నేటిసైన్సుకందని విజ్ఞానము కలదనియు పైరీతిగా స్పష్టమగుచున్నది.

# ౫. భౌతిక శాస్త్రములు

భౌతికశాస్త్రములలో భారతీయులు సాధించిన విజ్ఞాన వైభవమును వర్ణించుటకు ఇంత స్వల్పగ్రంథములో ప్రయత్నముచేయుట న్యాయ్యముకాదు. మఱియు లోతుగాపోయి యొక్కొక్క శాస్త్రమును సవిమర్శముగ సమీక్షించినను అది యాయా శాస్త్రములలో ప్రత్యేక ప్రావీణ్యము గలవారికే గ్రహణయోగ్యముగా నుండును. సామాన్యాకారముగా కొన్ని శాస్త్రముల ప్రశంసనుమాత్ర మిచ్చుట నవకాశముగలదు.

## గణితశాస్త్రము

గణితశాస్త్రమును భారతదేశమే ప్రపంచమునకు ప్రసాదించెను. యూరపునకీవిద్య అరేబియానుండి వెళ్ళెను; అరేబియాకు భారతదేశమునుండి వెళ్లెను. ఇందులకుగల అనేకసాక్ష్యములలో నొకటి అరబిక్ భాషలో గణితశాస్త్రమునకుగల పేరు. ఆభాషలో హిందిసత్ అనుపదమునకు గణితమనియర్థము. 'భారతదేశపువిద్య' యని యీ పదమునకర్థము.

"బీజగణితమును, రేఖాగణితమును మొట్టమొదట కనిపెట్టినవారు హిందువులు. ఈశాస్త్రములను జ్యోతిష శాస్త్రమునకుపయోగించినవారిలోకూడ వారే ప్రథములు"

(Elphinston: India, P. 133)

1 నుండి 9 వఱకు గల యంకెలను, శూన్యాంకమును (జీరో) కూడ ప్రపంచవాసులెల్లరు భారత దేశమునుండియే గ్రహించిరి. అంతియేకాదు. దశాంశపద్ధతికి కూడ భారతీయులే యితర దేశస్థులకు గురువులు.

నేడు ప్రపంచములో బహుదేశములలో విరివిగా వ్యాపించి యున్న 1, 2, 3, 4- మున్నగు అంకెలు ప్రాచీనభారతీయులు, వాడుచుండిన అంకెలనుండియే యేర్పడినవి. ఆయంకెలు క్రమముగా కొంచెము మార్పుచెంది యీ రూపమును చెందినవి. అవి భారతదేశమునుండి అరేబియాకును, అరేబియానుండి యూరపుదేశములకును వ్యాపించుటచే యూరపియనులు వానిని అరబిక్ ఫిగర్స్ అని వ్యవహరింపదొడగిరి. దేవనాగరలిపితోబాటు వాడవలసిన సంఖ్యలను గురించి భారతరాజ్యాంగసభలో చర్చ జరిగినపుడు సభాపతిగానుండిన శ్రీ రాజేంద్రప్రసాద్‌గారు అరబిక్ అంకెలని చెప్పబడునవి యథార్థముగా భారతీయసంఖ్యాచిహ్నములే యని చెప్పినది సంపూర్ణముగా సత్యము.

నేడు యూరపులో ప్రచారములో నున్నయంకెలు, దశాంశపద్ధతి హిందూదేశమునుండి గ్రహింపబడినవి.

(H. H. Wilson: Indian Wisdom P. 124)

"దశాంశవిధానమును సున్నను హిందువులే మొట్టమొదట కనిపెట్టిరి. అక్షరములను కనిపెట్టిన గౌరవముకూడ హిందువులదే." (Schlegel: History of Literature. P. 123)

"అంకగణితముయొక్క యన్ని శాఖలలోను, హిందువులు ఇతరప్రాచీనజాతులన్నింటికంటె బలిష్ఠులుగానుండిరి." (Mrs. Marning: Ancient and Medieval India, Vol I, P. 374)

వర్గమూలమును (Square Root) మొట్టమొదట కనుగొన్నవారు భారతీయులే యని కోల్‌బ్రూక్ మున్నగు బహుదేశచరిత్రకోవిదులు నక్కాణించి యున్నారు. (Colebrooke's Miscellaneous Essays, Vol- II P. 419)

"సైన్సు విషయములోకూడ యూరపు భారతదేశమునకు మిక్కిలి ఋణపడియున్నది. నేడు ప్రపంచమంతయు వాడబడుచున్న అంకెలను భారతీయులే మొదట వాడకములోనికి తెచ్చిరి. ఈ యంకెలమీద నాధారపడి బయలుదేరిన దశాంశపరిగణనమునకు గణితశాస్త్రము మీదనేకాక ప్రపంచనాగరకత మీదనేకల ప్రభావ మింతింతయని చెప్పజాలము. క్రీ॥ శ॥ ఎనిమిదవ శతాబ్దిలోను తొమ్మిదవశతాబ్దిలోను భారతీయులు అంకగణిత బీజగణితములలో ఇతర దేశీయులకు గురువులైరి." Macdonell: History of Sanskrit Literature పేజి 424.)

నిన్న మొన్నటివఱకు పాశ్చాత్య గణితశాస్త్రజ్ఞులకు తెలియని గణితరహస్యము లెన్నియో ప్రాచీన భారతీయులకు తెలియును. పూర్ణవస్తువునుండి దేనిని తీసి వేసినను, పూర్ణమే మిగులును బృహదారణ్యకోపనిషత్తులో బ్రహ్మ

పదార్థ వర్ణనసందర్భమున చెప్పబడినది. పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే, పూర్ణస్యపూర్ణమాదాయ పూర్ణమేవాశిష్యతే. (5-1)

ఆధునికమైన ఉన్నతగణితములో ఇన్ఫినిటీకి (పూర్ణాంకమునకు) ఇట్టి నిర్వచనమే యీయబడియున్నది.

భాస్కరాచార్యులకు నేటి ఉన్నత గణితశాస్త్రములోని డిఫరెన్షియల్ కాల్క్యులస్ సూత్రముయొక్క పరిజ్ఞానముండెనని సర్. ప్రఫుల్ల చంద్రరే వ్రాసియున్నారు. [History of Hindu Chemistry, Vol II, P. P. 159, 160]

వృత్తముయొక్క పరిధి వ్యాసముయొక్క కొలతకు 3.1416 రెట్లుండునని భాస్కరాచార్యులు చెప్పియుండిరి. ఇది నేటికిని చెల్లుబడి యగుచున్నది. నేటి పాశ్చాత్యులంగీకరించిన 3 ఇంచుమించు దీనికి సరిపోవును. ఈరెండింటిలోను భాస్కరాచార్యుల నిష్పత్తియే యెక్కుడు సత్యసన్నిహితమని కొందరు పాశ్చాత్యులు భావించిరి.

పాశ్చాత్యరేఖాగణిత శాస్త్రములో పైథాగరస్ సిద్ధాంతమని ప్రసిద్ధిచెందినది యథార్థముగా భారతీయసిద్ధాంతము. పైథాగరస్‌కు పూర్వకాలమున రచింపబడినదని పాశ్చాత్యులే యంగీకరించిన శుల్బసూత్రములో నీసిద్ధాంతముకలదు. దానినే పైథాగరస్ గ్రహించెను. "నాభారతీయ వైభవము" 88, 89 పుటలు చూడదగును.

ఒకవృత్తము(Circle)యొక్క వైశాల్యముతో సమానమైన అర్థవృత్తమును నిర్మించుటకును, ఆరెండింటి వైశాల్యముతోను సమానమైన వైశాల్యమును గల్గిన సమకోణచతుర్భుజమును నిర్మించుటకును యజ్ఞసందర్భమున అవసరమగును. గార్హపత్యము వృత్తాకారముగాను, దక్షిణాగ్ని అర్ధవృత్తాకారముగాను, అహావనీయము సమకోణచతుర్భుజముగాను ఉండవలయును. ఈమూడింటియొక్క వైశాల్యము సమానముగా నుండవలయునని శుల్బసూత్రము చెప్పుచున్నది.

వృత్తార్థ వృత్త సమకోణచతుర్భుజములలో నొకదాని వైశాల్యము నిచ్చువో దేనినైనను నిర్మించుట కెంత రేఖాగణిత శాస్త్రజ్ఞాన ముండవలయునో వేరుగ చెప్పనక్కరలేదు. శ్రౌతసూత్రములోని యీవిజ్ఞానము ననుసరించియే భాస్కరాచార్యులు ఒకకోణము 90° డిగ్రీలుగల త్రిభుజమునుగురించి "భుజకోటి వర్గైక్యమూలం కర్ణమూలం" అని చెప్పియున్నారు. భుజవర్గమూలం+కోటివర్గమూలం = కర్ణమూలం లేక కర్ణవర్గః = భుజవర్గః + కోటివర్గః అని దీనితాత్పర్యము.

"Square on the Hypotenuse is equal the sum of the squares on the other two sides."

అని పైథాగరస్ చెప్పినదానికిని దీనికిని ఏమియు భేదములేదు.

## ఖగోళశాస్త్రము

చాంద్రమాన సౌరమాన భేదములనుబట్టి యేర్పడు అధికమాసమును గురించిన పరిజ్ఞానము ఇతర దేశస్థుల కెవరికిని లేనికాలములో భారతీయుల కుండెను.

సౌరసంవత్సరమునకును చాంద్రసంవత్సరమునకు గల భేదముల పురస్కరించుకొని క్రమక్రమముగా అవి యొకదాని కొకటి సంబంధింపనంతగా పరస్పరదూరస్థములగు ప్రమాద మున్నది. సౌరమానప్రమాణము 30 ది. 10గం. 29ని. 5 సె. అయియుండగా చాంద్రమానప్రమాణము 29 ది. 12గ, 44ని. 2.87 సె. చాంద్రమానములో మూడుసంవత్సరముల కొకసారి అధికమాసమును కల్పించుటవలన నిరంతరము పరస్పర విదూరముగ విడిపోవుచున్న సౌర చాంద్రమాన సంవత్సరములు వీలైనంత సమీపమున నిలబెట్టగలవు. ఈరీతిగా సాధారణముగా సంవత్సరమునకు 12 మాసములై యుండగా మూడేండ్ల కొకసారి 13 మాసములగును. వరుణుడు సంవత్సరము యొక్క 12 మాసములనేకాక 13వ మాసమునుకూడ నెఱుగునని ఋగ్వేదములో (1—25-8) చెప్పబడినది. "వేదమాసో ధృతవ్రతో ద్వాదశప్రజావతః వేదాయ ఉపజాయతే"

అయనచలనమును గురించిన జ్ఞానముకూడ నెల్లరికంటె ముందు భారతీయులకే యుండెను. అనేకశతాబ్దములు, సహస్రాబ్దములు- ఒకతరమువారి తర్వాత మరొక తరమువారు ఖగోళమును పరిశీలించుచు తమ పరిశోధన ఫలితములను తరు

వాతి తరమువారి కందించుచుండిననేకాని యేజాతివారును అయన చలనములను గురించిన సిద్ధాంతమును భారతీయులు ప్రతిపాదించినంత చక్కగా ప్రతిపాదింపజాలరని కోల్, బ్రూక్, కీరో మున్నగువా రభిప్రాయపడిరి. కీరో Language of the Palm అను గ్రంథములో నిట్లు వ్రాసియున్నాడు. "మేషాది రాశులలో నొకరాశినుండి మరొకరాశికి సూర్యగతి జరుగుటకు 2140 సంవత్సరములు పట్టునని నిరూపింపబడినది. అట్టి మార్పులను గ్రంథస్థము చేయగల్గినవారుప్రాచీనభారతీయులు. వీరు ఎన్నిశతాబ్దము లీ జ్యోతిషసంఘటనలను పరిశీలించియుండవలయునో యూహించుకొనుటకు కూడ మనకు శక్యముకాదు."

వేదసంహితలలో కొన్నిచోట్ల పునర్వసులోను, కొన్ని చోట్ల మృగశీర్షలోను, ఐతరేయ బ్రాహ్మణములో కృత్తికా రోహిణులలోను సంపాత ముండెనను సాక్ష్యములుండుటచే పాశ్చాత్యుల కాశ్చర్యము కల్గినది. ఈబిందువు ఒకయంశము జరుగుటకు 71 సంవత్సరములు పట్టును గావున అయన చలనములను గుర్తించిన దేశము సహస్రాబ్దముల కొలది జ్యోతిష శాస్త్రపరిశోధనము గావించియుండునని పాశ్చాత్యుల యభిప్రాయము.

వారముల కాయా పేర్లెందులకు వచ్చెనో యను ప్రత్యభిజ్ఞానము గలవారు ప్రపంచములో భారతీయులు తప్ప మరెవ్వరును లేరు.

ఆకాశమునుండి భూమివరకు వరుసగా 1. శని, 2. గురు 3. కుజ, 4. రవి, 5. శుక్ర, 6. బుధ, 7. చంద్రగ్రహము లున్నవి. మందామరేజ్య భూపుత్ర సూర్యశుక్రబుధేందవః (సూర్యసిద్ధాంతము)

ప్రతిదినము సూర్యోదయము మొదలు మరలసూర్యో దయమువరకు 24 హోరలు నడచును. హోరఅనగా 2½ గడి యలు, లేక ఒకగంట. సూర్యోదయమున ఏవారాధి పతి యొక్క హోరయో ఆదినము ఆతని వారము. అర్క శుక్ర బుధశ్చంద్రమందో జీవకుజాః పునః సార్ధద్విఘటిక హోరా ఇత్యేతత్ హోరలక్షణం. ఈ శ్లోకమునుబట్టి 24 హోరలు చెల్లగా మరునాటి సూర్యోదయమునకు మొదటి వారాధి పతికి నాల్గవగ్రహముయొక్క హోర వచ్చును. ఆనాల్గవగ్రహమే ఆనాటి వారాధిపతియగును. సృష్ట్యాది ఆదివారమునాడగుటచే ఆదివారము మొదటివారమయినది.

ఇట్లు ఆదిత్యవారము, సోమవారము, మున్నగు ఏడు వారములును ప్రపంచములోని అన్నిదేశములలోను వాడుక లో నున్నవి. కాని యాయావారముల కాయాపేర్లెందులకు వచ్చెనో భారతీయులకు మాత్రమే తెలియును.

నిన్నమొన్న పాశ్చాత్యజ్యోతిషశాస్త్రవేత్తలు కని పెట్టినయంశముల నేనాడో భారతీయులు చాటియుండిరి. భూమి తన యిరుసుమీద తానే తిరుగుచున్నదని యిటీవలనే పాశ్చాత్యులు తెలిసికొనిరి. ఏనాడో ఆర్యభటు డీయంశమును

వెల్లడించెను. ఆర్యభటుడు క్రీ॥ శ॥ అయిదవశతాబ్దివాడని పాశ్చాత్యులే చెప్పుచున్నారు. సూర్యుడు తిరుగుటలేదనియు భూమియే తిరుగుచున్నదనియు కోపర్నికస్ పాశ్చాత్యప్రపంచమునకు చాటెను. అంతకుపూర్వమేనాడో భాస్కరాచార్యుడు తన సూర్యసిద్ధాంతగ్రంథములో నీయంశమును వెల్లడించెను. ఇట్టి శాస్త్రరహస్యములను కొన్నిటిని పాశ్చాత్యులు భారతీయగ్రంథపఠనమువలనను స్వయంపరిశీలనము వలననుకొన్నిటిని గ్రహించియుండవచ్చును. కాని విశేషభాగ మీ విజ్ఞానమంతయు భారతదేశమునుండి యితర దేశములకు ప్రాకినదే.

గ్రహములును, ఆకాశములోని సమస్తగోళములును పడిపోకుండ నట్లు నిలచియుండుటకు కారణము పరస్పరాకర్షణశక్తియని యాధునికులు చెప్పుచున్నారు. ఏనాడో వరాహమిహిరుడు పంచసిద్ధాంతికలో నిట్లు చెప్పియున్నాడు.

"పంచమహాభూతమయస్తారాగణపంజరే మహీగోళః,
ఖేఽయస్కాంతలోహ ఇవావస్థితో వృత్తః"

"రెండు అయస్కాంతపుటాకర్షణముల నడుమ ఇనుపగుండువలె ఆకాశమున చుక్కలగుంపునడుమ భూగోళముకలదు." అని దీని తాత్పర్యము.

భూమి తిరుగుచున్నదనియు, సూర్యుడు నక్షత్రములును ముఖ్యముగునవి తిరుగుచున్నట్లు కన్పట్టుచున్నను నిజమునకు తిరుగుట లేదనియు, పడవమీద పోవువానికి గట్టుననున్న చెట్లు వెనుక

కకు నడచిపోవుచున్నట్లు కన్పట్టుట యను దృష్టాంతమిట చెల్లుననియు నేటి వైజ్ఞానికులు చెప్పుచున్నారు. ఆర్యభటు డేనాడో యీయంశములను చెప్పియున్నాడు:

"అనులోమగతిర్నౌస్థః పశ్యత్యచలం విలోమగం యద్వత్ అచలానిభాని తద్వత్సమ పశ్చిమగాని"

భూమి గుండ్రముగానున్నదని మొన్న మొన్న గెలీలియోమున్నగువారు పాశ్చాత్యులకు తెలిపిరి. భట్టోత్పలుడు, భాస్కరాచార్యుడు మున్నగువారేనాడో భూమి గుండ్రముగానున్నదనియు బల్లపరుపుగా లేదనియు చెప్పిరి. పైకి భూమి వంకరగా కనబడకపోవుటకు కారణము అది మిక్కిలి పెద్దదైయుండుటయే యనియు, మానవుడు స్వల్పదూరమును మాత్రమే చూడగలవాడగుటచే వానిదృష్టికి భూమిలో నేభాగమైనను బల్లపరుపుగానే యున్నను యథార్థముచేత భూమి వలయాకారముగానే యున్నదనియు వారు తెలిపిరి.

"సమోయతఃస్యాత్పరిధేః శతాంశః, పృథ్వీచ పృథ్వీ నితరాంతనీయాన్ నరశ్చ తత్పృష్ఠగతస్య కృత్స్నా సమేతస్య ప్రతిభాత్యతస్సా."

సూర్య చంద్ర కుజ బుధాదుల యొక్కయు నక్షత్రముల యొక్కయు గతికిని మానవుల జీవితములకును గల సంబంధమును గురించి ప్రాచీన భారతీయులు తెలిపిన సత్యములను ఆధునికు లింకను తమ నవీనపద్ధతి పరిశోధనలవలన తెలిసికొనజాలకున్నారు. అయినను ఆధునిక వైజ్ఞానిక గవేషణములో

నారి తేరిన పాశ్చాత్యులు కనుగొనుచున్న జ్యోతిషాంశము లానాటి కానాడు భారతీయ జ్యోతిషముయొక్క మహాత్మ్య మును లోకమునకు చాటుచున్నవి. ఈ సందర్భమున శ్రీ బి. వి. రామన్ వెల్లడించిన యీ క్రిందివిషయములు గుర్తింపదగియున్నవి. "పరాశరుని ప్రాణపద సిద్ధాంతము ననుసరించి దినములో నెప్పుడు పట్టిన నప్పుడు జన్మ సిద్ధింప దనియు, స్త్రీ పురుష జన్మములకు కొన్ని నిర్ణీతావధులు కల వనియు తెలియుచున్నది. ఈసిద్ధాంతము సరియైనదేయని కే. ఇ. క్రాఫ్టు అను స్విస్ జ్యోతిషికుడు ధ్రువపరచియున్నాడు. స్వీడిషు శాస్త్రవేత్త యొక్కరు స్త్రీలలో చాలమంది చాంద్ర మాసములో ఒక నిర్ణీతసమయమునకు బహిష్ఠలగుదురని నిరూపించినారు. ఈవిషయము వరాహమిహిరుని 'కుజేందు హేతుః ప్రతిమాసమార్తవ, ఇత్యాది వచనమును జ్ఞప్తికి తెచ్చుచున్నది. సూర్యునివలన ఆరోగ్యము కోరదగునని మనప్రాచీనులు చెప్పిరి. యేలు విశ్వవిద్యాలయాచార్యుడు హన్‌టింగస్ మానవుని నడతమీదను, ఆరోగ్యముమీదను సూర్యుని ప్రభావముండునని యభిప్రాయపడినాడు." (1958 సెప్టెంబరులో జ్యోతిషమహాసభలోని ఉపన్యాసము)

భారతదేశములోని సామాన్యప్రజలకు కూడ ఖగోళ పరిజ్ఞాన ముండునట్లు ఆచారసంప్రదాయము లేర్పరుపబడినవి. ఒక యుదాహరణము తీసికొందము.

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించుటను నిరూపించు ముగ్గులు గృహప్రాంగణమున స్త్రీలు పెట్టు నాచారము మన దేశములో కలదు. శుభకర్మలకును, మరణమునకును, యజ్ఞములకునుగూడ దక్షిణాయనము అప్రశస్తము, ఉత్తరాయణము ప్రశస్తము నగుటచే సూర్యుని ఉదగయన సంచారప్రారంభము మిక్కిలి ప్రధానమైనదిగ పరిగణింప బడెను. సంక్రాంతి ముగ్గులలో నీసంబంధమైన జ్యోతిషవిజ్ఞానమును భారతీయస్త్రీలు కనపఱచుచున్నారు. సంక్రాంతిపట్టు 12 గళ్ళు కలదిగా చిత్రింపబడుచున్నది. అదియే ద్వాదశరాశిచక్రము. అందు సూర్యుడు సంచరించుటను సూచించు కిరణములవంటి గీతలు వేయబడును. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించుటను సూచించుటకై సూర్యుని బొమ్మగూడ ముగ్గులలో చూపించబడుచున్నది. దానిని గుమ్మడిపండు అని నేడు చెప్పుచున్నారు. సూర్యునకు గుమ్మడిపండుతోడిపోలిక సాహిత్యగ్రంథములలో కూడ కన్పట్టును. 'సూర్యగుమ్మడి' యను నొకవిధమైన గుమ్మడికూడ కలదు. అంతేకాక యొకరథము కూడ సంక్రాంతి పట్టులో చూపబడును. సూర్యుడు రథము మీదవచ్చుట "హిరణ్యయేన సవితారథేనా దేవోయాతి" మున్నగు వేదవచనములచే ప్రసిద్ధము. మఱియు సంక్రాంతి పట్టులో పాములుకూడ వేయబడును. సూర్యరథమునకు సర్పములే పగ్గములని మన ప్రాచీనగ్రంథములలో చెప్పబడినది. సూర్యుడు మకరములో ప్రవేశించినపిమ్మట రథము ముందు

నకు సాగిపోవు చున్నదనుటను సూచించుటకుగాను క్రమము నాడు ప్రతియింటిపాయను తరువాతి యింటివరకును ముగ్గును ఈడ్చెదరు.

సూర్యచంద్ర గ్రహ తారకలయొక్క గతికి సంబంధించిన పరిజ్ఞాన మీరీతిగా మన దేశమున సామాన్యజనములలో కూడ వ్యాపింపచేయబడినది. ఇట్లు వినోదసందర్భములుకూడ విజ్ఞాన భరితములుగా నీ దేశమున గావింపబడినవి.

భారత దేశములో అన్నిప్రాంతములలోను జనసామాన్యము వాడుకొను పంచాంగము సూర్యచంద్రాదిగ్రహముల స్థితికి సంబంధించిన పరిజ్ఞానముపై నాధారపడియున్నది. పాశ్చాత్య దేశములలో మాసములు, తేదీలు జ్యోతిషవిజ్ఞానముమీద నాధారపడినవి కావు. భారతీయుల మాసముల తిథులు హేతుబద్ధములైనవి; అవి ప్రాకృతికసత్యములపై నాధారపడియున్నవి.

జనవరిమాసమున కాపేరెందులకు వచ్చెనో విచారింతుమేని రెండుముఖములుగల జానస్ అను గ్రీకుదేవతకువలె ఈమాసమునకు పూర్వసంవత్సరమువైపునకును, రాబోవు సంవత్సరమువైపునకును చూడగల రెండుముఖము లున్నవని మాత్రమే మనకు తెలియును. ఇందేవిధమైన ఖగోళపరిజ్ఞానము నిమిడిలేదు. కాని భారతీయుల చైత్రమాసమున కాపేరెందుకువచ్చెనో చూతుమేని, ఆమాసములో పౌర్ణమినాడు చంద్రునితో చిత్తానక్షత్రముండుటవలన దానికి చైత్రమాస

మని పేరువచ్చెనని మనకు తెలియును. ఇట్లే యేమాసములో విశాఖానక్షత్రము పూర్ణిమినాడు చంద్రునితోనుండునో యా మాసమునకు వైశాఖమాసమని పేరువచ్చినది. జ్యేష్ఠ, పూర్వాషాఢ, శ్రవణము, పూర్వాభాద్ర, అశ్వని, కృత్తిక, మృగశీర్ష, పుష్యమి, మఖ, పూర్వఫల్గుని యను నక్షత్రములు ఏమాసములలో పూర్ణిమనాడు చంద్రునితో నుండునో యా మాసములకు జ్యేష్ఠమాసము, ఆషాఢమాసము మున్నగు నామములు గల్గినవి!

ఈ దేశములో జనసామాన్యము వాడుకొనుతిథులలోకూడ జ్యోతిషవిజ్ఞానము ఇమిడియున్నది. పాశ్చాత్య దేశములలో ప్రతిమాసమునను 1,2,3 మున్నగు తేదీలను వాడుకొనుటలో నేమియు విజ్ఞానములేదు. చంద్రునికళలవృద్ధిక్షయములను తెలుపు తిథులు మన దేశమున వాడబడుచున్నవి. అష్టమి యనుటతోడనే యానాడు చంద్రుడెప్పు డుదయించునో యెపుడస్తమించునో మున్నగువిషయములు ప్రతివ్యక్తికిని ఈ దేశమున తెలియును. భారతీయుల సర్వవ్యవహారములలోను హేతుబద్ధతయుండుననుట అతిశయోక్తి కాదు. పాశ్చాత్యుల సంప్రదాయములో హేతుబద్ధత తక్కువ.

వసంతర్తువుతో సంవత్సరారంభమగుట భారత దేశములో అతిప్రాచీనకాలమునుండియు కలదు. వేదములలో కూడ 'మధుశ్చ మాధవశ్చ వాసంతికావృతూ' అని ప్రథమమున వసంతర్తు ప్రసంగము కలదు. నేటికిని భారత దేశములో

పలుప్రాంతముల వసంతఋతుప్రారంభముతోనే అనగా సుమారు మార్చిమాసాంతమున సంవత్సరాది యగుచున్నది. ఇది యేయొకప్పుడు ప్రపంచమునకంతకును సంవత్సరారంభము గానుండెను. అనేక భారతీయ సంప్రదాయములువిదేశములకు వ్యాపించినట్లే సంవత్సరారంభ సంప్రదాయముకూడ వ్యాపించి యుండెను. కాని మధ్యకాలములో పాశ్చాత్యులు సంవత్సరారంభమునేకాక మాసవిభాగ పద్ధతినికూడ మార్చుకొనిరి. ఇప్పటికిని సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు అను మాసనామములు వీరి పూర్వపు సంవత్సరాదిని సూచించును. సెప్టెంబరు సప్తమశబ్దభవము. అనగా ఒకప్పుడు సెప్టెంబరు పాశ్చాత్యులకు ఏడవమాసముగానుండెను. కాని యిప్పుడది తొమ్మిదవమాసము. కావున సెప్టెంబరు పదము పుట్టినప్పటికి జనవరిలోకాక మార్చిలో వారికి సంవత్సరారంభ మగుచుండెనని తెలియుచున్నది. అట్లే అక్టోబరు అష్టమ శబ్దమునుండియు, నవంబరు నవమశబ్దము నుండియు, డిసెంబరు దశమశబ్దమునుండియు వచ్చియుండుటచే పాశ్చాత్యుల సంవత్సరాది యొకప్పుడు మన సంవత్సరాది వలెనే విషువద్దివసముననో సౌరచాంద్రమాన పరిగణనము మీదనో యాధారపడియుండెనని తెలియగలదు.

పాశ్చాత్యులకాలమానము ప్రాకృతిక సత్యములను దాటిపోవుటయు; చారిత్రక హేతువులచే విపరిణామము చెందుటయు చూతుమేని శాశ్వత శాస్త్రసత్యములకు ప్రాముఖ్యము

నిచ్చు భారతీయులకును, నిరంతరము మారిపోవుచుండు రాజకీయాది పరిస్థితులకు ప్రాముఖ్యమునిచ్చు పాశ్చాత్యులకును గలభేదము మనకు తెలియగలదు. వారిమాసములలో నొకదానికి (జ్యూలై కి) జూలియస్ సీజరు చక్రవర్తియొక్క పేరు పెట్టబడినది. మరొకదానికి (ఆగస్టుకు) ఆగస్టస్ సీజర్ పేరు పెట్టబడినది. భారతీయులు నేటివరకును సంవత్సర, మాసతిథులలోని ఖగోళవిజ్ఞానమును నిలబెట్టుకొనుటయు ఈవిజ్ఞానము కూడ నేకొలదిమంది పండితులకో పరిమితముకాక జనసామాన్యములోకూడ నుండుటయు గమనింపదగిన విషయము.

## పదార్థవిజ్ఞానశాస్త్రము

పరమ పరమాణువుల సంయోగముచేతనే విశ్వములోని సమస్తపదార్థములు:ఏర్పడుచున్నవని నేటిసైన్సుయొక్క సిద్ధాంతము. ఈసిద్ధాంతమును ప్రకటించిన మొదటిపాశ్చాత్యుడు గ్రీసుదేశమునకు చెందిన డెమోక్రెటస్ అనుపండితుడు. ఈతడు క్రీస్తునకు 400 సంవత్సరములక్రిందటివాడు. ఈతనికి కనీసము నూరుసంవత్సరముల పూర్వపువాడైన కాత్యాయనుడు ఈ సిద్ధాంతమును ప్రకటించియుండెను. అంతకంటెను పూర్వము కణాదుడు తనవైశేషికదర్శనములో నీ సిద్ధాంతమును ప్రతిపాదించెను.

తేజస్సుయొక్క స్వరూపస్వభావములు ప్రాచీనభారతీయులకెంత చక్కగా తెలియునో పూర్వగ్రంథములవలన తెలిసికొని నవీనపదార్థవిజ్ఞానశాస్త్రకోవిదు లాశ్చర్యపడుచున్నారు. పైకి తెల్లగా కనబడుచున్న సూర్యరశ్మిలో ఏడు రంగులున్నవని నవీనశాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. ఈవిషయము ఋగ్వేదములో (1-105-9) చెప్పబడి యున్నది. (అమీయే సప్తరశ్మయస్తత్రా).

తేజస్సు తరంగరూపముగా నడచునని నేటిసైన్సు చెప్పుచున్నది. తేజస్సుపాములవలె నడచునని (జ్యోతీరథా అహిరయామాః) ఋగ్వేదములో (10-53-4) చెప్పబడియున్నది.

తేజస్సు అర్ధనిమేషమునకు 2202 యోజనములు నడచునని సాయణాచార్యులవారు ఋగ్వేదభాష్యములో (1-50-4) చెప్పియున్నారు.

"యోజనానాం సహస్రే ద్వే ద్వేశతే ద్వేచ యోజనే
ఏకేన నిమిషార్ధేన క్రమమాణాయ నమోస్తుతే."

నేటి సైన్సులో తేజస్సు ఒక సెకండుకు సుమారు 1 లక్ష 80 వేల మైళ్ళు నడచునని చెప్పబడినదాని కిది సరిపోవుచున్నదని శ్రీ గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారుతమ Scripture of the Heavens అను గ్రంథములో నిరూపించియున్నారు. (పీఠికాభాగములో xii—xv పుటలలో పైయంశములు విపులముగ నిరూపింపబడియున్నవి.) దివసమునకు 30 ముహూర్తములనియు, ముహూర్తమునకు 30

కళలనియు, కలకు 30 కాష్ఠలనియు, కాష్ఠకు 15 నిమేషము లనియు భాగవతములో (3-11) సీయబడిన కాలమానమును, 2000 దండములు (4000 గజములు) ఒక క్రోశము, 4 క్రోశము లొక యోజనము, ఇత్యాది దేశమానమును వారు విపులముగా నుదాహరించి యీ రెండుమానములను పట్టియు నిమిషమునకు 2202 యోజనములనునది సెకండుకు 180000 మైళ్ళను దానికిది సరిపోవునని నిరూపించిరి. (నిమిషమనగా 60 సెకండ్లనునది శాస్త్రీయమైన పరిగణనము కాదని వేరుగ చెప్పనక్కరలేదు.) నన్నయ్యభట్టు భారతములోని తపతీసంవరణోపాఖ్యానములోను శ్రీనాథుడు కాశీఖండములోని శివశర్మోపాఖ్యానములోను గావించిన తేజోవేగనిర్దేశము దీనితో సరిపోవుననికూడ రావుగారు నుడివియున్నారు.

ఆధునికపదార్థవిజ్ఞానశాస్త్రములో ప్రధానమైన దేశమానమునకును, జ్యోతిషములో ప్రధానమైన కాలమానమునకును భారతీయు లేర్పరచుకొన్న క్రమమును చూతమేని కొలతలను ఇంత సూక్ష్మాతిసూక్ష్మముగా గావించుకొన్న వారింకెవ్వరును లేరని తెలియగలదు. ఒక పరమాణుకాలము నేటి సెకండులో 75937½ వ వంతు అని నిరూపింపబడినది.

నేటి ఫిజిక్సులోని కొన్నివిషయములు ప్రాచీనభారతీయగ్రంథములలో కన్పట్టుచున్నవని యందరు నంగీకరించుచునేయున్నారు. కాని నేటి సైంటిస్టులు కనుగొనుచున్న పద్ధతిలోనే ప్రాచీనభారతీయులు ప్రాకృతికసత్యములను కన్న

గొనుచుండిరా వారికి వేరుపద్ధతి యుండెనా యను శంక కల్గుచో వారి పద్ధతి వేరనియే నేను చెప్పుచుంది తలచు చున్నాను. ఈసందర్భమున ప్రాచీనభారతీయులు తర్కము వల్లను, అంతర్వాణివల్లను సత్యములను గ్రహించిరని నేటి ప్రముఖుల యభిప్రాయము. (Indian Inheritance Vol. III Page 7 —B, V. Bhavan's publication,)

శబ్దమును తేజస్సును, ఉష్ణతను గురించి నేటి ఫిజిక్సు లోని విషయములకు సరిపోవు వైశేషికసిద్ధాంతమును ప్రశం సించుచు సర్ పి. సి. రే వ్రాసిన యీ క్రిందిపంక్తులు గమ నింపదగియున్నవి: "కణాదుని శబ్దవిస్తృతిసిద్ధాంతము ఇంత కాలము గడచిన తర్వాతకూడ మనకాశ్చర్యమును గల్గించుచు మనప్రశంసను పొందుటకు సమర్థమైయున్నది. దానితోసమా నముగా గణ్యతను పొందియున్న మరొక సిద్ధాంతముకూడ నీతనిది కలదు. తేజస్సు, ఉష్ణతయను రెండును ఒక వస్తువు యొక్క రెండు స్వరూపములని యాతడు చెప్పియున్నాడు. నేటి సైన్సుకూడ నట్లే చెప్పుచున్నది. సాంఖ్యదర్శనమునకు మూలప్రవక్తయైన కపిలుడు కణాదునకు పూర్వమే యిట్టి విష యముల ననేకములను ప్రతిపాదించియుండెను.

(History of Hindu Chemistry, Vol I P. I)

ప్రపంచములోని మూలపదార్థము లెన్నియను ప్రశ్న పాశ్చాత్యులను చిరకాలమునుండి బాధించుచున్నది. మూల పదార్థములు సుమారు ముప్పదియని యొకప్పుడును, తొంబది

యని యొకప్పుడును వారు భావించిరి. వారు తుదకు నవీన కాలమున మూలపదార్థములు రెండేయను నిర్ణయమునకు వచ్చిరి; పదార్థము, శక్తి (Matter and Energy) అనునవి రెండే మూలవస్తువులని వారు నిశ్చయించిరి. ఇంకను నవీనమైన సైన్సుసిద్ధాంతము ననుసరించి పదార్థము, శక్తి యనునవి రెండు భిన్నవస్తువులు కావు. పదార్థమును శక్తిగను, శక్తిని పదార్థముగను మార్చుట సాధ్యమగుచున్నందున (అనగా నీరెండును పరస్పర వినిమయయోగ్యములు— Interconvertible అగుచున్నందున) యథార్థముగానున్న వస్తువొకటేయని నేటి సిద్ధాంతము. ఇట్లు ఒకే మూలప్రకృతి యొక్క వికారములే సర్వవస్తువులు అను ప్రాచీన భారతీయ సిద్ధాంతము వద్దకు సైన్సువచ్చి చేరినది.

సర్ జేమ్సుజీన్సు అను ప్రఖ్యాత వైజ్ఞానికుడు తన Mysterious Universe అను గ్రంథములో నిట్లు వ్రాసియున్నాడు.

"స్థూలమైన పాంచభౌతికపదార్థములలో మనసు వచ్చి చొరబడినదని చెప్పుట సరికాదు. మనస్సే స్థూలపదార్థములను సృష్టించుటకు, శాసించుటకు సమర్థమైనది. ఇది మన వ్యక్తిగతమైన మనస్సు కాదనుకొనుడు; ఏమనస్సునుండి మన వైయక్తికమనస్సులు వచ్చినవో అది యిట్టి శక్తిగల్గినమనస్సు. మనస్సునకును స్థూలపదార్థమునకును భేదమున్నదను వెనుకటి భావము అదృశ్యమగుచున్నది. ఈ విశ్వనిర్మాణమును సంక

ల్పించునట్టియు, నడిపించునట్టియు నొకశక్తి యున్నదనుటకు సాక్ష్యము నిపుడు మనము కనుగొనుచున్నాము. ఆశక్తి కొన్ని విషయములలో మన మనస్సుతో సామ్యమును గల్గియున్నది.''

జీన్సు తెలిపిన యీ యంశములను పరిశీలింతుమేని వేదములలో తెలుపబడినట్లు సంకల్పమువలన సృష్టి యేర్పడెననియు, పురాణములలో చెప్పబడినట్లు ప్రజాపతులు మనస్సుచేతనే సృష్టిచేసిరనియు, నానాత్వముతో కన్పట్టుచున్న జగత్తు వాస్తవముగా ఏకమే యనియు, "నేహనానాస్తికించన'' అనునది సత్యమనియు ఆధునిక వైజ్ఞానికులు కనుగొననెంచుచున్నారని తెలియగలదు.

## రసాయనాది శాస్త్రములు

రసాయన శాస్త్రములో భారతీయులు సాధించిన విజ్ఞానమును సర్. పి. సి. రే తమ గ్రంథములో చక్కగా వివరించి యున్నారు. ప్రపంచములో మరి యేదేశమువారును నేటివరకును సాధింపని రసవిద్యను ప్రాచీనభారతీయులు సాధించిరి. పాదరసమును సర్వార్థసాధకముగా నుపయోగించు విద్య యీ దేశమున విలసిల్లినది.

"రసవైద్యములో హిందువులు సర్వప్రథములు. లోహములను ముందుగా ఉపయోగించుటలోను వారే మొదటివారనుటకు చరక శుశ్రుత గ్రంథములు, తంత్రగ్రంథములు కూడ సాక్ష్య మొసగుచున్నవి.'' (Introduction, Hindu Chemistry.)

ఆ గ్రంథములోనే వారిట్లు వ్రాసుచున్నారు. "ఉక్కును తయారుచేసి సున్నితముగా వాడుకొనుట నాదిలో భారతీయులనుండియే పర్షియనులు నేర్చుకొనిరి. వారినుండి అరబ్బులు నేర్చుకొనిరి."

అరబిక్ భాషలో ఉక్కును తెలుపుటకు "హిందు దేశపు ఇనుము" అను అర్థము వచ్చుపదము వాడుకలో నున్నది. ఇదియే భారతీయులకు ఉక్కును తయారుచేయుటలో నుండిన ప్రత్యేకసామర్థ్యమును స్పష్టపఱచుచున్నది.

తామ్రి గంధకాద్యామ్లములను ముందుగా చేసినవారు భారతీయులే.

కిటికీలకు గ్లాసులను వాడుపద్ధతి గ్రీకులకంటెను, రోమనులకంటెను భారతీయులకు ముందుగా తెలిసెనని విల్సన్ వ్రాసియున్నాడు.

ఢిల్లీకి సమీపమున నేటికిని చెక్కుచెదరక నిలచియున్న యొక యినప స్తంభమునుగురించి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూగారు తమగ్రంథములో ఇట్లు వ్రాసియున్నారు. "ఆ స్తంభము ఇంతకాలముగా జరుగుచుండిన వాతావరణ పరిణామములకు లోనుగాకుండ వానినుండి తట్టుకొని బలమును నిలబెట్టుకొనుట యెట్లు సాధ్యమైనదో నేటి సైన్‌టిస్టులకు తెలియుటలేదు. ఆ స్తంభముమీది వ్రాత క్రీ. శ. నాల్గవశతాబ్దికిని 7వ శతాబ్దికిని నడుమనుండిన గుప్తలిపిలో నున్నది. ఆస్తంభము ఇంకను పూర్వపుదనియు దానిపై వ్రాత...తరు

వాతి కాలములో వ్రాయబడినదనియు కొందరు పండితు లభిప్రాయ పడుచున్నారు." (Discovery of India, 1959 Edition, Page 103)

అణువులో పరమాత్మయున్నాడనియు, అణువే సర్వమునకు మూలకారణ మగుటచే సర్వశక్తులు అణువులోనే యున్నవనియు మన ప్రాచీనులు చెప్పియున్నారని ఆటంబాంబుకనిపెట్టబడిన క్రొత్తలో నొకరుహిందూపత్రికలో లేఖను వ్రాసిరి. ఒకరయగాథునికుడు "ఏదిసైన్సులో క్రొత్తగా కనిపెట్ట బడినను ఇది మాపూర్వులకు తెలియుననువారు ముందుగానే యాసంగతిని చెప్పక సైన్‌టిస్టులు కనిపెట్టినాకనే యేలచెప్పు చున్నారో" యని యాక్షేపించిరి. ఇది యర్థములేని యాక్షేపణము. పురాణములలో, శాస్త్రములలో చెప్పబడిన సత్యములను మన పండితులు ఎప్పుడును లోకమునకు చెప్పుచునే యున్నారు. ఆస్తిక్యబుద్ధిలేనివారు పురాణములు వినరు; పండితులవద్ద శాస్త్రములను వినరు. కావున ఆచెప్పినదంతయు వారిచెవిని బడుటలేదు. సైన్‌టిస్టు కనిపెట్టినతర్వాత చెప్ప బడినదే వీరికి వినబడుచున్నది.

ఇట్టి విద్యలెల్లప్పుడును మానవుల సుఖమునకే తోడ్ప డునను నియమము లేనందున మేధావులైనవారు వీనిని ఉపే క్షించి యుండవచ్చును. అగ్నిని జంఝామారుతమును,ఇతరోప ద్రవములను పుట్టించి జనసంహారముచేయు ఆయుధములు ఈ దేశమున నొకప్పుడు వాడబడెను. భారతదేశములో తమపై

నట్టిఆయుధములు ప్రయోగింపబడెనని అలెగ్జాండరుతో నిచ్చటకు వచ్చినవారు తమదేశస్థులకు చెప్పియుండిరి. ఈవిద్య లోకవ్యాప్తమైయున్నచో తర్వాత నశించునాయని యెవ్వరు శంకింపనక్కఱలేదు. అణ్వస్త్రమును నిషేధింపవలయునని నేటి లోకకల్యాణపరాయణులు చెప్పుచుండగా పూర్వముకూడ నట్టివా రెందుల కుండకూడదు!

మహాయంత్రములన్నియు లౌకిక లంపటత్వమునే పెంచు ననియు, నవి సుఖప్రశాంతజీవితమునకు భంగకరములనియు మనకాలములో గాంధిమహాత్ముడు చెప్పియుండుటను మన మెరుగుదుము. పూర్వముకూడ మహామేధావులు, సమాజనేతలు, శాసకులు అట్లు భావించియుండవచ్చునని యూహింతుమేని యంత్రముల విజృంభణము మానవకల్యాణదృష్టితోనే నివారింపబడెనేమో యనిపించును. మనువు మహాయంత్రప్రవర్తనమును ఉపపాతకములలో చేర్చియున్నాడు. (11-63)

ప్రజోపయోగకరములైన నీటిపారుదల విధానములు, సేతునిర్మాణములు మున్నగునవి ప్రాచీనభారతీయులకు సుపరిచితములు. ఏనాడో చంద్రగుప్తమౌర్యుడు నిర్మించిన ఆనకట్టలు క్రీ॥ శ॥ 150 వఱకును నిలచియున్నవని గ్రీకుచరిత్రకారుల వ్రాతలవలన మనకు తెలియుచున్నది. క్రీ. శ. 1435 ప్రాంతమున అమరావతిజిల్లాలోని అచలపూర్ వద్ద గొట్టముల ద్వారా మంచినీటిని కొనిపోవు కుళాయిలపద్ధతి యుండెనని తెలియుచున్నది.

కాళిదాసుని మేఘసందేశములో యంత్రధారాగృహములు పేర్కొనబడినవి. (1-65)

పూర్వమీ దేశమున నిర్మింప బడిన భవనముల గట్టితనము ఆధునికుల కాశ్చర్యము గల్గించు చున్నది. నేడెక్కడనైనను దేవాలయముల మరమ్మత్తుచేయవలయు నన్నచో నొకచిక్కు వచ్చుచున్నది. నేడు కట్టబడుచున్న భాగము పూర్వపుకట్టడముతో సరితూగుటలేదు. ఈసంగతిని దేవాదాయ శాఖాధికారు లనేకులు వెల్లడించియున్నారు.

నేడు మన యింజనీర్లు నిర్మించుభవనములు పూర్వకాలపు కట్టడములు నిలచినంతకాలము నిలచుచో మనలను మనమభినందించు కొనవచ్చునని రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాదు గారు చెప్పియున్నారు. 19-9-1959 తేదీని శ్రీశైలములో నొకసభ యందిట్లు రాష్ట్రపతి పల్కియుండిరి. "ఇక్కడి కోట గోడపై కన్పట్టు అపూర్వ శిల్పసంపదను చూచి ముగ్ధుడనైతిని. వేలకొలది సంవత్సరముల క్రిందట నవి నిర్మింపబడి నప్పటికి వానిసొంపు చెక్కు చెదరకుండుట ప్రశంసనీయము. దానివలన మన పూర్వుల శిల్పప్రాభవము, వాస్తుశాస్త్ర ప్రావీణ్యము ఎంతగొప్పవో విశదమగును. ప్రస్తుతము మన దేశములో జరుగుచున్న నిర్మాణ కార్యక్రమములు, అయిదేండ్ల కొకసారి మన యింజనీర్లు జరపు మరమ్మత్తులు చూడగా మన పూర్వులు నిర్మించిన నిర్మాణము లున్నంతకాలములో పదవవంతు కాలము నిలువయున్న చాలునని

పించును. అయితేంజ్ఞ కొకసారి యిప్పటి నిర్మాణములకు జరుపు మరమ్మత్తులను నిలిపివేయుచో పూర్వపునిర్మాణము లున్నంత కాలములో పదవవంతు కాలమైనను ఇవి యుండునా యని నా సందేహము" (ఆంధ్రపత్రిక ననుసరించి)

వ్యవసాయములో సూక్ష్మవిషయములుకూడ ప్రాచీన భారతీయులకు తెలిసియుండెను. ఊడుపుపద్ధతిలో ధాన్యము పండించుట కాళిదాసు రఘువంశములో (4-37) ఉపమాన సందర్భముగా పేర్కొన బడినది. ఏ విధముగా పంటలను మార్చుచుండిన భూమి సారవంతమగు చుండెనో యను పద్ధతి కూడ వారికి తెలిసియుండెను.

ప్రత్తిని పండించి నూలుతో వస్త్రములను నిర్మించు కొని ధరించుట యితర దేశములలో మొన్న మొన్ననే వచ్చి నది. మొహంజదారో హరప్పాలలో జరిగిన త్రవ్వకములను బట్టి 5000 సంవత్సరముల క్రిందటనే భారతదేశములో నీ యాచారముండెనని యాధునిక పరిశోధకులు తెలిపియున్నారు.

నౌకానిర్మాణములో కూడ ప్రాచీన భారతీయులు ప్రశస్తిని చెందియుండిరి. భోజుడు రచించిన "యుక్తికల్పతరు" గ్రంథములో నౌకా నిర్మాణమును గురించిన యద్భుతవిష యము లెన్నియో కలవు. "ప్రాచీన భారతీయపద్ధతిలో నిర్మింపబడిన నౌకలలోను, పడవలలోను లోపములను చూపు టకు నేటి పాశ్చాత్యవైజ్ఞానికులకు కూడ సాధ్యమగుటలేదు"

అని సర్ మాల్కోలం వ్రాసియున్నాడు (The Royal Asiatic Journal Vol. I)

వివిధ శాస్త్రముల పరిజ్ఞానమును నాగరకతా నిర్మాణములో భారతీయు లుపయోగించుకొన్న పద్ధతిననుసరించి యెంత యినను గవేషణము జరుగవలసి యున్నది.

అంశుబోధినియను ప్రాచీన గ్రంథములో ఛాయాచిత్రగ్రహణపద్ధతి (ఫోటోగ్రఫీ) వివరింపబడినది. ఈగ్రంథములో ననేకములగు వైజ్ఞానికాంశములు గలవు. ఈ గ్రంథము 1932వ సంవత్సరములో ముద్రింపబడినది.

దేవాలయాది నిర్మాణములో మనపూర్వులు సాధించిన విశేషములను చమత్కారములను చూతుమేని వారికి గణితజ్యోతిషాది బహుశాస్త్రములలో నెంత గొప్పనైపుణ్యముండెనో స్పష్టముగా తెలియగలదు.

హంపివిజయనగరములో శ్రీ విఠలదేవుని మందిరములోని స్తంభములు సప్తస్వరములను పలుకగలవు. ఇది లోకోత్తర కళాప్రావీణ్యమునకు నిదర్శనము.

తంజావూరులోని బృహదీశ్వరాలయముయొక్క నీడ యేదినమునను మధ్యాహ్నసమయమున నేలమీద పడకుండునట్లు నిర్మింపబడినది. ఆలయముయొక్క క్రిందిభాగముమీదనే పైభాగముయొక్క నీడ పడుచుండును. ఇట్టి నిర్మాణము గావించుటకు గణితజ్యోతిషములలో అద్భుత పాండిత్యము కావలయును.

ఒరిస్సాలో కోణార్కయను సూర్యక్షేత్రము కలదు. అచటి సూర్యభగవానుని రథము ఒకే శిలాతో నిర్మింపబడినది. దీనిని కలకత్తాకు తరలించి వస్తుప్రదర్శనశాలలో (మ్యూజియములో) నుంచదలచి బ్రిటిషు ప్రభుత్వము అప్రయత్నముచేసినది. కాని సూరథమును దొర్లించుకొనిపోవుటకు సాధ్యముకాలేదు. ఆదిలో నాశిలాతిని రథముగా చెక్కినవారు దాని నచ్చట కెట్లు తీసికొనిరాగల్గిరో యనునది పెద్ద యాశ్చర్యము. ఆశిలాయి మొదటినుండియు నక్కడిదే యనుకొనుటకు వీలులేదు. ఏలయన: అది పర్వతప్రదేశముకాదు; చుట్టుపట్లకొండలులేవు.

మైసూరు రాష్ట్రములో రంగస్థలము అనుగ్రామమున రంగనాథస్వామి యాలయముకలదు. అచ్చట ప్రతిసంవత్సరము రథసప్తమినాడు సూర్యకిరణమొకటి దేవతామూర్తిపై పడును.

ఈరీతిగా ఆలయనిర్మాణము చేయుటకు జ్యోతిషగణిత పాండిత్య మెంతయో కావలయును.

విమాననిర్మాణము, ఆకాశయానము ప్రాచీనభారతీయులకు తెలియును. 1952 సంవత్సరమున మైసూరులో వైమానికశాస్త్రమను సంస్కృతగ్రంథము International Academy of Sanskit Research అను అంతర్జాతీయ సంస్కృత పరిశోధకసంస్థ యొక్క డైరెక్టరుచే కనుగొనబడెను. భరద్వాజ రచితమైన యాగ్రంథములో విమాననిర్మాణాది విజ్ఞానముకలదు. సుందర, శకున, రుక్మములను మూడువిధములైన విమానముల చిత్రపటములుకూడ కలవు. ఈ గ్రంథ

ములో 8 అధ్యాయములు, 500 సూత్రములు కలవు. అగ్నికి లొంగని విమానములనిర్మాణముకూడ నిందు వర్ణింపబడినది.

1914–18 నాటి మొదటి ప్రపంచ యుద్ధకాలములో తొలిసారిగా విమానములను పాశ్చాత్యులు దర్శించిరి. ఈ శతాబ్దికి పూర్వము ఆకాశయానము సాధ్యమనికూడ పాశ్చాత్యులు భావింపలేదు. మన దేశములో రామాయణములోని పుష్పకవిమానము, పురాణములలో కొన్నిసందర్భముల పేర్కొనబడిన విమానములును అతిప్రాచీనకాలమునకు సంబంధించియున్నవి. ఈనడుమకాలములో విమానముల ప్రసక్తి యంతగా కన్పట్టకపోయినను విమానవిద్యాపారంపర్యము పూర్తిగ విచ్ఛిన్నము కాలేదు. అరువది సంవత్సరములక్రిందట బొంబాయిలో జరిగిన యొక సంఘటనము ఆశ్చర్యమును గల్గింపక మానదు.

1895వ సంవత్సరమున బొంబాయిలో చౌపతీసముద్రతీరమున శివకాంబాపూజీతల్పాడేయను పండితుడు విమానము నొకదానిని ప్రదర్శించెను. ఆవిమానము భరద్వాజమహర్షి రచించిన వైమానికశాస్త్రము ననుసరించి నిర్మింపబడినది. ఈ ప్రదర్శనము చూచుటకు వచ్చినవారిలో బరోడామహారాజు, మహాదేవ గోవిందరణడే మున్నగు వారుండిరి. ఆ విమానము 1500 అడుగుల యెత్తునకు ఎగురుటనుకూడ వారు చూచిరి: ఆ పండితుని సత్కరించిరి. కొంతకాలము తర్వాత నా విమాన మొక యింగ్లీషుకంపెనీకి అమ్మివేయ

బడెను. (ఈ పూర్వపు సమాచారమును సేకరించి 31-10-'52 నాటి దివ్యవాణి పత్రిక-సికింద్రాబాదు) ప్రకటించినది.

## ఆ యు ర్వే ద ము

ఆయుర్వేదములోని వస్తుగుణవిజ్ఞానమునకు నేడు అన్ని వైద్యవిధానముల వారును జోహారు చేయుచున్నారు. ఈశ్వర సృష్టిలో భారతదేశమునకు బహుముఖ ప్రాముఖ్యము కలదు. హిమాలయ పర్వతములలో లభింపని యోషధిలేదు. ప్రపంచములో నేయే దేశములలో నేయే యోషధులు లభించుచున్నవో యవి యన్నియు హిమాలయములలో లభించును.

పాదరసమును చికిత్సలో వాడు పద్ధతి యితరజాతుల కంటె భారతీయులకే ముందుగా తెలియునని సర్. పి. సి. రే. స్పష్టపఱచి యున్నారు. (Hindu Chemistry' Vol I. Introduction)

బంగారమును శరీరములో నిముడునట్లు సంస్కారములను గావించి యుపయోగించుట భారతీయులకు మాత్రమే తెలియును. ఇది సాధ్యమనికూడ నితరులు నమ్మజాలకుండిరి. నేటికి అలోపతీవైద్యులు ఈ విధానమును తమ చికిత్సాపద్ధతిలోనికి తీసికొనుచున్నారు.

ఆయుర్వేదము దోషములులేని శాస్త్రము. పాశ్చాత్య వైద్యశాస్త్రము ఆనాటి కానాడు తనలోని లోపములను దిద్దికొనుచు నూతన విజ్ఞానమును సంపాదించుకొనుచు వృద్ధినొందు

చున్నది. ఆయుర్వేదము మహర్షులచే ప్రసాదింపబడి నందున నందు దోషములనుచూపుట యెవ్వరికిని సాధ్యమగుటలేదు. కావున దీనికి కావలసిన పరిశోధన (రిసెర్చి) వేరువిధమైనది. ఏబది సంవత్సరముల క్రింద రచింపబడిన అలోపతీ గ్రంథమును నేటి అలోపతీ విజ్ఞానదృష్టితో చూతుమేని యందనేక దోషములుండును. కాని వేలకొలది సంవత్సరముల క్రిందట రచింపబడిన చరక, శుశ్రుతాది గ్రంథములలో దోషముల నెవ్వరు చూపజాలరు. కావున ఆయుర్వేదమునకు కావలసిన పరిశోధన పూర్వగ్రంథముల అన్వేషణమునకును, పూర్వులు ప్రతిపాదించిన విషయముల నాధారముగా చేసికొని నూతనానుభవములను సంపాదించుటకును సంబంధించినదిగా నుండవలయును.

ప్రాచీనకాలమున ఆయుర్వేదపండితులు ప్రపంచము లోని అన్ని దేశములకును నేగి చికిత్సలోను ఆచార్యత్వములోను గణ్యతను గాంచిరి. క్రీ.శ. 465 వ సంవత్సరప్రాంతమున అలెగ్జాండ్రియా(ఈజిప్టు)విశ్వవిద్యాలయములో ఆయుర్వేదాధ్యాపకుడుగా నుండిన యొకభారతీయ పండితుడు ఒక విచిత్రమైన యోషధిని ప్రదర్శించెను. ఆయోషధిని శరీరమునకు పూయుచో నన్నియవయవములు ప్రకాశవంతములగును: అద్దమునందు వలె శరీరములోని భాగములన్నియు స్పష్టముగా పైకి కనపట్టును. ఆకాలములోనే స్పెయిన్‌లోని కార్డొవా విశ్వవిద్యాల

యములో భారతీయాయుర్వేదపండితు డాచార్యపీఠమున నుండెనని యా దేశపు చరిత్ర చెప్పుచున్నది.

వైద్యశాస్త్రము మరి యే దేశమునుండియు, భారత దేశమునకు రాలేదనియు, భారత దేశమునుండియే యితర దేశములకు వ్యాపించెననియు నిర్వివాదముగ చారిత్రికు లంగీకరించుచున్నారు.

చరక శుశ్రుతగ్రంథములు క్రీ. శ. 8వ శతాబ్దములో అరబిక్ భాషలోని కనువదింపబడినవి.

పశువైద్యశాస్త్రము క్రీ. శ. 11వ శతాబ్దిలో టిబెట్ అరబ్బీ భాషలలోనికి పరివర్తింపబడెను. 14వ శతాబ్దిలో అశ్వచికిత్సాశాస్త్రము పర్షియనులోని కనువదింపబడెను.

అశోక శాసనములనుబట్టియు, ఫాహియాన్ వ్రాసిన వ్రాతలను బట్టియు ఆ కాలములలో పశువైద్యశాలలీ దేశమున విరివిగా నుండెనని తెలియుచున్నది.

"చెవి, ముక్కు, పెదవులు మున్నగు భాగములు తెగి పోవుటవలనకాని, తీసివేయుటవలనకాని వాని స్థానమున క్రొత్త అవయవములనుంచువిద్య భారతీయులకు తెలిసినట్లు మరి యే దేశస్థులకును తెలియదు. ఈ శస్త్రచికిత్సాపద్ధతి 18 వ శతాబ్దిలోకూడ యూరపియనులు భారతీయులనుండి నేర్చుకొనిరి. ఈస్టిండియా కంపెనీ సర్జనులు (శస్త్రచికిత్సకులు) ఈ విద్యను భారతీయవైద్యులనుండి నేర్చుకొనిరి.

(Indian Inheritance Vol III P. II

1818వ సం॥ అక్టోబరు 10 వ తేదీని ఉత్తరభారత మందలి మథురనుండి తన దేశీయులకు ఒక పాశ్చాత్యుడు వ్రాసిన లేఖయొకటి యానాడు భారతీయవైద్యులు శస్త్ర చికిత్స నెంత నైపుణ్యముతో చేయుచుండిరో తెలుపుచున్నది. ఈలేఖ 1819 జూలై ఏషియాటిక్ జర్నల్‌లో ప్రకటింపబడి నది; "ఇక్కడ నొక దేశీయవైద్యుడు నైపుణ్యముతో శస్త్ర ప్రయోగము (సర్జికల్ ఆపరేషన్) చేసెను. ఒక పిల్లవాని శరీరములో నొక రాయి యున్నట్లాతడు అద్భుతముగా కను గొనెను. ఆతడాబాలునిశరీరముమీద నాటుపెట్టి యారా యి దానంతట నదియే బయటకు వచ్చిపడునట్లు చేసెను. చిన్న పట్టుకారుతో తీయబడునప్పుడు కలుగుబాధ కూడ లేక పోయెను. ఇది నాల్గవదినము. బాలునకు జ్వరముకూడలేదు."

భారత దేశమునకు బయటకూడ ఆయుర్వేదవిశిష్టత యేరీతిగా గుర్తింపబడుచున్నదో చూడదగును. 13-5-1956 తేదీని జినీవాలోజరిగిన తొమ్మిదవ ప్రపంచారోగ్యమహా సభలో సింహళదేశపు ఆరోగ్యశాఖామంత్రిణి శ్రీమతి విమల విజెవార్డెనే యిట్లు నుడివియున్నది: "శరీరములో రోగప్రతి ఘటనశక్తిని పెంపొందించుటద్వారా ఆరోగ్యమును సంపా దించుపద్ధతి యాయుర్వేదములో కలదు. పాశ్చాత్యదేశవాసు లైన మీరు సాంక్రామికవ్యాధులను అదుపులోనికి తేగల్గిన మాట వాస్తవమే. కాని మీరందుకొఱకు వాడుచున్న క్రొత్త క్రొత్త యౌషధములు నూతనరోగములను పుట్టించు

చున్నవై యనారోగ్యచరిత్రలో నొక నూతన శకమును ప్రారంభింప చేయుచున్నవి. ప్రాచీనాయుర్వేద విధానము వలన నిట్టి యనర్థములు కలుగవు. కావున ఆధునిక ప్రపంచము ఆయుర్వేదమువలన గొప్ప ప్రయోజనమును పొందగలదు."

"ప్రపంచవాసులందరిలోను భారతీయులు హెచ్చు కాలము జీవించుచుండిరి. 170 సంవత్సరములు, 200 సంవత్సరములుకూడ వారు జీవించుచుండిరి." అని క్రిండిల్ అను నాతడు తన Ancient India అనుగ్రంథమున (పుట 25) వ్రాసియున్నాడు.

ఆయుర్వేదములోని స్వస్థవృత్తవిధుల యొక్కయు చికిత్సాదులయొక్కయు పటిష్ఠత కిది ప్రబల నిదర్శనము.

## వికీర్ణశకలములు

పదార్థవిజ్ఞానశాస్త్రము, రసాయనశాస్త్రము, ఖగోళ భూగర్భశాస్త్రములు మున్నగునవి ప్రాచీన భారతదేశములో నెంతవఱ కుండెనను విచారణము గావించునపుడు ఆయా శాస్త్రములపై నేటికిని నిలచియున్న గ్రంథములను పరిశీలించిన చాలదు. ఆశాస్త్రముల కేమియు సంబంధములేని గ్రంథములలో ప్రాసంగికముగా వచ్చిన విజ్ఞానాంశములను, పరంపరగా వచ్చుచున్న ఆచారములలోని విజ్ఞాన సంపత్తినికూడ పరిశీలింపవలసి యుండును. చెదురుగా పడియున్న యీవిజ్ఞాన శకలములనుబట్టి యాయా కాలములలో నాశాస్త్రము లెంత యున్నతస్థితిలో నుండెనో మనకు తెలియగలదు. చెదురుగా

నున్న యంశములే యింత గొప్పగా నున్నచో నాయా శాస్త్రములపై నెంతగొప్ప పరిమాణగ్రంథములుండెనో మన మూహించుకొనవచ్చును. ఈవిజ్ఞాన శకలములను వెల్లడించిన ఋషుల యలౌకికదృష్టి కెంతయున్నత విజ్ఞానము అందుబాటులో నుండెనోకూడ మనకు తెలియగలదు.

ఈ విషయమును నిరూపించు నంశములు శతసంఖ్యాకములున్నను నాల్గయిదింటిని మాత్ర ముదాహరించుచున్నాను.

భూకంపములు గల్గుటకు కారణమేమో యాధునిక శాస్త్రము లింకను కనుగొనలేదు. అగ్నిపర్వతము బ్రద్దలగుట యొక కారణముగా చెప్పబడినది. అదియైనను సందేహాభరితము. అగ్నిపర్వత మెక్కడ బ్రద్దలైనదో యక్కడనే భూమి కంపింపక పోవచ్చును. అసలే కంపింపక పోవచ్చును. మరియు అగ్నిపర్వతము బ్రద్దలైనతర్వాత ఎంతకాలమునకైనను భూమి కంపింపవచ్చును, వీనికి తీసిపోని కారణమొకటి వాల్మీకిరామాయణములో చెప్పబడినది. అమావాస్యా పర్వదినము, భూకంపమున కనుకూలదినమని రామాయణమువలన తెలియుచున్నది.

యదా పర్వణి కాకుత్స్థ
విశ్రిమార్థం మహాగజః
ఖేదాచ్చాల యతేశీర్షం
భూమికంప స్తదా భవేత్.

(శ్రీమద్రామాయణము 1–40–15)

ప్రతిదర్శకును భూమి కంపించునని దీని తాత్పర్యము కాదు. భూకంపమునకు ఎక్కువ అవకాశముగల తిథులలో అమావాస్య ముఖ్యమైనది. ఆశ్చర్యమేమన:- ఇటీవల సంభవించిన పెద్ద భూకంపము లనేకములు అమావాస్యనాడు సంభవించినవి. 1934 జనవరి బీహారు భూకంపము పుష్యబహుళామావాస్యనాడు వచ్చినది. క్వెట్టా భూకంపము (1–1–1935) అమావాస్యనాడు వచ్చినది. ఈక్వడారు భూకంపము (14–6–1942) అమావాస్యనాడు వచ్చినది. 'దివ్యవాణి' విజయ సంచికలో శ్రీ ఒంగోలు మునిసుబ్రహ్మణ్యము గారు ఈరీతిగ ఆధునికులు భూకంపమునకు చెప్పిన హేతువులకు తీసిపోని హేతువు రామాయణములో నున్నదని మనమనుకొనియుండము. రామాయణ కావ్యమునకును భూకంపమునకును సంబంధము కన్పట్టదు. కాని యీరీతిగా మన ప్రాచీనగ్రంథములలో ప్రసంగవశమున చెప్పబడిన వైజ్ఞానికాంశములు ప్రాచీనుల మహత్తర వైజ్ఞానికౌన్నత్యమునకు ప్రబలనిదర్శనములు.

అట్లే రామాయణకాలములో శస్త్రచికిత్సావిజ్ఞానమెంత వృద్ధిలోనుండెనో యీక్రింది శ్లోకమువలన తెలియుచున్నది.

నూనం సమాంగాన్య చిరాదనార్యః
శస్త్రైః శితైశ్ఛేత్స్యతి రాక్షసేంద్రః ॥
తస్మిన్ననాగచ్ఛతి లోకనాథే
గర్భస్థజంతోరివ శల్యకృంతః ॥

"రామచంద్రుడు త్వరలో రానిచో రావణుడు నన్ను ముక్కముక్కలుగా కోయును" అని సీతాదేవి హనుమంతునితో నిట చెప్పుచున్నది. శస్త్రవైద్యుడు తల్లిప్రాణమునకు భయమువచ్చునపుడు, గర్భములో శిశువు మరణించునపుడు, ఆశిశువును గర్భములోనే ముక్కలుగా చేయునట్లు తన్ను రావణుడు చిన్నచిన్నముక్కలుగా చేయునని సీత యిక్కడ చెప్పుచున్నది. సంఘములో నట్టి శస్త్రవైద్యము లేకుండినచో నట్టి యుపమానము అసంభవము, ఉపమానకోటిలో చేరదగినది ప్రసిద్ధముగాకూడ నుండవలయును.

యుద్ధములో కాలు తెగినవానికి ఇనుప కాలు నతుకుట ఋగ్వేదములో కన్పట్టుచున్నది. ఖేలుడను రాజునకు యుద్ధములో కాలు తెగిపోగా అశ్వినులాతనికి ఇనుప కాలు నతికినారు. (1–116–15)

యజ్ఞకర్మకును గణితశాస్త్రమునకును సంబంధముండునని యూహింపము. కాని యజ్ఞప్రక్రియను తెలుపు ఆపస్తంబ శుల్బసూత్రములో రేఖాగణితశాస్త్రజ్ఞానమునకు సంబంధించిన విజ్ఞానము విశేషముగా కన్పట్టుచున్నది. (ఈ యధ్యాయములోనే "గణితశాస్త్రము" చూడదగును.)

తన్నిమిత్తో నిర్హ్రాసో వివృద్ధిర్వా" (సూ. 6) "దీర్ఘస్యాక్ష్ణయా రజ్జుః పార్శ్వమానీ తిర్యఙ్మానీచ యత్పృథగ్భూతే కురు తదుభయంకరోతి."

"చతురశ్రస్యాక్ష్ణయారజ్జుర్ద్విస్తావతీం భూమింకరోతి, సమస్యద్వికరణీ ప్రమాణం తృతీయేనవర్ధయేత్తచ్చతుర్థేనాత్మ చతుస్త్రింశోనేన సవిశేషః" (కపర్ది కరవింద సుందరరాజ భాష్యములతో మైసూరు విశ్వవిద్యాలయము ప్రచురించిన ఆపస్తంబశుల్బసూత్రము చూడనగును.) గణితములో ప్రత్యేక శ్రద్ధగలవారి పరిశీలనమునకీయంశమును సూచించి విడచుచున్నాను.

మన ధర్మగ్రంథములలో గ్రహణసమయమున ఆహారము తీసికొనరాదని యున్నది. ఇంకను ఎన్నియో పనులు గ్రహణసమయమున నిషేధింపబడినవి. సూర్యచంద్రులపై మచ్చలు కన్పట్టుటకును మన శరీరావయవములకును ఏమి సంబంధమని కొందరు విమర్శించుచుండిరి. ఇంతలో సైన్టిస్టులు సూర్యగ్రహణసమయమున రేడియోధ్వనులు సరిగా వినబడుటలేదని కనుగొనిరి.

15-2-49 తేదీని మదాసుప్రభుత్వ వాతావరణశాఖవారు గావించిన యీక్రిందిప్రకటన చూడదగును: "రాబోవు మూడుదినములలో సూర్యునిలోని మచ్చలు భూమికెదురుగా వచ్చును. తత్ఫలితముగా రేడియోధ్వనులు సరిగా వినబడవు. అవికర్కరధ్వనులతో కూడుకొనియుండును." సూర్యునిపై కన్పట్టు మచ్చలవలన మన యింద్రియములపైనను విశ్వముపైనను గూడ మార్పువచ్చునని యిప్పుడు గుర్తింపబడినది.

20–6–1955 వ తేదీ ఉదయము 7–15కు సూర్య గ్రహణముపట్టెను. సుమారు అదేసమయమున రాజస్థానమందలి జయపూరులో జంతుప్రదర్శనశాలలో పులివద్ద ఆహారముంచబడెను. ప్రతిదినము ఆసమయమున పులి ఆహారము నుత్కంఠతోవచ్చి తినుచుండెను; ఆనాడు తినలేదు. కావలివాడా యాహారమును మరికొన్ని జంతువులకు పెట్టబోగా నవియు తినలేదు. గ్రహణసమయమున ఆహారమును తినరాదని వాసన (Instinct)చేతనే కొన్ని జంతువులు తెలిసికొన్నవి. జంతువులు వాసనవలన తెలసికొను కొన్నివిషయములను విజ్ఞులైన మానవులు శాస్త్రమువలన తెలిసికొందురని మన పూర్వులు చెప్పియున్నారు.

"గావః పశ్యన్తి గంధేన వేదైః పశ్యన్తి పండితాః"

నేడు మానవుడు శాస్త్రమును విడచి పెట్టుకొనుచున్నను జంతువులు వాసనను విడచిపెట్టుకొననందున మనుజునకు తెలియని సంగతులు కూడ జంతువులకు తెలియబడుచున్నవి.)

## గ్రంథోప సంహారము

హంపివంటి చారిత్రక ప్రాముఖ్యముగల ప్రదేశమున కేగి యటనట పడియున్న శిథిల చిహ్నములనుచూచి పూర్వపు వైభవమును మన మూహించుకొన గల్గుచున్నాము. అట్లే ప్రాచీన వాఙ్మయములో చెదురుగా పడియున్న విజ్ఞానలేశములను చూచి పూర్వపు వైజ్ఞానిక వైభవము నూహించుకొన

గల్గునుము. ఇదిగాక ప్రస్ఫుటముగా, వివరముగా కన్పట్టు చున్న యనంత విజ్ఞానసంపద యుండనే యున్నది.

ఇంత ప్రాచీన విజ్ఞానమును, ఇంత విపులమైనదానిని నిలబెట్టుకొన్న దేశము మరొకటి లేదు. కులక్రమాగత విద్యలను నేర్పుట ధర్మమనియు నేర్పకుండుట పతనహేతువనియు భారతీయు లాదినుండియు భావించుచుండినందున నింత విజ్ఞానమును వారు కాపాడుకొన గల్గిరి. మరి యేదేశములోను ప్రాచీనవిజ్ఞాన మింతగా రక్షింపబడలేదు.

పూర్వమొకప్పు డింత విజ్ఞానముండెనని నమ్మని యాధునికులు కొందరు కలరు. వెనుకకు పోయినకొలదియు కాలము అజ్ఞానమయమని తలచు నిట్టివారిసంఖ్య క్రమముగా తగ్గుచున్నది. నేటి వైజ్ఞానికులలో మేటియైన వారనేకులు విజ్ఞాన స్రవంతి తరచుగా ముందువెనుకలకు మెలికలు తిరుగుచునే ప్రవహించుచుండెనని యభిప్రాయ పడుచున్నారు. "The river of knowledge has too often turned back on itself." (Sir Jamee Jeans, in his Mysterious Universe) ఈ యభిప్రాయముగల కొందఱు నవీన వైజ్ఞానికులు ప్రాచీన విజ్ఞానములోని విశేషములను తెలిసికొనుటకు ప్రయత్నించుచున్నారు. క్రమముగా ననేక విశేషములు బయటపడుచు వారి నాశ్చర్యపఱచుచున్నవి. కావున కాలము ముందునకు పోవుచుండగా మనము వెనుకకు చూచుటవలన ప్రయోజనము లేదను వాదము క్రమముగా సన్నగిల్లుచున్నది.

అనంతమైన ప్రాచీన భారతీయ విజ్ఞానమును సమీక్షింపదలచిన గ్రంథకర్త యేదృక్పథముతో సమీక్షించినను అది సమగ్ర పర్యాలోచనము కాజాలదు. కేవలము ప్రాచీన గ్రంథములను పేర్కొనుటకైనను ప్రస్తుతగ్రంథపరిమితి చాల దనినప్పుడు ఈగ్రంథములో విజ్ఞాన సమీక్ష యెంత స్వల్పముగా జరిగినదో వేరుగ చెప్పనక్కఱలేదు. భారతీయధర్మమును గురించి నేను ప్రత్యేకముగా హిందూమతమను గ్రంథమును ప్రకటించి యుండుటచేతను, భారతీయదర్శనములను గురించిన నాగ్రంథము ప్రకటింపబడనున్నందునను నే నీగ్రంథమున ధార్మిక దార్శనిక విచారణమును గావింపలేదు.

భిన్నభిన్న సంస్కారములు, అభిరుచులు, దృక్పథములు గల గ్రంథకర్తలచే రచింపబడినను, ఇట్టి గ్రంథములు సహస్రసంఖ్యాకములుకూడ ప్రాచీన భారతీయ విజ్ఞాన స్వరూప స్వభావములను పర్యాప్తముగా ప్రదర్శింపజాలవు. ఈ గ్రంథములోని విషయవిభాగము, ప్రతిపాదనపద్ధతి, విషయ సేకరణము కేవలము నా యభిరుచులమీదను, అనుభవము మీదను, దృక్పథముమీదను ఆధారపడియున్నది. ఇట్లొకే వ్యక్తిచే రచింపబడిన యింత చిన్నగ్రంథము అనంత విజ్ఞాన సమీక్ష గావించుటలో నెంత పరిమిత ప్రయోజనము కలదిగా నుండునో నేను గుర్తించియే యున్నాను.

ఈ గ్రంథమును రచించుటలో అన్యగ్రంథములనుండి నే నుదాహరించిన వచనములకును భావములకును ప్రక్కనే

యా గ్రంథనామములను స్థలనిర్దేశమును చేసియున్నాను కాన వేఱుగా ఆధారగ్రంథముల పట్టికను ఈయలేదు. ఏయయి దాఱు వచనములో తప్ప మిగిలినవన్నియు నాచే మూలగ్రంథములనుండి యుద్ధరింపబడినవే కాని యన్యుల గ్రంథముల నుండి యుద్ధరింపబడినవి కావు.

---

# ౬. భారతీయ సంస్కృతి ప్రభావితులైన పాశ్చాత్యులు

## (అనుబంధాధ్యాయము)

కొన్ని శతాబ్దములు పరపరిపాలనములో నుండిన భారతీయులలో పలువురు స్వీయసంస్కృతిని నిరసించి పరసంస్కృతి నాశ్రయించుటలో నాశ్చర్యములేదు. కాని పాలితజాతిగానుండి ప్రపంచములో నెట్టి గౌరవప్రపత్తులును లేక దారిద్ర్యముచే కుగ్రింగి, ఎట్టి తళుకుబెళుకులును లేని భారతీయుల సంస్కృతి సంప్రదాయములచేత సకలైశ్వర్యభరితమై, రాజకీయౌన్నత్య విరాజితమై ఆధునిక విజ్ఞాననిలయమై భోగభాగ్యాలవాలమై యొప్పారు పాశ్చాత్యప్రపంచమునకు చెందిన మహామేధావులు కొందరాకృష్టులై, ఉద్దీపితులై, ప్రభావితులై, ప్రహ్వీ

భావముతో వాని నాశ్రయించినారనుట మిక్కిలి యాశ్చర్య కరమైనది. ఇట్లాశ్రయించినవారిలో హెచ్చుమంది అసాధారణ మేధాసంపన్నులు; పాశ్చాత్యవిద్యాపారంగతులు, విశేషించి శీలసంపన్నులు; అట్టి యుత్తమశ్రేణికి చెందినవారిచేత మాత్రమే తెలిసికొనదగిన సంస్కృతిసంపత్తిని భారతదేశము నిలబెట్టుకొన్నది.

చరిత్రకందని ప్రాచీనకాలములోను, చారిత్రక ప్రాచీన మధ్యయుగములలోను భారతీయప్రభావము విరివిగా వివిధ దేశములమీదికి ప్రచురించుచునే యుండెను. మనమిప్పుడు విచారించునది గడచిన రెండుశతాబ్దముల చరిత్రకుమాత్రమే సంబంధించినది. కొన్నిశతాబ్దముల విలీనస్థితికి పిమ్మట తిరిగి 18 వ శతాబ్దిలో సంస్కృతము యూరపులో వ్యాపింపదొడగినది. ఈ రెండుశతాబ్దములలోను వందలకొలది పాశ్చాత్యులు, అన్ని దేశములకు చెందినవారును, సంస్కృతభాషను, సాహిత్యమును తర్కవ్యాకరణ మీమాంసాది శాస్త్రములను, వేదములను,అది యిది యననేల, సమస్త సంస్కృతవాఙ్మయమును అవలోడనముచేసి, లిఖితప్రతులనుముద్రించియు, వానికి పీఠికలను వ్రాసియు,అనువాదములను ప్రకటించియు బహుళకృషి గావించిరి. ఆకృషినంతను కాదు సరికదా యందు కొంతభాగమునుగూడ నిచట నిరూపించుటకవకాశములేదు. సామాన్యాకారముగా భారతీయ సంస్కృతిచే ఉద్దీపితులై

పరిభావితులైన కొందరు పాశ్చాత్యులు ముఖ్యముగా స్మరణార్హులగుటచే వారిప్రశంస యిట గావింపబడుచున్నది. వీరిలో కొందరు సంస్కృతములో మహావిద్వాంసులు; కొందరు సామాన్య జ్ఞానము గలవారు.

## మా క్సు ము ల్ల ర్

పాశ్చాత్య సాంస్కృతికు లెల్లరిలోను శిఖామణియన దగినవాడు మాక్సుముల్లరు. యావజ్జీవము సంస్కృత సాహిత్యములో కృషిచేసినవారు చాలమంది కలరు; కాని ఈయన వలె ఆనందపారవశ్యముతో భారతీయ సంస్కృతిని గ్రోలిన వారరుదు. ఈయన 1823లో జర్మనీలో జన్మించి లీప్జిగ్ విశ్వవిద్యాలయములో సంస్కృతమును నేర్చెను. పిమ్మట విశ్వవిఖ్యాతుడైన ప్రొఫెసర్ బాప్‌వద్ద బెర్లిన్ విశ్వవిద్యాలయములో భాషాసాదృశ్యశాస్త్రము నధ్యయనము చేసెను. తరువాత పారిస్ పట్టణమున జెండవెస్తాలో గాఢమైన కృషిచేసెను. 1848లో నాతడు ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయములో ఆచార్యుడుగా చేరెను. 1846 నుండి 1900 సంవత్సరమువరకు 54 సంవత్సరములు ఇంగ్లండులోనే యుండెను.

మాక్సుముల్లరు రచించిన గ్రంథములలో ముఖ్యముగా పేర్కొనదగినవి; The Six Systems of Indian Philosophy· India: What Can it Teach us ?, Comparative Mythology Gifford Lectures, The Savage, History of Ancient

Sanskrit Literatureమున్న గునవి. ఇందు India: What Can It teach us అను గ్రంథము భారతదేశ పరిపాలకులుగా రాదలచి లండనులో ఐ. సి. యస్. పరీక్షకు వెళ్ళు విద్యార్థులకు ఉపన్యాసరూపముగా మొట్టమొదట మాక్సుముల్లరుచే బోధింపబడినది. తరువాత చాల సంవత్సరములు ఆపరీక్షకు నిది పాఠ్యగ్రంథముగా నుండెను.

మాక్సుముల్లరు సంపాదకత్వమున వెలువడిన బహు గ్రంథములలో ఋగ్వేద సాయణభాష్యమొకటి. దీని ప్రచురణమునకువిజయనగరాధీశ్వరులు శ్రీ ఆనందగజపతి మహారాజు ధనము నొసగిరి. Sacred Books of the East Series అను గ్రంథమాలను నెలకొల్పి మాక్సుముల్లరు ప్రచురించిన 51 గ్రంథములు భారతీయ విజ్ఞానము ప్రపంచములో వ్యాపించుటకు మిక్కిలి తోడ్పడినవి. ఇంత దీర్ఘకాలము సంస్కృత వాఙ్మయములో కృషిచేసి యిన్నిగ్రంథములను ప్రచురించిన పాశ్చాత్యులరుదు.

యూరపుఖండములో మాక్సుముల్లరుకుండిన ఖ్యాతి నిరుపమానము; రాజకుటుంబములలోకూడ నీయనకు విశేష గౌరవముండెను. అన్నింటికిని తగిన శీలసంపత్తి గలవాడగుటచే పాశ్చాత్యసాంస్కృతికులలో నీయనస్థాన మద్వితీయము.

మాక్సుముల్లరు తనపేరును "మోక్షమూలర భట్టః" అనికూడ వ్రాసికొనుచుండెను. తాను ఆక్స్‌ఫర్డ్ వాసి యగు

టచే "గోతీర్థవాసీ" యని తన్ను గూర్చి చెప్పుకొనుచుండెను. (Ox=గో, Ford=తీర్థ = రేవు)

శర్మణ్యదేశజాతేన గోతీర్థ నివాసినా
మోక్షమూలర భట్టేన భాష్యమేతద్విశోధితం.

అని యాతడు తాను ముద్రించిన ఋగ్వేదగ్రంథమున వ్రాసికొనెను.

హంసకు పద్మవనములో సంచరించుట యెట్టి విలాసమో మాక్సుముల్లరుకు సంస్కృతవాఙ్మయములో విహరించుట యట్టి వ్యసనము. భారతదేశ విజ్ఞానముపై నింత భక్తి గలవాడగుటచే నొక్కసారి ప్రత్యక్షముగ భారతదేశమును దర్శింపవలయునని కొందరు భారతీయమిత్రులాయన నను కోరిరి. ఆయన వారి కిట్లు సమాధానము వ్రాసెను: "వేదములను, ఉపనిషత్తులను ధర్మగ్రంథములను, రామాయణ మహాభారతాదులను నిరంతరము నేను మననము చేయుచుండుటచే నా హృదయము ప్రాచీన భారతీయవిజ్ఞాన వాతావరణముచే నుత్తేజితమై యున్నది. ఉపనిషత్తుల ఉన్నత సందేశము, కణ్వాశ్రమ మనోహరదృశ్యము మున్నగువాని స్మరణచే నేను నామనస్సులో నెలకొల్పుకొన్న భారతదేశములోనే యుండి ప్రాణము వదలదలచినాను; కాని యిటీవల ఆధ్యాత్మిక సౌభాగ్యమును కోల్పోయి, పాశ్చాత్యుల పద్ధతులలోనికే మారిపోవుచున్న ప్రజలతో కూడిన, భారతదేశమునుచూచి యాస్మర

ణతో ప్రాణమువీడుట నాకిష్టములేదు.” భారతీయసంస్కృతికి పాశ్చాత్యుడు చేయగలజోహారు దీనిని మించి యుండజాలదు.

ప్రపంచములో భారతీయవిజ్ఞానమునకు నిరుపమనస్థానము గలదను భావమును మాక్సుముల్ల రీ క్రిందివాక్యములలో తెలిపియున్నాడు:

“ప్రపంచములోని కెల్ల ప్రకృతిదేవత యొసగ గల యైశ్వర్యమును, శక్తిని, సౌందర్యమును సంపూర్ణముగా గల్గియున్న దేశము నన్వేషింపవలసియున్నచో, భూతలస్వర్గమేయని చెప్ప దగిన ప్రదేశములను గొన్నింటిని గల్గియున్న దేశ మెద్దియో నేను చెప్పవలసియున్నచో, భారత దేశమునే నిర్దేశింపగలను; వీప్రదేశములో మానవుడు తన ఉత్తమశక్తులను కొన్నింటిని పరిపూర్ణముగా వికసింపచేసికొనెనో, ఘనతమములైన మానవ జీవిత సమస్యలపై లోతైన విచారముచేసి ప్లేటో, క్యాంట్, మున్నగువారి గ్రంథముల నధ్యయనము చేసినవారుకూడ గ్రహించుకొనవలసిన పరిష్కారములను కనుగొనెనో చెప్ప వలసినదని నన్నడుగుచో నేను భారతదేశమునే చూపింప వలసియుండును. గ్రీకు, రోమను భావములచే పోషింపబడిన యూరపువాసులమగు మనమును, సెమిటిక్ యూదుజాతీయులును ఆంతరంగిక ప్రకృతిని లోపరహితముచేసికొని, విశాల మును విశ్వజనీనమును, ఇంతకంటె మానవార్థమును గావించుకొనుటకును, జీవితమునైహికము కొరకే కాక అమరత్వము

కొంతకుగూడ పరిణామింప చేసికొనుటకును సహాయపడ గల సారస్వత మెక్కడ నున్నదని మీరు నన్నడుగుచో కూడ నేను భారతదేశమునే చూపింపవలసియుండును.

"మానవజాతియొక్క మనస్సునకు సంబంధించిన యే విషయమును నీవు ప్రత్యేకముగా పరిశీలించుటకు పూనుకొని నను—భాష, మతము, పురాణగాధలు, తత్త్వశాస్త్రము, ధర్మశాస్త్రము, ఆచారములు, ప్రాచీనకళలు, ప్రాచీనవిజ్ఞానము—అను వానిలో నే విషయమును నీవు పరిశీలింపజూచి నను భారతదేశమునకే వెళ్లవలసియుండును. నీకిష్టమైనను కాకపోయిననుగూడ నక్కడకే వెళ్ళవలసియుండును. ఎందు వల్లననగా మానవజాతి చరిత్రలో మిక్కిలి విలువగల్గినట్టియు, మిక్కిలి ప్రబోధకమైనట్టియు సామగ్రి భారతదేశములో మాత్రమే నిక్షిప్తమై యున్నది."

బహుగ్రంథరచన ప్రచురణలచే ప్రపంచములో ప్రాచీన భారతీయవిజ్ఞానవ్యాప్తికి కృషిచేయుటయేకాక ఆనందపార వశ్యముతో పైరీతిగా భారతీయసంస్కృతికి జే జే లుపట్టిన మహాపురుషుని భారతీయులు తమలో నొక్కనిగా భావించు కొనుటయే కాక తమకు స్ఫూర్తిదాయకునిగాకూడ నెంచుకొని ఢిల్లీపట్టణమున1959సంవత్సరములో "మాక్సుముల్లరు హౌస్" అను వైజ్ఞానిక మందిరమును నెలకొల్పుకొన్నారనుటలో నాశ్చర్యము లేదు.

స్వామి వివేకానంద లండను పట్టణమున మాక్సుముల్లరు కతిథిగా నుండెను. ఆ విద్వాంసుని నిర్మల నిరాడంబర జీవితమును, భారతీయాదర్శాచరణశక్తిని వర్ణించుచు స్వామిజీ ముల్లరుదంపతుల గృహము అరుంధతీ వసిష్ఠులయాశ్రమమును తలపించెనని వ్రాసియున్నారు.

## డా క్ట ర్ అ ని బి సెం ట్

పూర్వజన్మలో తాను భారతదేశమున క్షత్రియోపాధిలోనుంటిననియు, రాబోవుజన్మలో బ్రాహ్మణోపాధిని ధరింతుననియు చెప్పిన పాశ్చాత్యవనిత అనీబిసెంటు.

ఈమె రచించిన భగవద్గీతాంగ్లానువాదము పాశ్చాత్య విద్యార్థికుల నెక్కువగా నాకర్షించినది. భారతీయ సంస్కృతికి చెందిన బహువిషయములమీద నీమె పరిశోధన గావించుటయేగాక బహుగ్రంథములను వ్యాసములను రచించినది. ఈమె యారితేరిన రచయిత్రి; ఉపన్యాసకురాలుగా అసమానమైన ఖ్యాతిని సంపాదించినది. ప్రపంచములోని ఆంగ్లభాషా వక్తలలో మొదటి నల్గురైదుగురిలో నీమె యొకతె.

సుమారు 40 సంవత్సరముల వయస్సున నీమె భారతదేశమునకు వచ్చి యిచటనే స్థిరపడిపోయెను. భారతదేశమునకు వచ్చుటకు పూర్వమే యీామెకు అంతర్జాతీయఖ్యాతి యుండెను. ఐర్లండు స్వాతంత్ర్యము నిమిత్తమై యుద్యమము నడిపినవారిలో నీమె యొక ప్రముఖురాలు. దివ్యజ్ఞాన సమాజ

మున అద్వితీయస్థానము నలంకరించి సర్వఖండములయందును నీమె పూజింపబడుచుండెను.

ఇట్టి జగత్ప్రసిద్ధురాలు, విద్యాధికురాలు, బహుసద్గుణ సామర్థ్యవిరాజితురాలు భారతదేశములో స్థిరపడి పాశ్చాత్య వేషమును విడచి, భారతీయవేషముధరించి, శ్రుతి స్మృతి పురాణేతిహాస పఠనములోను వాని మహాత్మ్యమును వెల్లడించుటలోను విశేషకాలము గడపుచు, వర్ణాశ్రమధర్మములను సమర్థించుచు, కర్మపునర్జన్మసిద్ధాంతములు సత్యములని ప్రపంచమునకు చాటుచు, హిందువుల ఆచారములు ఆధునిక విజ్ఞానమునకు (సైన్సుకు) అనుకూలములు మాత్రమేకాక అతీతములని కూడ నిరూపించుచు నిర్విరామమైన ప్రచారమును వేదికలమీదను, పత్రికలలోను, గ్రంథరచన మూలమునను చేయుటవలన శతాబ్దములుగా పరప్రభుత్వముచేతను, పరసంస్కృతి ప్రభావముచేతను అభిహతులై ఆత్మగౌరవమును కోల్పోయి నిరాశయులై, నిస్పృహులైన భారతీయులకు ఆత్మగౌరవము, జాతీయ విజ్ఞానప్రత్యయము పెరుగజొచ్చెను. హిందూసంస్కృతి పునరుజ్జీవనోద్యమము భారతదేశమందలి యన్ని ప్రాంతములలోను బయలుదేరెను. కొంతకాలము కాశీలోను, చాలకాలము మద్రాసులోను నీమె నివసించుటచేనా ప్రాంతములలో నీమె ప్రభావము హెచ్చుగా పడెను. ఆమె స్వరాజ్యోద్యమములోకూడ ప్రముఖనాయకురాలై 1917 లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభకు అధ్యక్షురా

లుగా నుండెను. ప్రపంచములోను భారతదేశములోను నంత ఖ్యాతినిపొందిన వ్యక్తి ప్రచారము చేయుటవలన భారత సంస్కృతికి ఆధునికులలో గలిగినంత యాదరము మరొక రీతిగా కలిగియుండెడిది కాదు.

అయిర్లెండులో జన్మించిన యీమె కీ జన్మలో భారతీయసంస్కృతితో సంబంధముగలుగుట కీ క్రిందిసంఘటనము కారణమాయెను. ఈమెకు రెండుసంవత్సరముల కుమార్తె యుండెను. ఆ బాలిక రోగముతో అపరిమితబాధ పడుచుండగా "భగవంతుడింత క్రూరుడా? ఏ దోషము చేసినదని యీ పిల్ల నిట్లు బాధపెట్టు చున్నాడు?" అని యామె చింతించి దాని సమాధానమునకై వివిధమతముల గ్రంథములను చదివెను. ఎక్కడను సమాధానము లభింపలేదు. తుదకు హిందూ గ్రంథములలో సమాధానము దొరికెను. ఈ పిల్ల యేదియో చేయుటవలననే యీబాధ వచ్చినదనియు, పూర్వకర్మ లేకుండ అనుభవము రాదనియు, అకృతాభ్యాగమము యుక్తి విరుద్ధమనియు, ఈ దేహములోనికి వచ్చుటకు పూర్వ మీ బాలిక చేసికొన్న కర్మనే యిప్పుడు అనుభవించుచున్నదనియు, నీమెకు స్పష్టముగా తెలిసెను. ఇదివరకు చేయబడినది పు డనుభవింపబడునట్లే ఇప్పుడు చేసినది ముందనుభవింపబడుననియు, కృతప్రణాశమనునది తర్కవిరుద్ధమనియు నీమె హిందూశాస్త్రములవలన తెలిసికొని సంతృప్తి చెందుటయే కాక యీమె కదివరకుండిన నాస్తిక్యముకూడ పోయెను.

దేహములు నశించి క్రొత్తవి వచ్చుచున్నను దేహాంతర్గతుడైన జీవుడు మారకుండుటచే కర్మచేసికొనువాడే అనుభవించుననియు, దీనివలన ఈశ్వరునకు నైర్ఘృణ్య వైషమ్యదోషములు నివారితములగుననియు నీమె గ్రహించి, కర్మఫల సిద్ధాంతమును జన్మాంతర సిద్ధాంతమును ప్రతిపాదించిన హిందూమతముమాత్రమే ఆధునిక విజ్ఞానసంపన్నులకు సంతృప్తి నీయగల్గునదని లోకమునకు చాటెను.

హిందూపురాణములలోని లోకాంతరమునుగూర్చిన వర్ణనలనుకూడ డాక్టరు బిసెంటు సమర్థించెను. తాను సూక్ష్మశరీరముతో పోయి లోకాంతరములను చూచితిననియు పాపపుణ్యములకు ఫలమును కొంత లోకాంతరములలోను కొంత జన్మాంతరములలోను అనుభవింపవలసి యుండుననియు, నీమె చెప్పుచుండెను.

ప్రపంచములోని యే యితర భాగములలోకంటె భారతదేశములో హెచ్చువ్యాప్తిలోనున్న శాకాహారము మానవ నాగరికతౌన్నత్యమునకు సూచికమని డాక్టర్ బిసెంటు తరచుగా చెప్పుచుండెను. అహింసా నియమములలో శాకాహారనియమము అనివార్యమైన భాగమని యామె బోధించెను. ఆమె బోధనపద్ధతియే విలక్షణముగా నుండెను. ఆహారముకొరకు జంతువులను హింసించుట యెంతదోషమో తెలుపుటకై యామె తన యనుభవములోని యీ క్రింది యంశములు తెలియజేసినది.

"న్యూయార్కు పట్టణములో మాంసముకొరకై చేయ బడునంత జంతుహింస మరి యేపట్టణములోను జరుగదు. నే నొకసారి ట్రెయినులో న్యూయార్కున కేగుచుండగా బండి నగరమును సమీపించి క్రమముగా శాఖానగరములలో (Suburbs) ప్రయాణము సాగించుచున్నను నేను నగర మెంతయో దూరమున నున్నదను అభిప్రాయములో నుంటిని. ఇంతలో హింసావాతావరణము నాకు పొడగట్టినది. ప్రాణములను కోల్పోవు జంతువుల దుఃఖతరంగములు వాతావరణములో నాకు పొడగట్టినవి. అప్పుడే న్యూయార్కు వచ్చినదాయని నేను చూడగా రైలు న్యూయార్కులో చాలదూరము వచ్చియున్నది."

మంత్రోచ్చారణమువలన అలౌకికశక్తి పుట్టుననియు పూజలలోను వివాహాదులలోను హిందువు లుపయోగించు మంత్రములలోని అర్థమును ఇతరపదములతో వెల్లడించి కర్మకలాపము నాచరించుకొనుచో సంపూర్ణప్రయోజన ముండదనియు కూడ నీమె స్పష్టముగా ప్రతిపాదించి మంత్రాక్షరముల యొక్కయు బీజాక్షరముల యొక్కయు మహిమచు చాటెను.

సాధారణముగా భారతీయ సంస్కృతిని పరిశీలించు వారు స్థూలాకారముగా సంస్కృతిని పరామర్శింతురేకాని లేశలేశములలోనికి వెళ్లి సర్వతోముఖమైన సారమును ఆస్వా

దింపరు. డాక్టరు బిసెంటుయొక్క భారతీయ సంస్కృతి పర్యాలోచనము సమగ్రమైనది.

## మ ను ల్యూ మ న్

స్విడ్జర్లండులోని జూరిచ్ పట్టణమున ఇండో జర్మానిక్ భాషలోను, సంస్కృతములోను ఆచార్యుడుగా కొలదికాలము క్రిందటివరకును (బహుశః నేటికినికూడ) ఉన్న మనుల్యూమన్ అనునాతడు పూర్వజన్మలోనే భారతీయ సంస్కారమును గల్గియుండెనా యనిపించును. ఆతడు తన కుమార్తెకు సీతాయని పేరుపెట్టినాడు! అతనిపేరు అన్నింటికంటె ఆశ్చర్యమైనది. హిందూధర్మశాస్త్ర కారుడైన మనువుయొక్కపేరే యాతనిది! ఆతని తండ్రి ఎర్నెస్టల్యూమన్ గొప్ప సంస్కృతవిద్వాంసుడు; జైనసాహిత్య పండితుడు. ఈ తండ్రికొడుకుల పరిభావమచట మరికొందరిపైకూడ పడినది. యునైటెడ్ నేషన్స్ సంస్థలో పనిచేయుచు గణ్యతను గాంచియున్న జీన్ హెర్బర్ట్ అట్టివారిలో నొకడు. ఆతడు హిందూమతాచారములనుకూడ పాటించును; గణేశుని పూజించును; సంస్కృత సాహిత్యము మీద 150 గ్రంథములను రచించెను. అందు చివరిది హిందూ పురాణములను గూర్చినది.

## ఎ డ్విన్ ఆ ర్నా ల్డ్

ఆంగ్ల పద్యకవితకు శాశ్వతాలంకారములై, ప్రపంచములో ఆంగ్లభాష నెరిగిన యెల్లరకును భారతీయసంస్కృతిని

తెలుపగల్గిన రెండు మహాకావ్యములను రచించినవాడు సర్. ఎడ్విన్ ఆర్నాల్డ్. ఈయన మధురాతి మధురమైన ఆంగ్ల పద్యములలోనికి Song Celestial అను పేర భగవద్గీత ననువదించెను; అట్లే Light of Asia అను పేర బుద్ధచరిత్రను రచించెను. ఇంకను ఎన్నియో గ్రంథములను రచించెను. ఈయన పూనా డెక్కన్ కాలేజికి ప్రిన్సిపాలుగా నుండెను. 1857 నాటి మ్యూటినీలో భయభ్రాంతులైన భారతీయుల కీయన చాల సహాయము చేసెను. భారతీయుల విశాలహృదయమును దయామయత్వమును ఈయన బహుస్థలములలో కొనియాడెను; దానికి కారణ మీయనలో కూడ నాగుణములు మిక్కుటముగా నుండుటయే. భారతీయుల కళాదృష్టి నీయన హెచ్చుగా ప్రశంసించెను. భారతీయ పతివ్రతామతల్లుల చరిత్రలను ఆంగ్లములో రచించెను. ఈయన యనేక విధముల భారతీయాచారములనే యనుసరించెను. 1904లో నీయన లండనులో చనిపోయెను. ఈయన వెల్లడించియున్న కోరిక ననుసరించి యీయన మృతదేహమునకు అగ్నిసంస్కారము చేయబడెను.

## రాల్ఫ్ టి. హెచ్. గ్రిఫిత్

గ్రిఫిత్ ఆక్స్ఫర్డ్‌లో ప్రొఫెసర్ విల్సన్‌వద్ద సంస్కృతము నేర్చెను. కాశీలోని క్వీన్స్ మేరీ కాలేజిలో 20 సంవత్సరములు ప్రిన్సిపాలుగా పనిచేసెను. తరువాత సంయుక్తరాష్ట్ర

ములలో (నేటి ఉత్తరప్రదేశ్ లో) విద్యాశాఖ డైరెక్టరుగా పనిచేసి 1885లో విశ్రాంతి తీసికొనెను. ఈతడు రామాయణ మహాభారతాది గ్రంథములలోని భాగములకును, ఋగ్వేద యజుర్వేద మంత్రములకును ఆంగ్ల పద్యానువాదము గావించెను. ఈయన వస్త్రధారణములోను, కేశఖండనములోను కాశీపండితుల యాచారము నవలంబించుచుండెను. జీవితమంతను హిందూమతగ్రంథ పరిశోధనములోనే గడపెను.

## సర్ థామస్ మన్రో

కొందరు పాశ్చాత్యులు గ్రంథపఠనము ద్వారా భారతీయ సంస్కృతి నలవరచుకొనగా మరికొందరు భారతీయ ప్రకృతితోనే జన్మించిరి. ఇట్టివారిలో సర్ థామస్ మన్రో యొకడు. ఈ యాంగ్లేయుడు ఈస్టిండియా కంపెనీ దినములలో మదాసు రాష్ట్రములో సత్పరిపాలకుడుగా ప్రజలయాదరమును పొందినవాడు. ఈయన పుణ్యక్షేత్రములకేగి భక్తితో హిందూదేవతల నారాధించెడివాడు. దేవాలయ ప్రవేశము పొందదగని వాడగుటచే దూరముననేయుండి నమస్కరించుటయేకాక యితర దేవోపచారములనుగూడ గావించెడివాడు. కడపజిల్లాలో పాపఘ్నినది యొద్దనున్న వాయింపల్లి గండిలోని ఆంజనేయస్వామివారి యాలయమున కాయన కొన్ని దానములు చేసెను; ఇంకను ఎన్నో యాలయములకు కూడ చేసెను. ప్రజలీయనను మాండవ్య నామముతో వ్యవహ

రించుచుండిరి. ఈతడు స్వయముగాకూడ నాపేరును వాడుకొనుచుండెను. తిరుపతి వెంకటేశ్వరుని యాలయమున కీతడు దానముచేసిన పెద్దగంగాళము నేటికిని కలదు.

సామాన్యముగా మానవులదృష్టికి కన్పట్టని వస్తువులు మన్రోదృష్టికి కన్పట్టుచుండెను. ఒకసారి యాయన వెల్లూరు సమీపములో గుఱ్ఱముపై నేగుచుండగా నేదో పెద్దజంతువు వచ్చి గుఱ్ఱముమీది కురుకుచున్నట్లాతనికి కన్పట్టెను. ఆసంగతి నాతడు తన ప్రక్కనే వచ్చుచున్నవారితో చెప్పెను. వారి కాజంతువు కన్పట్టలేదు. ఉత్తరక్షణములోనే నెత్తురు దేహము నుండి స్రవింపగా గుఱ్ఱము క్రిందపడి చచ్చిపోయెను. అంతమన్రో "అదిగో ఆ జంతువు కొట్టిపోవుచున్నది" అనెను. అప్పుడుకూడ వారి కాజంతువు కన్పట్టలేదు. ఇట్టి భౌతికాతీతదృష్టిని మన్రో అనేక సందర్భములలో కన్పఱచెను. ఒకనా డీతడు సూర్యోదయ సమయమున నొకకొండమీద నొక యద్భుతదృశ్యమును చూచి తనకు మరణ మాసన్నమాయెనని చెప్పెను. అట్లే యాతడు ప్రత్తికొండలో మరణించెను.

## సోదరి నివేదిత

సోదరి నివేదిత వివేకానందస్వామి శిష్యురాలుగా భారతదేశమునకు వచ్చి యిచ్చట స్థిరపడిపోయెను. 1867 లో

ఇంగ్లండులో జన్మించి 1911లో వంగరాష్ట్రములోని డార్జిలింగ్‌లో నీమె మరణించెను. ఈమె భారతీయాచారముల ననుసరించుటలో నించుమించు అనీబిసెంటు కోవకు చెందినది. ఆదిలో నీమెపేరు మిస్ మార్గరెట్ నోబెల్. పేరును, వేషమునుకూడ నీమెమార్చుకొనెను. భారతీయజీవితమునసుసరించి The Web of Indian Life, Cradle Tales of Hinduism మున్నగు గ్రంథముల నీమె రచించెను. భారతీయుల బాహ్యాచారములనే కాక పరమేశ్వరోపాసనామార్గములనుకూడ నీమె యనుసరించెను.

విగ్రహారాధనపద్ధతి నీమె సమర్థించుటయేకాక స్వయముగా హిందూదేవతల నారాధించుచుండెను; శివ విష్ణు కాళికాది దేవతారూపముల యారాధనము అఖండ పరమేశ్వరారాధనమునకు వ్యతిరిక్తము కాదనియు, పైగా అది పటిష్ఠమైన ఏకేశ్వరోపాసనాపద్ధతి యనియు నీమె నిరూపించెను. కాళీదేవ్యుపాసనమువల్ల పాశ్చాత్యులకే కాక కొందరు భారతీయులకు కూడ అపోహలుండుటచే నామె "Kali The Mother"అను గ్రంథములో కాళికోపాసనము నిట్లుసమర్థించెను:

"మనకు మంచిదనిపించు వస్తువులనిచ్చు స్వరూపములో మాత్రమే భగవంతుని దర్శించి యారాధించుట తద్దయుగా లోకములో కన్పట్టును కాని భారతీయులు పరమే

శ్వరు జేదిచేసినను దాని నానందముతోనే గ్రహింపవలయు నను తత్త్వములోనివారు. ఈ తత్త్వము నుపాసనాపద్ధతిలో కూడ వారు చూపినారు. మనలను కబళించుట కుంకించుచు లేలిహాన జిహ్వాకరాళమైన కాళికాయాపములో పరమేశ్వరు నారాధించుటకంటె భగవంతున కాత్మార్పణము గావించు కొనుపద్ధతి మరి యేది యుండును?''

ఈరీతిగా నామె భారతీయాచారములను, సంప్రదాయ ములను సమర్థించెను. కాశీ రామేశ్వరాది పుణ్యక్షేత్రముల నీమె దర్శించెను; చాలభాగము కాలినడకనే ప్రయాణము చేయుచుండెను. ఈ విధముగ హిందువుల తీర్థక్షేత్రములను సేవించిన పాశ్చాత్యులు మిక్కిలి యరుదు.

## ఆంగ్ల సాహిత్యాధినేతలు

జీవితమంతయు సంస్కృత వాఙ్మయములో కృషిచేసిన పాశ్చాత్యులకు భారతీయ సంస్కృతి యంటుననునది యెల్లరు నెఱిగియున్న విషయమే; కాని సాంస్కృతికులుగా కొంచమైనను విదితులుకాక కేవలము ఆంగ్లరచయితలుగాను, కవులు గాను ప్రఖ్యాతులైన కొంతమందిపై కూడ భారతీయసం స్కృతి ప్రభావము పడియున్నదని మనము గుర్తింపవలసి యున్నది. వృక్షమంతయు పైకి కన్పట్టుచున్నను దాని కాధా రములైన వేళ్ళేరీతిగా ప్రచ్ఛన్నములై యున్నవో యారీతిగా

ప్రసిద్ధాంగ్లరచయితలు కొందరిపై భారతీయ సంస్కృతి ప్రభావము ప్రచ్ఛన్నముగా నున్నది.

థామస్ కార్లైల్‌ను ఉన్నతశ్రేణికి చెందిన ఆంగ్లగద్య రచయితగా గౌరవించు వారెందరో కలరు. విమర్శించి చూతుమేని యాతని రచనలలో భారతీయ వేదాంతదృష్టి కన్పట్టుచునే యుండును. ఆతడు "సార్టార్ రిజార్టస్" అను గ్రంథములో నిరూపించునది భగవద్గీతలోని అనాసక్తి యోగమేయని ఈ యుభయగ్రంథములను సాదృశ్యపరిశీలన దృష్టితో పఠించినచో తెలియగలదు. ఏ తద్గ్రంథనామము గీతలోని "వాసాంసి జీర్ణా"నీత్యాది శ్లోకభావముతో సంబంధించినదని కొందరు విమర్శకులు వెల్లడించియే యున్నారు. భగవద్గీతనుకార్లైల్ (ఆంగ్లానువాదములో) చదివి దానిచే ఉద్దీపితుడైనాడనుటకు మరొక ప్రబల సాక్ష్యము కలదు. రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ అను అమెరికన్ రచయిత ఇంగ్లండుకు వచ్చినపుడు కార్లైల్ ఆతనికి భగవద్గీతాగ్రంథము నిచ్చి దానిని బాగుగ పఠింపగోరెను.

ఎమర్సన్ భగవద్గీతను శ్రద్ధతో పఠించెనని యాతని రచనలలోని హిందూవేదాంతవాసన తెలుపుటయేకాక ఆతడు ఆంగ్లభాషలో రచించిన Brahman అనుపద్యమే సాక్ష్యమిచ్చుచున్నది.

సుప్రసిద్ధాంగ్లకవి షెల్లీ భారతీయ భావములచే నుద్దీపితు డాయెననియాతని రచనలును,జీవితమునుకూడ తెలుపుచున్నవి. Skylark అను పద్యములో నాతడు అద్వైతభావములను వెల్లడించి యున్నాడు. చిత్రవిచిత్ర వర్ణములుగల గాజుపెంకుచే నాచ్ఛాదింపబడిన దీపమేరీతిగ నానాత్వవిలసితమై పైకి కన్పట్టు చున్నదో యట్లే ఏకసత్యవస్తువు ఉపాధిభేదముచే నానాత్వ విలసితమై కన్పట్టుచున్నదని యాతడు వర్ణించియున్నాడు. షెల్లీ 1822 లో ఇటలీదేశమున సముద్రములో మునిగి చని పోయెను. అదివర కాతడు వెల్లడించియుండిన కోరిక ననుస రించి యాతని దేహమునకు దహనసంస్కారము జరుపబడెను.

## టి. ఎస్. ఇలియట్

ఆధునికాంగ్లకవులలో మేటియైనవాడు టి. ఎస్. ఇలి యట్. ఇతడు నోబెల్ బహుమానముకూడ పొందియున్నాడు. అట్టివాడు భారతీయసంస్కృతిచే ఉత్తేజితుడై తన కవితచే ప్రపంచమును మెప్పింపగల్గినాడనునది గమనింపదగినది. Waste Land అను కావ్యములో 5వ భాగములో నాతడు సుమారు 40 పంక్తులు భారతీయ సంస్కృతి పరిభాషతోనే నింపినాడు. గంగా హిమవన్తి మున్నగు పదములను వాడు టయేకాక యాతడు మేఘము దకారాదులయిన మూడు సందే

శపదములను పల్కుచున్నదని వ్రాసినాడు. మేఘము ద, ద,ద అని పల్కుచున్నదట. మొదటి దకారమునకు "దత్త"రెండవ దానికి "దయధ్వం", మూడవ దకారమునకు "దమ్యత"అర్థ మని యాతడు వివరించి చెప్పినాడు, అనగా, దానము, దయ, దమ్యత (నిగ్రహము) అనునవి దివ్యసందేశములుగా వినబడు చున్నవట. మేఘధ్వనియొక్క ఈ యర్థమును తాను బృహ దారణ్యకోపనిషత్తు(5–12)నుండి (డుసేన్ భాషాంతరీకరణము నుండి) గ్రహించినానని ఇలియట్ గ్రంథాంతమందు వ్రాసి కొన్నాడు. "ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః" అను మాటలతో నాతడు ప్రకరణములను ముగించినాడు. ఒక నోబెల్ లారి యట్ ఉపనిషద్విషయముల నీరీతిగా త్రీసికొని యంతగౌరవ మును సంపాదించినాడని సాధారణముగా ప్రజ లూహింపరు. కాని ఇలియట్ పై భారతీయ సంస్కృతిముద్ర సందేహముని కవకాశము లేకుండగనే పరిస్ఫుట మగుచున్నది.

ఇష్లే స్టీఫెన్ స్పెండర్, ఆడెన్, సోమర్ సెట్ మహాఘం మున్నగు ఆంగ్లరచయితలు భారతీయసంస్కృతిచే నుద్దీపితులై రచనలను సాగించుచున్నారు.

## ప్రశంసావచనములు

వివిధశాస్త్రములలో భారతీయులు సాధించిన విజ్ఞానమునకు ముగ్ధులైన పాశ్చాత్యులు వానిలో సాగించిన కృషినిగాని,

వానిపై గావించిన ప్రశంసలనుగాని యిచట వివరించుట కవకాశము లేదు. కొందరు పాశ్చాత్యప్రముఖులు సుప్రసిద్ధ సంస్కృత గ్రంథములమీదను, సామాన్యాకారముగ భారతీయసంస్కృతిపైనను వెల్లడించిన ప్రశంసావాక్యముల నుల్లేఖించుచు నీవ్యాసమును ముగించుచున్నాను.

యూరపియన్ సాంస్కృతికులకు పితామహుడైన సర్ విలియం జోన్సు భారతీయసంస్కృతి సంగ్రహమునకు దర్పణమైన మనుస్మృతి నిట్లు ప్రశంసించియున్నాడు; "దివ్యమైన శ్రద్ధాభక్తులు, సర్వమానవులపట్లను సుహృద్భావము, సకల ప్రాణుల మీదను ప్రేమాదరములు మనుస్మృతిలో సర్వత్రి వ్యాపించియున్నవి. మనుస్మృతి శైలి శీవిగలదై, ఉదాత్తమై గంభీరమై యలరారుచుండును. మనువచనము రాజశాసనమువలె వినబడుచు భయభక్తులతో నాలకింపవలసినదిగ నుండును. భగవంతునిమీద తప్ప మరి దేనిమీదను ఆధారపడరాదను భావము నీగ్రంథము కల్గించును. రాజులనుకూడ మందలించు ఉదాత్తత మనువులో కన్పట్టును. మనుస్మృతిలోని గాయత్రీ స్తుతులను చూతుమేని మనువారాధించునది భౌతికదృగ్గోచరసూర్యుడు కాదనియు దివ్యము, అసదృశము, మహత్తమము, సృష్టిస్థితిలయస్థానము సర్వప్రకాశకము, బుద్ధిప్రదీపకమునయిన మహాతేజస్సునే మను

వారాధించెననియు తెలియగలదు.''(1794లో జోన్సు ప్రకటించిన మనుస్మృత్యాంగ్లానువాదమునకు పీఠికనుండి గృహీతము.)

ఎ. ఎ. మాక్డొనెల్ ఇట్లు నుడివియున్నాడు. "18వ శతాబ్దిలో యూరపుఖండము సంస్కృతముతో పరిచయమును పొందెను. 15 వ శతాబ్దినాటి రినైజాన్సు అనెడి వైజ్ఞానిక పునరుజ్జీవనోద్యమమునకు తర్వాత ఇంత గొప్ప వైజ్ఞానికసంఘటనము యూరపులో జరుగలేదు.''

యూరపుసంస్కృతికి మూలము భారతీయసంస్కృతియే యని వింటర్ నిడ్జి యిట్లు వాక్రుచ్చియున్నాడు; "మన సంస్కృతియొక్క మూలమును తెలిసికొన దలతుమేని, ప్రాచీనమైన ఇండో యూరపియన్ సంస్కృతిని గ్రహించుట కుపక్రమింతుమేని మనము భారతదేశమున కేగవలయును.

స మా ప్త ము